జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




రంగారెడ్డి | బుధవారం 19 ఫిబ్రవరి 2025 | సంపుటి : 17 | సంచిక : 292 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




# బలప్రదర్శనకు జనసేన

- మార్చి 14న పెద్ద ఎత్తున ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు.
- ఎన్నికల్లో విజయం తర్వాత నిర్వహించనున్న తొలి ఆవిర్భావ సభ కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది
- ఏపీలో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంలో జనసేన కీలకంగా వ్యవహరించిందన్నది బహిరంగ రహస్యమే

**విజయవాడ**

జనసేన ఆవిర్భావ వేడుకలు పిఠాపురంలో జరగనున్నాయి. మార్చి 14న పెద్ద ఎత్తున ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ఈ సంధర్భంగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా జనసేన అధినాయకత్వం ప్రణాళిక రూపొందించింది. ఎన్నికల్లో విజయం తర్వాత నిర్వహించనున్న తొలి ఆవిర్భావ సభ కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇంతకు ఈ సభ బలనిరూపణ కోసమా? వాస్తవంగా ఆవిర్భావ సభనే అంటూ రాజకీయ విశ్లేషకులు పెద్ద స్థాయిలో చర్చ సాగిస్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంలో జనసేన కీలకంగా వ్యవహరించిందన్నది బహిరంగ రహస్యమే. వెంటీలేటర్ పై ఉన్న టీడీపీకి బీజేపీతో జతచేయించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఊపిరి అందించారని పలువురి అభిప్రాయం. ఇదే మాటను పలుమార్లు టీడీపీ అధినేత చంద్రబాబు కూడా చెప్పకనే చెప్పారు. అయితే కూటమి ఏకంగా 164 సీట్లలో - మిగతా3లో

# అద్భుతంగా కుంభమేళా

- సనాతన ధర్మంపై కామెంట్లు చేయడం ఈజీనే... కానీ...!
- మహా కుంభ్ ను మృత్యు కుంభ్ అని పేర్కొన్న మమతా బెనర్జీ
- హిందూ మతంపై చాలా సులభంగా కామెంట్లు చేస్తుంటారన్న పవన్
- ఇతర మతాలపై ఇలా వ్యాఖ్యలు చేయరని వెల్లడి
- దుర్ఘటనలు జరగాలని ఎవరూ కోరుకోరు కదా అని స్పష్టీకరణ
- యోగి సర్కారు కుంభమేళాను అద్భుతంగా నిర్వహిస్తోందని కితాబు
- కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించిన పవన్ కల్యాణ్.
- భార్య అన్నా లెజినోవా, కుమారుడు అకిరా నందన్‌లతో కలిసి వచ్చిన పవన్



**ప్రయాగరాజ్**

యూపీలోని ప్రయాగరాజ్ లో కుంభమేళాలో పాల్గొన్న సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను జాతీయ మీడియా పలకరించింది. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మహా కుంభ్ ను మృత్యు కుంభ్ గా అభివర్ణించడం పట్ల పవన్ స్పందించారు. ఈ వ్యాఖ్యలు చాలా తప్పు అని ఖండించారు. "సనాతన ధర్మంపై, హిందూ ధర్మంపై చాలా సులభంగా వ్యాఖ్యలు చేస్తుంటారు... అదే మన నాయకులతో వచ్చిన సమస్య. వారు హిందూ మతంపై చేసినంత సులభంగా ఇతర మతాలపై వ్యాఖ్యలు చేయరు. ఇలాంటి ధోరణి ఉన్న నాయకులతో కష్టమే. తమ వ్యాఖ్యలతో కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నామని వాళ్లు తెలుసుకోరు. కుంభమేళాలో కొన్ని ఘటనలు జరిగాయంటే అది నిర్వహణా వైఫల్యం అనలేం. కోట్లాది మంది తరలివచ్చే- మిగతా3లో



## అర్ధరాత్రి నిర్ణయం సరికాదు

- సీఈసీ ఎంపికపై విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హెూం మంత్రి అమిత్‌షా అర్ధరాత్రి వేళ నిర్ణయం తీసుకోవడం అగౌరవప్రదమైన చర్య
- కార్యనిర్వాహక వర్గం జోక్యం లేని స్వతంత్ర ఎలక్షన్ కమిషన్‌లో ఎన్నికల సంఘం కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషన్‌ను ఎంపిక చేసే ప్రక్రియ కీలకం.

# ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉండదు



- తప్పు చేసిన వారిని బట్టలూడదీసి నిలబెడతాం
- ఏపీలో దిగజారిపోయిన లా అండ్ ఆర్డర్
- తప్పు చేయకపోయినా వల్లభనేని వంశీని అరెస్టు చేశారు
- టీడీపీ ఫిర్యాదులో ఆయన పేరు ఎక్కడా లేదు
- జైలులో వంశీతో ములాఖత్ తర్వాత మీడియాతో వైసీపీ అధినేత జగన్

**విజయవాడ**

అధికారంలోకి వచ్చాక తప్పు చేసిన వారినెవ్వరినీ వదలిపెట్టనని వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి హెచ్చరించారు. అరెస్టు అయి ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం ములాఖత్ అయ్యారు. అనంతరం అక్కడే ఆయన మీడియాతో మాట్లాడారు.. అన్యాయాలు చేసిన వారిని బట్టలూడదీసి నిలబెడతామని వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కూలిపోతోందని, ప్రతీ చోటా కేసులు పెట్టి బెదిరిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబుకు వల్లభనేని వంశీని చూస్తే ఆక్రోశం వస్తోందని వైయస్ జగన్ పేర్కొన్నారు. వంశీపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారు. - మిగతా3లో

# మహా కుంభ్‌కాదు.. మృత్యుకుంభ్



- సీఎం మమతా బెనర్జీ వివాదాస్పద వ్యాఖ్యలు
- 'కుంభమేళాకు వెళ్లి భక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు
- యూపీ సర్కార్ వీఐపీల కోసమే ఏర్పాట్లు చేసింది
- సామాన్యుల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు
- నేను మహా కుంభమేళాను గంగామాతకు గౌరవ సూచికంగా భావిస్తున్నాను

# ఏపీలోని యూనివర్శిటీలకు వీసీల నియామకం

## నోటిఫికేషన్ విడుదల చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లోని పలు యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ల నియమిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. విశాఖపట్నంలో ఉన్న ఆంధ్రా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఐఐటీ ఖరగ్‌పూర్‌లో గణితశాస్త్ర ఆచార్యునిగా చేస్తున్నారు. కాకినాడ జేఎన్టీయూ వీసీగా ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను నియమించారు. ప్రస్తుతం ఆమన వరంగల్ నిట్‌లో సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. యోగి వేమన వర్సిటీకి వీసీగా ప్రొఫెసర్‌గా పి.ప్రకాశ్‌బాబు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన హెచ్‌సీయూ, స్కూల్ ఆఫ్ లైఫ్‌సైన్సెస్‌లో బయో టెక్నాలజీలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరంతా మూడేళ్లపాటు ఆయా వర్సిటీలకు వీసీగా కొనసాగనున్నారు. నూతనంగా నియమించిన - మిగతా3లో



# అక్రమ వలసదారులను ఎలా గుర్తిస్తారంటే



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులను ఆ దేశం నుంచి పంపిస్తున్నారు. ఇందుకోసం దేశమంతా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వందల మందిని తరలించారు. ఇటీవలే 312 మందితో భారత్‌కు కూడా ఓ విమానం వచ్చింది. ఇందులో గుజరాత్, హరియాణా, పంజాబ్‌లకు చెందిన అక్రమ వలసదారులు ఉన్నారు. వారంతా స్వదేశానికి వచ్చారు. అమెరికా ఎవరిని బహిష్కరిస్తుంది.. మళ్లీ వారు అక్కడకు వెళ్లొచ్చా అన్న సందేహాలు కూడా కలుగుతున్నాయి. అమెరికా నుంచి ఎవరిని బహిష్కరిస్తున్నారనే వివరాలను మైగ్రేషన్ పాలసీ రిపోర్టు కొన్ని వివరాలు వెల్లడించింది. అనధికారికంగా ఉంటున్నవారినే బహిష్కరిస్తారని చాలా మంది భావిస్తున్నారు. అయితే దేశంలో చట్టబద్ధంగా నివసిస్తూ సిటిజన్‌షిప్ పొందని వలసదారులు కూడా కొన్ని పరిస్థితుల్లో బహిష్కరణకు గురికావొచ్చు. అనధికారిక వలసదారులు, అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించిన వారు, వీసా గడువు ముగిసినా దేశంలో ఉంటున్నవారిని వారి దేశాలకు పంపించవచ్చు. తాత్కాలిక వీసాపై అమెరికాకు వెళ్లి అక్కడే నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్నవారిని కూడా బహిష్కరిస్తుంది. అక్రమ వలసదారులే కాకుండా అమెరికాలోని గ్రీన్‌కార్డు హోల్డర్లు, తాత్కాలిక వీసా హోల్డర్లు కూడా బహిష్కరణకు గురికావొచ్చు. అయితే ఈ కోవలోకి వచ్చే వక్తులు నేరాలకు పాల్పడినట్లు నిరూపణ కావాలి. ఈ నేరాలలో తాగి వాహనం నడపడం, అనుమతి లేకుండా ఆయుధాలతో దొరికిపోవడం, డ్రగ్స్ తీసుకోవడం, తిరగడం, హింసాత్మక నేరాలకు పాల్పడడం వంటివి ఉన్నాయిఅనైతిక చర్యలతో కూడిన నేరానికి పాల్పడిన వ్యక్తిని బహిష్కరించడానికి రెండు మార్గాలు ఉన్నాయి. మొదటిది అమెరికాలో నివసించిన మొదటి ఐదేళ్లలో అనైతికంగా భావించే నేరానికి పాల్పడడం, రెండోది వేర్వేరు కేసుల్లో రెండు లేదా అంతకన్నా ఎక్కువ అనైతిక నేరాలకు పాల్పడడం, రెండోదానికి కాలపరిమితి లేదు. అయితే అనైతిక చర్యలతో కూడిన నేరం అంటే ఏమిటో స్పష్టమైన నిర్వచనం లేదు. ఈ విషయంపై అమెరికా కోర్టులు ఎప్పటికప్పుడు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నాయి. వీటిలో మోసం, వ్యక్తులు లేదా ఆస్తికి హాని కలిగించే ఉద్దేశం, మరణ లేదా దోపిడీకి కారణమయ్యే వారు, భార్యాభర్తల మధ్య హింస మొదలైనవి. అమెరికా ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్వో) అధికారులు ఆ దేశంలో వలస చట్టాలను అమలు చేసే పనిలో ఉంటారు. ఈ అధికారులు నేషనల్ సెక్యూరిటీ వ్యవహారాలు చూస్తుంటారు. ఇమిగ్రేషన్ అమలు ప్రక్రియ అన్ని దశలను ఈఆర్వో నిర్వహిస్తుంది. ఇమిగ్రేషన్ అమలు ప్రక్రియ అన్ని దశలను ఈఆర్వో నిర్వహిస్తుంది. బహిష్కరణకు అర్హత ఉన్నవారి గుర్తింపు, అరెస్టు, నిర్బంధం, వారి దేశాలకు పంపిచే ప్రక్రియ తదితరాలు ఉంటాయి. ఇక బహిష్కరణకు అర్హులైన వ్యక్తులను గుర్తించడానికి లక్ష్య(టార్గెటెడ్), గూఢచార కార్యకలాపాలను ఈఆర్వో నిర్వహిస్తుంది. క్రిమినల్ అరెస్ట్ వారెంట్‌లను అమలుఏయడం, బహిష్కరణకు అర్హత ఉన్న వ్యక్తుల అరెస్టులతోపాటు ఇమ్మిగ్రేషన్ సంబంధిత క్రిమినల్ చర్యల కోసం ప్రాజిక్యూషన్ ప్రారంభించే అధికారం ఈఆర్వోకు ఉంది. ఈఆర్వో విభాగం అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ప్రధానంగాఎండు వర్గాలుగా విభజిస్తారు. ఒకటి అమెరికా పౌరసత్వం ఉన్నవారు, రెండోది అమెరికాలో వారి నేర చరిత్ర ఆధారంగా నిర్ణయిస్తారు..

**అమెరికాలో అమ్మకానికి ఇళ్లు**
**90 రోజుల్లో 1200 ఇళ్లు**

అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. జనవరి 20న ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే ఆయన ఎన్నికల హామీలు నెరవేర్చడంపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే మేక్ అమెరికా గ్రేట్ ఎగై న్ నినాదంతో ముందుకు వెళ్తున్నారు. ట్రంప్ నిర్ణయాలతో ప్రపంచ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. ప్రధానంగా అక్రమ వలసదారులను ఖైదీల్లా స్వదేశాలకు పంపుతున్నారు. జన్మతః సిటిజన్‌షిప్ రద్దు చేశారు. మరోవైపు కెనడా, మెక్సికో, చైనా దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించారు. స్టీల్, అల్యూమినియం దిగుమతిపైనా భారీగా పన్ను విధించారు. ట్రంప్ నిర్ణయాలతో ప్రపంచదేశాలతోపాటు అమెరికాలో ఉంటున్న విదేశీయులు ఇబ్బంది పడుతున్నారు. ఆ దేశ ప్రజలు కూడా భయపడుతున్నారు. దీంతో వాషింగ్టన్ డీసీలో రియల్ ఎస్టేట్ మార్కెట్ పతనం అవుతోంది. దీంతో వేల ఇళ్లను అమ్మకానికి ఉంచారు. అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో 14 రోజుల్లో 4,271 కన్నా ఎక్కువ ఇళ్లను అమ్మకానికి ఉంచారు. ఈవిషయాన్ని ఒక ఎక్స్ యూజర్ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఎలుకలు పారిపోతున్నాయి. అని కాప్షన్ ఇచ్చాడు. నగరవాసులు తమ వసుత్వులు సర్దుకుని సామూహికంగా నగరం విడిచి వెళ్లిపోతున్నారని తెలిపారు. ఈ వలసలకు కారణం ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ అని స్థానికులు చెబుతున్నారు. నగరంలో, చుట్టుపక్కలక అమ్మకానికి ఉన్న 14,825 ఇళ్లను చూపించే ఫొటోలు కూడా సోషల్ మీడియాలో షేర్‌చేశారు. నగరంలో 500లకుపైగా ఇళ్లు, రూ.8 కోట్లకన్నా ఎక్కువ ధరకు అమ్మకానికి ఉన్నాయి వెల్లడించారు. అమెరికన్లను సురక్షితంగా ఉంచే విధానాలపై పనిచేసే థింక్ ట్యాంక్ అయిన సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీలో పనిచేస్తున్న సీనియర్ విశ్లేషకుడు తెలిపారు. ఆన్‌లైన్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్లేస్ అయిన జిల్లోలో అమ్మకానికి ఉన్న ఇళ్ల జాబితాను మరో ఎక్క యూజర్ షేర్ చేశాడు. ఏడు రోజుల్లో 201, 14 రోజుల్ల 378, 30 రోజుల్లో 706, 90 రోజుల్లో 1,198 కొత్త ఇళ్లు అమ్మకానికి వచ్చినట్లు వివరించాడు. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా ఎక్స్‌లో పోస్టు చేశాడు. అక్రమ వలసదారులను తరలిస్తుండడంతో వారంతా అప్పటికే కొనుగోలు చేసిన ఇళ్లను అమ్మకానికి పెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో ఇళ్ల అమ్మకాలు పెరుగుతున్నాయి.

# ఆసియాను శాసిస్తున్న ఇండియన్ బిలీయనీర్స్



**న్యూఢిల్లీ :** ఆసియాలోని సంపద చార్టులలో భారతీయులు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ కొన్నేళ్లుగా అగ్రస్థానంలో ఉంటున్నారు. తాజాగా ఈ జాబితాలో పలు భారతీ కుటుంబాలు కూడా చేరాయి. ప్రపంచంలో అత్యంత ధనవంతుడు టెస్లా, స్పేస్ ఎక్, ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్. ప్రస్తుతం డోస్ చైర్‌పర్సన్‌గా కూడా ఉన్నారు. ఆయనతో అనేక మంది పోటీ పడుతున్నారు. కానీ, రెండేమూడేళ్లుగా మస్కే అగ్రస్థానంలో ఉంటున్నారు. ఇక ఆసియా ధనవంతుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ టాప్ వన్‌లో ఉన్నారు. ఆయనతో అనేక మంది పోటీ పడుతున్నా.. అగ్రస్థానంలో అంబానీ కుటుంబమే ఉంది. తాజాగా బ్లూమ్‌బెర్గ్ ఆసియాలో అత్యంత సంపన్నులైన 20 జాబితా విడుదల చేసింది. ఇందులో ఆరుగురు భారతీయులు ఉన్నారుఅంబానీ కుటుంబం 90.5 బిలియన్ డాలర్ల సంపదతో బ్లూమ్‌బెర్గ్ చార్టులలో అగ్రస్థానంలో ఉంది. ఈ కుటుంబానికి చెందిన ప్రధాన సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్. దివంగత పారిశ్రామికవేత్త ధీరూభాయ్ అంబానీ కుమారుడు ముఖేష్ అంబానీ నేతృత్వంలో ఈ సంస్థ ఉంది. అతని నివాసం, 27 అంతస్తుల భవనం, ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఖరీదైన ప్రైవేట్ నివాసంగా పిలువబడుతుంది. జాబితాలో రెండోస్థానంలో థాయిలాండ్‌లోని చీరవనాంట్ కుటుంబం, మొత్తం సంపద 42.6 బిలియన్ డాలర్లు. ఇది అంబానీల సంపదలో సగం కంటే తక్కువ. ఈ కుటుంబం ఆహారం, రిటైల్ మరియు టెలికాం యూనిట్లను నిర్వహించే చారోయెన్ పోక్‌ఫాండ్ గ్రూప్‌ను కలిగి ఉంది. బ్యాంక్ సెంట్రల్ ఆసియాతో వారి విజయం, పొగాకు వ్యాపారంతో వారి ప్రారంభం కారణంగా ఇండోనేషియాకు చెందిన హార్టోనో కుటుంబం 42.2 బిలియన్ల డాలర్ల సంపదతో తదుపరి స్థానంలో ఉంది. జాబితాలో నాల్గవ స్థానంలో భారతదేశానికి చెందిన మిస్త్రీ కుటుంబం ఉంది, ఈ కుటుంబం సంపద 37.5 బిలియన్ల డాలర్లు. ఈ కుటుంబానికి చెందిన షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ ఇంజనీరింగ్ నిర్మాణంతో సహా బహుళ రంగాలలో పనిచేస్తుంది. భారతదేశంలోని అతిపెద్ద సమ్మేళన సంస్థలలో ఒకటైన టాటా గ్రూప్‌లో ఈ కుటుంబం గణనీయమైన వాటాను కలిగి ఉంది. ఐదవ స్థానంలో హాంకాంగ్‌లోని అతిపెద్ద రియల్ ఎస్టేట్ డెవలపర్‌లలో ఒకటైన సన్ హంగ్ కై ప్రాపర్టీస్‌ను కలిగి ఉన్న హాంకాంగ్‌కు చెందిన క్వాక్ కుటుంబం ఉంది. ఈ కుటుంబ సంపద 35.6 బిలియన్ల డాలర్లుతైవాన్‌కు చెందిన త్సాయ్ కుటుంబం 30.9 బిలియన్ల డాలర్లతో ఆరవ స్థానంలో ఉంది. ఈ కుటుంబ సంపద ప్రధానంగా కాథే లైఫ్ ఇన్సూరెన్స్ మరియు ఫుబన్ ఇన్సూరెన్స్ నుండి వచ్చింది, అదే సమయంలో రియల్ ఎస్టేట్ మరియు టెలికాం వంటి ఇతర రంగాలలోకి కూడా విస్తరించింది. భారతదేశానికి చెందిన జిందాల్ కుటుంబం 28.1 బిలియన్ల డాలర్ల నికర విలువతో ఏడవ స్థానంలో ఉంది. ఇది ఉక్కు, శక్తి, సిమెంట్ మరియు క్రీడలు వంటి రంగాలలో వ్యాపార ప్రయోజనాలను కలిగి ఉన్న ప్రసిద్ధ ??క జిందాల్ గ్రూప్‌ను కలిగి ఉంది. థాయ్‌లాండ్‌కు చెందిన యూవిధ్య కుటుంబం ఎనిమిదో స్థానంలో నిలిచింది, వీరికి టీసీపీ గ్రూప్ ఉంది. వీరి సంపద 25.7 బిలియన్ల డాలర్లు. ఈ గ్రూప్ రెడ్ బుల్ అనే ఎనర్జీ డ్రింక్‌ను ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ చేస్తుంది. బిర్లా కుటుంబం జాబితాలో తొమ్మిదవ స్థానంలో ఉంది. 23.0 బిలియన్ల డాలర్ల నికర విలువతో, ఆదిత్య బిర్లా గ్రూప్ ఆర్థిక సేవలు, మెటల్ మరియు రిటైల్ వంటి పరిశ్రమలలో ఆసక్తిని కలిగి ఉంది. శామ్‌సంగ్‌ను నడుపుతున్న దక్షిణ కొరియాకు చెందిన లీ కుటుంబం 22.7 బిలియన్ల డాలర్ల సంపదతో జాబితాలో పదవ స్థానంలో నిలిచింది. అలాగే, బజాజ్, హిందూజా కుటుంబాలు వరుసగా 20.1 బిలియన్లు 15.2 బిలియన్ల డాలర్ల నికర విలువతో ప్రపంచ వ్యాపార వేదికపై భారతదేశం ప్రభావాన్ని ప్రదర్శిస్తూ టాప్ 20లో ఉన్నాయి.

# సీఎంతో విభేదాలపై ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు



**ముంబై:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు, ఆయన డిప్యూటీ ఏక్‌నాథ్ షిండేకు మధ్య 'ప్రచ్ఛన్న యుద్ధం' జరుగుతోందా? 20 మంది శివసేన వర్గం ఎమ్మెల్యేల భద్రతను 'వై ప్లస్' క్యాటగిరికి తగ్గించడం, రాయ్‌గఢ్, నాసిక్‌లకు ఇన్‌చార్జుల నియామకంపై షిండే శివసేన అభ్యంతరం తెలవడం వంటి వరుస పరిణామాల నేపథ్యంలో ఇద్దరి మధ్యా వ్యవహారం చెడిందనే ఊహాగానాలు ఉపందుకుంటున్నాయి. దీనిపై ఏక్‌నాథ్ షిండే ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. సీఎం, డిప్యూటీ సీఎం మధ్య "కోల్డ్ వార్" నడుస్తున్నట్టు మీడియాలో వస్తున్న వార్తలపై షిండే స్పందిస్తూ, తమ మధ్య ఎలాంటి "కోల్డ్ వార్" లేదన్నారు. "థండా థండా కూల్ కూల్" అని నవ్వుతూ సమాధానమిచ్చారు. "ఎలాంటి కోల్డ్ వార్ లేదు. మాదేమీ మహా వికాస్ అఘాడి (విపక్ష కూటమి) కాదు, ఇండి కూటమి కాదు. రాష్ట్ర ప్రగతి కోసం మేము సమష్టిగా పనిచేస్తున్నాం" అని ఏక్‌నాథ్ షిండే వివరణ ఇచ్చారు.

20 మంది ఎమ్మెల్యేల భద్రత కుదింపు

సీఎం ఫడ్నవిస్ నేతృత్వంలో రాష్ట్ర హోం శాఖ ఇటీవల శివసేనకు చెందిన 20 మంది అధికార ఎమ్మెల్యేల 'వై' కేటగిరి భద్రతను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. బీజేపీ, ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యేల భద్రతను కూడా తగ్గించనుంది. అయితే షిండే వర్గంతో పోలిస్తే ఈ సంఖ్య చాలా తక్కువనే చెప్పాలి.

## మహా కుంభ్‌కాదు.. మృత్యుకుంభ్'



**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సంగమం 'మహాకుంభ మేళా'ను మహా కుంభ్ కాదు.. మృత్యుకుంభ్ అని వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఇవాళ అసెంబ్లీలో మమతా బెనర్జీ కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటపై స్పందించారు. 'కుంభమేళాకు వెళ్లి భక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు.. యూపీ సర్కార్ వీఐపీల కోసమే ఏర్పాట్లు చేసింది. సామాన్యుల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. నేను మహా కుంభమేళాను గంగామాతకు గౌరవ సూచికంగా భావిస్తున్నాను. కానీ పేదలకు కనీస సదుపాయాలు లేవు. వీఐపీల కోసం మాత్రమే ఏర్పాట్లు చేశారు. తొక్కిసలాటలో మరణించిన బాధిత కుటుంబాలకు ఇప్పటి వరకు ఎలాంటి ఎక్స్‌గ్రేషియా అందలేదు. పోస్ట్‌మార్టం చేయకుండా మృతదేహాల్ని వారి కుటుంబాలకు అప్పగించారు. పోస్టుమార్టం చేసి, డెత్ సర్టిఫికెట్ జారీ చేస్తేనే కదా ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా అందేది. బాధిత కుటుంబాలు ఇప్పుడు ఎక్స్ గ్రేషియా ఎలా పొందుతారు' అని ప్రశ్నించారు. కాగా, ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 ప్రారంభమైన మహాకుంభ మేళా 45 రోజులపాటు అంటే ఫిబ్రవరి 26వరకు కొనసాగనుంది.

## అర్ధరాత్రి నిర్ణయం సరికాదు



**న్యూఢిల్లీ:** భారత ప్రధాన ఎన్నికల కమిషన్‌గాజ్ఞానేశ్ కుమార్ ఎంపికైన కొద్ది గంటలకే ఎంపిక కమిటీలో సభ్యుడైన విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. సీఈసీ ఎంపికపై అభ్యంతరాలు వ్యక్తుం చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరుగుతుండగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా అర్ధరాత్రి వేళ నిర్ణయం తీసుకోవడం అగౌరవప్రదమైన చర్య అవుతుందన్నారు. సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా రాహుల్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. "సీఈసీ ఎంపిక కమిటీ సమావేశంలో మోదీ, అమిత్‌షాకు అభ్యంతరాల నివేదకను అందజేశాను. కార్యనిర్వాహక వర్గం జోక్యం లేని స్వతంత్ర ఎలక్షన్ కమిషన్‌లో ఎన్నికల సంఘం కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషన్‌ను ఎంపిక చేసే ప్రక్రియ కీలకం. ఎంపిక కమిటీ నుంచి సీజేఐను తొలగించడం ద్వారా మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించింది. ఇది ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై లక్షలాది మంది ఓటర్ల ఆందోళనకు కారణమవుతోంది" అని రాహుల్ అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జాతి నిర్మాతల సిద్ధాంతాలకు కట్టుబడటం, ప్రభుత్వాన్ని జవాబుదారీని చేయాల్సిన బాధ్యత ఒక ప్రతిపక్ష నేతగా తనకు ఉందని రాహుల్ చెప్పారు. కమిటీ కూర్పు, ప్రక్రియను సుప్రీంకోర్టులో సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌పై మరో 48 గంటల్లోనే విచారణ జరగాల్సి ఉండగా రాత్రికి రాత్రి ప్రధాని, హోం మంత్రి నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ సైతం సోమవారంనాడు ఇదే రకమైన డిమాండ్ చేసింది. సీఈసీ ఎంపిక ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఈనెల 19న తుది తీర్పు రానుందనీ, అంతవరకూ సీఈసీ నియామక ప్రక్రియను వాయిదా వేయాలని ఆ పార్టీ కోరింది. అయితే, యథాప్రకారం భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేష్ కుమార్, ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి పేర్లను త్రిసభ్య కమిటీ ఖరారు చేసింది. ఆ పేర్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కమిటీ పంపగా ఆమె వెంటనే ఆమోదించారు

## ఢిల్లీ సీఎం ప్రమాణానికి కేజ్రీవాల్‌కు ఆహ్వానం



**న్యూఢిల్లీ:** దేశరాజధాని ఢిల్లీలో నూతన ప్రభుత్వం ఏర్పాటుకు బీజేపీ జోరుగా సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ నేత కేజ్రీవాల్‌ను సీఎం ప్రమాణ స్వీకార మహోత్సవానికి పిలుస్తారా లేదా అనే ప్రశ్న చాలామంది మదిలో మెదులుతోంది. ఇప్పుడు దీనికి సమాధానం దొరికింది. బీజేపీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం ఆమ్ ఆద్మీ పార్టీ సమన్వయకర్త, మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను, మరో మాజీ ముఖ్యమంత్రి ఆతిశీని ఈ కార్యక్రమానికి ఆహ్వానించనున్నారు. నూతన సీఎం ప్రమాణస్వీకారోత్సవానికి ఢిల్లీలోని లక్షమంది చోటామోటా నేతలను బీజేపీ ఆహ్వానించనుందని తెలుస్తోంది. అయితే కొత్త సీఎం ఎవరనేది బీజేపీ అధిష్టానం ఇంకా ప్రకటించలేదు. అయినప్పటికీ ప్రమాణస్వీకారానికి సన్నాహాలు ముమ్మరమయ్యాయి. బీజేపీ నేతలు వినోద్ తావ్డే, తరుణ్ చుగ్, వీరేంద్ర సచ్‌దేవ్ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులను ప్రత్యేకంగా ఆహ్వానించనున్నారు. ఫిబ్రవరి 19న జరగబోయే బీజేపీ ఎమ్మెల్యేల సమావేశంలో ఢిల్లీ సీఎంగా ఎవరిని ఎంపిక చేయనున్నారనేది వెల్లడికానుంది. తొలుత ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 19న నిర్వహించాలని బీజేపీ అధిష్టానం భావించింది. తరువాత ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 20న నిర్వహించాలని నిశ్చయించారు. ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి పేరుపై తుది నిర్ణయం తీసుకునేందుకు బీజేపీ కేంద్ర పరిశీలకులను నియమించనున్నదని సమాచారం. ఈ పరిశీలకులు ఢిల్లీ అసెంబ్లీ ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తారు. వీటి ఆధారంగా పార్టీ ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి పేరును ప్రకటిస్తుంది. కాగా ముఖ్యమంత్రి రేసులో న్యూఢిల్లీ ఎమ్మెల్యే ప్రవేశ్ వర్మ, ఢిల్లీ బీజేపీ మాజీ అధ్యక్షుడు విజేందర్ గుప్తా, రేఖ గుప్తా, సతీష్ ఉపాధ్యాయ్ పేర్లు ముందు వరుసలో ఉన్నాయని తెలుస్తోంది.

# ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉండదు

-మొదటిపేజీ తరువాయి

ఈ కేసులో గన్నవరం టీడీపీ కార్యాలయంలో దాడి జరిగిందని చెప్పి ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ అనే వ్యక్తి గన్నవరం టీడీపీ ఆఫీస్ లో పనిచేస్తున్న ఈ వ్యక్తి సాక్షాత్తు తానే జడ్జ్ గారి సమక్షంలో, జడ్జ్ ఇచ్చిన సమన్లతో, పోలీసుల నుంచి సమన్లు అందుకుని, న్యాయస్థానం ముందుకు వచ్చి జడ్జ్ ముందు హాజరై వాగ్మూలం ఇచ్చారు. ఆ వాగ్మూలంలో ఆయన వంశీ ఎలాంటి తప్పు చేయలేదని చెప్పినప్పటికీ కూడా వంశీపై తప్పుడు కేసును బనాయించారు. 2023, ఫిబ్రవరి 19న మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో పట్టాభి అనే వ్యక్తితో వంశీపై భరించలేని విధంగా చంద్రబాబు బూతులు తట్టించారు. మర్నాడు ఫిబ్రవరి 20న చంద్రబాబు నేరుగా గన్నవరంకు పట్టాభిని పంపారు. అక్కడ పట్టాభి మళ్ళీ ప్రెస్ మీట్ పెట్టి వల్లభనేని వంశీని తిట్టారు. అ తర్వాత అక్కణ్ణుంచి ఒక ప్రదర్శనగా వెళ్లి వైయస్ఆర్‌సీపీ కార్యాలయం చేరుకుని అక్కడ, శీనయ్య అనే దళిత సర్పంచ్‌పై దాడి చేశారు. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన గన్నవరం సీఐ కనకారావుపైనా టీడీపీ మూకలు దాడి చేశాయి. పట్టాభి, ఆయన అనుయాయులు సీఐ కనకారావు తల పగలగొట్టారు. ఆ ఘటన తర్వాత పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. అయితే అప్పుడు మేమే అధికారంలో ఉన్నా ఏకపక్షంగా వ్యవహరించలేదు. పోలీసులు సుమోటోగా తెలుగుదేశం వారితో పాటు వైయస్ఆర్ సీపీ వారిపైనా కూడా కేసులు పెట్టారు. అందులో ఎక్కడా వల్లభనేని వంశీ పేరు లేదు. కారణం వంశీ ఘటనా స్థలంలో లేరు.

ఇది జరిగిన రెండు రోజుల తరువాత గన్నవరం టీడీపీ ఆఫీస్‌లో డీటీపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న సత్యవర్ధన్ అనే దళిత యువకుడిని మంగళగిరిలోని టీడీపీ ఆఫీస్ కు చంద్రబాబు మనుషులు పిలిపించారు. అక్కడ సత్యవర్ధన్ తో తెల్లకాగితంపై సంతకం తీసుకుని మరో ఫిర్యాదు ఇప్పించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఆ కేసులోనూ ఎక్కడా వంశీ పేరు లేదు. కారణం వంశీ ఆ ఘటనా స్థలంలో లేరు కాబట్టి. 2023 ఫిబ్రవరి 23న పోలీసులు సత్యవర్ధన్ నుంచి 161 స్టేట్ మెంట్ రికార్డు



చేశారు. ఈ స్టేట్‌మెంట్ లో కూడా ఎక్కడా వంశీ పేరు లేదు. ఘటన జరిగినప్పుడు తాను అక్కడ నుంచి వెళ్ళిపోయాను అని కూడా చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే వంశీని టార్గెట్ చేయడం మొదలుపెట్టారు. 2024 జూలై 10న ఆ కేసు రీఓపెన్ చేశారు. వంశీపై చంద్రబాబు పెట్టుకున్న ఆక్రోశం, కోపం ఏ స్థాయిలో ఉందంటే, ఎలాగైనా సరే వంశీని ఈ కేసులో ఇరికించాలని, వంశీ ఘటనా స్థలంలో లేకపోయినా కూడా, ఆయన్ను ఈ కేసులో 71వ నిందితుడిగా చేర్చారు. మొత్తం 94 మందిపై కేసు పెడితే, నెలలు తరబడి వైయస్ఆర్ సీపీ వారిని వేధించాలని ఇంకా 44 మందికి బెయిల్ రాకుండా చంద్రబాబు అడ్డుకుంటున్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న సత్యవర్ధన్ మేజిస్ట్రేట్ ముందు హాజరై వాగ్మూలం ఇస్తే, మిగతా వారికి కూడా బెయిల్ వస్తుందనే ఉద్దేశంతో చంద్రబాబు, లోకేశ్, పోలీసులు కలిసి కుట్రపన్నారు. ఒక మనిషి తప్పు చేస్తే అతడిని శిక్షిస్తే పోలీసులకు ఒక గౌరవం ఉంటుంది. కానీ నేడు రాష్ట్రంలో తమకు నచ్చని వారిపై దొంగ సాక్ష్యాలు సష్టించి, దొంగ కేసులు పెట్టి నెలల తరబడి జైలులో పెడుతున్నారు.

**పోలీసులూ గుర్తుంచుకోండి:**

పోలీసులను ఇష్టానుసారంగా వాడుకుని ప్రజాస్వామ్యంకు తూట్లు పొడుస్తున్నారు. ఈరోజు ప్రతి పోలీస్ కు చెబుతున్నాను, మీ టోపీల కనిపించే ఆ మూడు సింహాలకు సెల్యూట్ కొట్టండి, కానీ తెలుగుదేశం నాయకులకు కాదు. వారు చెప్పినట్లు చేయడం మొదలు పెట్టి అన్యాయాలు చేస్తే ఎల్లకాలం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమే ఉండదని ప్రతి అధికారికి తెలియచేస్తున్నాను. రేపు మా అధికారం వస్తుంది. అన్యాయం చేసిన ఈ అధికారులు, నాయకులను బట్టలు ఊడదీసి నిలబెడతామని తెలియచేస్తున్నాను. ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదు. ఇదే వంశీని అరెస్ట్ చేసేప్పుడు సీఐ అన్నడంట. నేను ఒకటిన్నర సంవత్సరాల తరువాత రిటైర్ అవుతాను అని. రిటైర్ అయినా కూడా, సప్త సముద్రాల అవతల ఉన్నా కూడా, మొత్తం అందరినీ పిలిపిస్తాం. చట్టం ముందు నిలబెడతాం. బట్టలు ఊడదీస్తాం అని జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు.


# బలప్రదర్శనకు జనసేన...

-మొదటిపేజీ తరువాయి

విజయఢంకా మోగించింది. ఆ తర్వాత సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ లు భాద్యతలు చేపట్టారు. ఈ ప్రభుత్వం ఇప్పటికే 8 నెలల పాలనా కాలాన్ని పూర్తి చేసుకుంది. అయితే ప్రభుత్వం వరకు ఓకే గానీ, కూటమిలోని పార్టీలు మాత్రం ఎవరి బలాన్ని వారు పెంచుకొనే పనిలో పడ్డారని చెప్పవచ్చు. ఇటీవల టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను నిర్వహించగా, ఊహించని స్థాయిలో కోటికి పైగా సభ్యత్వ నమోదు సాగింది. అలాగే వైసీపీ నుండి వచ్చిన పలువురు నాయకులకు టీడీపీ వెల్ కమ్ చెప్పింది. పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడంలో ఏమాత్రం వెనక్కు తగ్గినా ఊరుకొనే ప్రసక్తే లేదని ఇప్పటికే పలుమార్లు తమ ఎమ్మెల్యేలకు చంద్రబాబు క్లాస్ తీసుకున్నారు. మొత్తం మీద టీడీపీని మరింత బలోపేతం చేసేలా ఓ వైపు చంద్రబాబు, మరోవైపు నారా లోకేష్ తమ రాజకీయ పావులు కదుపుతున్నారు. ఇక కూటమిలో రెండో పార్టీగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీ జనసేన. ఇప్పటి వరకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రభుత్వ పాలనా పరమైన అంశాలపై దృష్టి సారించారు. అలాగే జనసేనలో నెంబర్ ? 2 గా గల నాదెండ్ల మనోహర్ కూడా మంత్రి వర్గంలో ఉండడంతో పార్టీ క్యాడర్ కు అంతగా అందుబాటులో లేరని ప్రచారం. మరో జనసేన కీలక నేత, పవన్ సోదరుడు నాగబాబు పార్టీ వ్యవహారాలను చూస్తూ వస్తున్నారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో పార్టీలో చేరికల నేపథ్యంలో నాగబాబు హాజరై, పార్టీలోకి వారిని సాదరంగా స్వాగతించారు. ఈ దశలోనే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మరికొందరు నేతలకు జనసేన కూడా స్వాగతం పలికింది. ఓ వైపు కోటికి పైగా సభ్యత్వ నమోదు పూర్తి చేసుకొని టీడీపీ క్యాడర్ హుషారుగా ఉండగా, ప్రస్తుతం జనసేన బలాన్ని కూడా పెంచుకోవాలన్న లక్ష్యం పార్టీ అగ్ర నాయకత్వంలో కనిపిస్తోంది. ఈ సందర్భంగానే పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో మార్చి 14న పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు పవన్ సిద్దమయ్యారు. ఎన్నికల్లో తమ పార్టీ వందశాతం స్ట్రైక్ రేట్ తో విజయాన్ని అందుకున్న తర్వాత నిర్వహిస్తున్న తొలి పార్టీ సమావేశం ఇది. ఈ భారీ బహిరంగ సభ ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసుకొనేలా పవన్ ప్లాన్ చేసినట్లు టాక్ నడుస్తోంది. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేందుకు ఇప్పటి నుండే ఆయా జిల్లాల పార్టీ నాయకులకు తగు సూచనలు చేసినట్లు సమాచారం. ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేసి, మళ్ళీ యావత్ దేశం దృష్టి ఆకర్షించేలా చేయాలన్నది పవన్ అభిమతమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా విస్తృతం చేసి, పార్టీ క్యాడర్ కు ఇప్పటి నుండి అందుబాటులో ఉండాలని పవన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. 2029 ఎన్నికల సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా జనసేనకు ప్రతి గ్రామంలో క్యాడర్ ఉండాలన్నది పవన్ అభిమతమట. మొత్తం మీద పిఠాపురం జనసేన ఆవిర్భావ సభ.. బల నిరూపణ సభ కానుందని రాజకీయ విశ్లేషకుల మధ్య తీవ్రస్థాయిలో చర్చ సాగుతోంది.

# భయపెడుతున్న జీబీఎస్

**గుంటూరు :** ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అలసందలపల్లికి చెందిన కమలమ్మ అనే వృద్ధురాలు జీబీఎస్‌తో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. 13 రోజుల పాటు చికిత్స పొందిన బాధితురాలు.. పరిస్థితి విషమించడంతో కన్నుమూసింది. మరో బాధితురాలు ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు జీబీఎస్ లక్షణాలతో శ్రీకాకుళం జిల్లా గోదాయవలసకు చెందిన యువంత్ అనే బాలుడు.. విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఆ గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి..అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే జీబీఎస్ అంటు వ్యాధి కాదని..ఇన్ఫెక్షన్ల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని సూచిస్తున్నారు. అరుదుగా లక్షమందిలో ఒకరిద్దరికే వచ్చే జీబీఎస్ అనే నరాల సంబంధిత వ్యాధి కేసులు ఏపీలో ఇటీవల ఒక్కసారిగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గుంటూరు ప్రభుత్వాసుపత్రికి ఈ నెల 11న ఒక్కరోజే ఏడు కేసులు వచ్చాయి. వారిలో ఇద్దరు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ఇదే వ్యాధితో కాకినాడలో ఇటీవల ఇద్దరు చేరారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఈ వ్యాధితో 17 మంది చికిత్స పొందుతున్నారు. రాష్ట్రంలో ఒక్కసారిగా జీబీఎస్ కేసులు పెరగడంతో ప్రభుత్వం అప్రమత్తమయింది. జీబీఎస్ కేసులపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు..ప్రభుత్వ యంత్రాంగం అలర్ట్‌గా ఉండాలని సూచించారు. ఏపీ వ్యాప్తంగా గత ఏడాది 301 జీబీఎస్ కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఇప్పటివరకూ 43 కేసులను గుర్తించినట్టు చెప్పారు..మంత్రి సత్యకుమార్. ప్రస్తుతం 17 మంది బాధితులు చికిత్స పొందుతున్నారని వివరించారు. 85 శాతం మందికి చికిత్స అవసరం లేకుండానే ఈ వ్యాధి తగ్గుతుందని..కేవలం 15 శాతం మందికి మాత్రమే చికిత్స అవసరమవుతుందని




చెప్పారు..సత్యకుమార్. ఈ వ్యాధికి అవసరమైన చికిత్స సదుపాయాలతో పాటు వ్యాక్సిన్లు కూడా సరిపడా ఉన్నాయని..ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ఖర్చు గురించి ఎక్కడా ఆలోచించకుండా.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు తగినన్ని ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచుతోందని స్పష్టం చేశారు. కరోనాలో జీబీఎస్ అంటు వ్యాధి కాదని.. జెనెటికల్ కూడా కాదని స్పష్టం చేశారు..ఏపీ హెల్త్ సెక్రటరీ కృష్ణబాబు. వ్యాధికి కచ్చితమైన కారకాలపై ఎలాంటి నిర్ధారణ లేదని..ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జీబీఎస్ ఉందన్నారు. లక్షల్లో ఒకరికి మాత్రమే జీబీఎస్ వ్యాధి సోకే అవకాశం ఉంటుందని..వచ్చిన వారిలో కూడా 5 నుంచి 7 శాతం మాత్రమే మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఒక్కసారిగా కాళ్లు చచ్చుబడినట్టు అనిపిస్తే..వెంటనే వైద్యులను సంప్రదించాలి..వ్యాధిని ముందుగా గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని వివరించారు. గులియన్ బారే సిండ్రోమ్ అంటువ్యాధి కాకపోయినా.. అప్రమత్తంగా ఉండాల్సిదే. అయితే గతంలో పెద్దవారిలో మాత్రమే కనిపించే ఈ వ్యాధి.. ఇప్పుడు పిల్లలు, శిశువులకూ సోకడం ఆందోళన కలిగిస్తోంది. నూటికి 95 శాతం మంది వ్యాధిగ్రస్తుల్లో ఈ వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా..సకాలంలో చికిత్స అందించకపోతే ప్రమాదం. ఇది ఒకరకంగా పక్షవాతం లాంటిదే. చాలావరకు ఇతరత్రా ఇన్‌ఫెక్షన్లు వచ్చినవారికే మొదలవుతుంది. వ్యాధి తీవ్రమైతే కండరాలు చచ్చుబడతాయి. వ్యాధి లక్షణాల్ని సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే నయం చేయవచ్చు. వేళ్లు, మడమలు, మణికట్టు వంటి చోట్ల సూదులతో పొడుస్తున్నట్లు అనిపించడం.. కాళ్లలో మొదలైన బలహీనత పైకి విస్తరించడం, కాళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వ్యాధి తీవ్రమైతే శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది అవుతుంది. వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందించాల్సి ఉంటుంది. నర్వ్ కండక్షన్, ఎలక్ట్రోమయోగ్రఫీ, సీఎన్ఎఫ్, ఎంఆర్ఐ వంటి పరీక్షలతో.. వ్యాధిని నిర్ధారిస్తారు. వ్యాధి సోకిన తొలి దశలోనే ఆస్పత్రిలో చేరితే.. 4 వారాల్లో కోలుకునే ఛాన్స్ ఉంటుంది. వ్యాధి ముదిరితే..కోలుకోవడానికి దాదాపు 6 నెలలు పట్టొచ్చు. అత్యధిక శాతం మందిలో ఇన్‌ఫెక్షన్ మొదలైన ఒకట్రెండు వారాల తర్వాతే ఇది బయటపడుతుంది. ఇతర ఇన్‌ఫెక్షన్లు వచ్చినా, కలుషితమైన నీరు, ఆహారం తీసుకున్నా ఈ వ్యాధి సోకే అవకాశాలున్నాయి. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం..కాచి, వడబోసిన నీళ్లను తాగడం..ఉడికించిన ఆహారాన్ని తీసుకోవడం వంటి చర్యలతో వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు.

## ఏపీలోని యూనివర్శిటీలకు వీసీల నియామకం

-మొదటిపేజీ తరువాయి

వీసీల వివరాలు ఇలా..

హెచ్.సుదర్శనరావు (అనంతపురం జేఎన్‌టీయూ), వెంకట బసవరావు ( రాయలసీమ వర్సిటీ), ఉమా (పద్మావతి మహిళా యూనివర్సిటీ), కె.రాంజీ (కృష్ణా యూనివర్శిటీ, మచిలీపట్నం), ప్రసన్న శ్రీ ( ఆదికవి నన్నయ యూనివర్సిటీ), అల్లం శ్రీనివాసరావు ( విక్రమ సింహపురి యూనివర్సిటీ).

## అద్భుతంగా కుంభమేళా

-మొదటిపేజీ తరువాయి

ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఏ ప్రభుత్వానికైనా అత్యంత క్లిష్టమైన సవాల్ గా నిలుస్తుంది. దుర్ఘటనలు, దురదృష్టకర ఘటనలు జరగాలని ఎవరూ కోరుకోరు కదా. నాకు తెలిసినంతవరకు యోగి ప్రభుత్వం కుంభమేళాను అద్భుతంగా నిర్వహిస్తోంది. కొన్ని సంఘటనలు జరగడం దురదృష్టకరం. ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఎంతో రాజకీయ అనుభవం ఉన్న నేతలకు చెబుతున్నాను. ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని నా అభిప్రాయం" అంటూ మమతా బెనర్జీ వ్యాఖ్యలను పవన్ తప్పుబట్టారు.

**కుంభమేళా పవిత్ర సంగమంలో పుణ్య స్నానాలు చేసిన పవన్ కళ్యాణ్ దంపతులు**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రయాగ రాజ్ త్రివేణి సంగమంలో మహకుంభ మేళా సందర్భంగా కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాదు నుంచి నేరుగా ఆయన సతీసమేతంగా ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగరాజ్ వద్ద త్రివేణి సంగమం చేరుకున్నారు. పవన్ సతీమణి అన్నా లెజినోవా, కుమారుడు అకిరానందన్ తదితరులు అక్కడ పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మహా కుంభమేళాలో... పితృదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభమేళాకు రావడం తన అదృష్టమని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క హిందువు తప్పనిసరిగా పుణ్యస్నానం చేసి తరించాలని ఆయన సూచించారు. పవన్ కళ్యాణ్ వెంట ఆయన సతీమణి, కుమారుడు అకీరానంద్ తో పాటు మిత్రులు, ప్రముఖ సినీ దర్శకులు తివిక్రమ్ శ్రీనివాస్ కూడా ఉన్నారు.

# టీడీపీ టార్గెట్‌లో మరో ఇద్దరు వైసీపీ నేతలు

**విజయవాడ :** కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన ఎనిమిది నెలల తర్వాత వైసీపీ కీలక నేతల అరెస్ట్ లు ప్రారంభమయ్యాయి. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ను ఒక మర్డర్ కేసులో జైలుకు పంపారు. అదే సమయంలో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సయితం నెల్లూరు జైలు లో కొద్ది రోజులు ఉండి తర్వాత బెయిల్ పై బయటకు వచ్చారు. తాజాగా వల్లభనేని వంశీ అరెస్ట్ కావడంతో తర్వాత గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నానిని అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జోరుగా జరుగుతుంది. కొడాలి నాని ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని అంటున్నారు. తాజాగా మరో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పేరు కూడా అదే స్థాయిలో వినపడుతుండటం విశేషం. వెల్లంపల్లి శ్రీనివాస్ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత విమర్శలు చేసి కూటమి ప్రభుత్వం ఆగ్రహానికి గురయ్యారు. దీంతో పాటు ఆయనపై అనేక కేసులు నమోదు కావడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిసింది. మంత్రిగా ఉన్న సమయంలోనూ, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దుర్గగుడి లో జరిగిన అవినీతిపై అనేక ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించిన ఫిర్యాదుల కోసం వెయిట్ చేస్తున్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే వెల్లంపల్లి శ్రీనివాస్ పై కేసు నమోదు చేసే అవకాశముంది. దీనికి సంబంధించిన ఆధారాలను సేకరించడంలో ఒక బృందం బిజీగా ఉందని చెబుతున్నారు. వెల్లంపల్లి శ్రీనివాస్ పై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సిద్ధం చేస్తున్నారు. వెల్లంపల్లి శ్రీనివాస్ అనేక పార్టీలు మారారు. తొలుత ప్రజారాజ్యం పార్టీలో చేరి 2009 లో ఆయన విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి గెలిచారు. అనంతరం కాంగ్రెస్ లో ప్రజారాజ్యం విలీనం చేయడంతో వెల్లంపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ లో చేరిపోయారు. తర్వాత బీజేపీలో చేరారు. అనంతరం వైసీపీలో చేరి 2019 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత జగన్ కేబినెట్ లో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన వెల్లంపల్లి శ్రీనివాస్ అధికారంలోకి రాగానే పవన్ కళ్యాణ్ ను టార్గెట్ చేశారు. పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగతంగా విమర్శలకు దిగడంతో జనసైనికుల ఆగ్రహానికి గురయ్యారు. జగన్ ప్రాపకం సంపాదించడం కోసమే వెల్లంపల్లి శ్రీనివాస్ ఈ రకమైన వ్యాఖ్యలు చేశారన్న టాక్ ఉంది. గన్నవరం తర్వాత గుడివాడ.. ఆ తర్వాత విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ను ప్రభుత్వం టార్గెట్ చేస్తుందన్న ప్రచారం ఉంది. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో మంత్రి హోదాలో కనకదుర్గ దేవాలయంలో పాల్పడిన అవకతవకలు ఆయనకు ఉచ్చు బిగియనున్నాయి. టిక్కెట్ల విషయంలోనూ, చీరల అమ్మకాల్లోనూ అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో వెల్లంపల్లి శ్రీనివాస్ పై వరసగా కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయని బెజవాడలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. దీనిని ప్రచారంగా మాత్రమే కొట్టిపారేయాల్సిన అవసరం లేదని, త్వరలోనే మరికొందరు నేతలు జైలు పాలు కాక తప్పదన్న టీడీపీ నేతల హెచ్చరికలు ఇందుకు అద్దం పడుతున్నాయి.

# హామీల అమలు కోసం క్యాలెండర్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సిద్ధమవుతుంది. వరసగా హామీలను అమలు చేయాలని నిర్ణయించింది. వచ్చే నెల నుంచి ఇక సూపర్ సిక్స్ హామీల అమలు నెలకొకటి అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఎన్నికల వేళ హామీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి పెరిగింది. కేవలం రాజధాని నిర్మాణాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, తమ గోడును పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. స్థానిక నేతల వద్ద కూడా ప్రజలు ఇదేరకమైన అభిప్రాయాన్ని వెళ్ల గక్కతుండటంతో ఇక వరసగా హామీలు అమలు చేయాలని నిర్ణయించారు. ముందుగా మార్చి నెల నుంచి అంటే ఉగాది నాటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయనున్నారు. దీనికి సంబంధించి విధివిధానాలను రూపొందించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో అనుసరించే పద్ధతులను అధ్యయనం చేసి వచ్చిన మంత్రుల కమిటీ కూడా ప్రభుత్వానికి నివేదిక అందించింది. అయితే జిల్లాల వరకే ఉచిత బస్సు ప్రయాణాన్ని పరిమితం చేస్తే పెద్దగా భారం పడదని నివేదికలో పేర్కొనడంతో ఆ దిశగా అమలు చేయాలని నిర్ణయించారు. ఉగాది రోజు చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నా వారికి ఏడాదికి పదిహేను వేల రూపాయలు చెల్లించాలని నిర్ణయించారు. ఏప్రిల్ నెల నుంచి ఈ పథకం మొదలయ్యే అవకాశాలున్నాయి. అయితే లబ్దిదారుల ఎంపిక ఏ విధంగా ఉండాలన్న దానిపై కూడా ఇప్పటికే క్లారిటీకి వచ్చారు. ఆధార్ కార్డుతో పాటు తెలుపు రంగు రేషన్ కార్డు ఉన్న వారికి ఈ పథకం అమలు చేయనున్నారని తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన లబ్దిదారుల జాబితాను తయారు చేసే పనిలో అధికారులు ఉన్నారు. ఎంత మంది ఉన్నా అందరికీ ఇస్తామని చెప్పడంతో అది మరింత భారం కాకుండా కొన్ని నిబంధనలు రూపొందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.. ఈ పథకం కింద ఏడాదికి ఇరవై వేల రూపాయలు ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కూటమి పార్టీల మ్యానిఫేస్టోలో కూడా పెట్టారు. అయితే కేంద్ర ప్రభుత్వం తరహాలోనే మూడు విడతలుగా నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. తొలి విడత నిధులను మే నెలలో ఇచ్చేందుకు అవసరమయిన నిధులను సిద్ధంచేయాలని అధికారులను చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం. దీంతో వరసగా మార్చి, ఏప్రిల్ మే నెలల్లో తాము ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుంది. బడ్జెట్ లో కూడా వీటికి నిధులు కేటాయించే అవకాశాలున్నాయి.

సంపాదకీయం

# సమస్యల పరిష్కారమే పంచాయితీ రాజ్ లక్ష్యం

భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థలవ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగు ణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వ పరిపాలనా సంస్థలు రూపు దిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్ర ప్రదేశ్ లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్ నగర్ జిల్లా, షాద్‌నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతి సమితి, జిల్లా స్థాయి లో జిల్లా పరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్ గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగా త్మక ప్రాతిపదికగా, సమాజ వికాసా భివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుక బడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యా లు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీ ని 1956లో నియమించా రు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి. బల్వంతరాయ్ మెహతా (1900 ఫిబ్రవరి 19 - 1965 సెప్టెంబరు 19) స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక కార్యకర్త, పంచాయితీ రాజ్ నూతన వ్యవస్థ మార్గదర్శకుడు. ఆయన బర్డోలి సత్యాగ్రహ భాగస్వామి. గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. స్వయం పాలన కోసం ప్రజల పోరాటం ఆయన జీవితా శయం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సంబంధంగా... "బల్వంతరాయ్ మెహతా కమిటీ" సిఫార్సులు దేశంలో అమలు పరచబడి, ప్రాచుర్యం పొందిన పంచాయితీ రాజ్ అనే విప్లవాత్మక కార్యక్రమంతో మెహతా గుర్తింపు పొందాడు. స్వాతంత్ర్యం తరువాత మెహతా భారతదేశ లోక్‌సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యా డు. పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక ప్రాజెక్ట్స్ కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానానికి అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా భారత దేశపు పంచాయితీ రాజ్ ఫాదర్‌గా ప్రశంసించ బడ్డాడు. 1952, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన సమాజ అభివృద్ధి కారక్రమం ప్రాతి పదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్ రాయ్ గోపాల్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీ క్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది.బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3 - అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ను సిఫారసు చేస్తూ, తన నివేదిక ను 1957, నవంబరు 24న జాతీ యాభివృద్ధి మండలికి సమర్పించిం ది. కమిటీ నివేదికను జాతీయా భివృద్ధి మండలి 1958, జనవరిలో ఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచ నంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానా న్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం..."నేడు ప్రారంభమ వుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి". మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూ ప్రారంభించారు. బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు... దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి. 1) జిల్లా స్థాయిలో - జిల్లా పరిషత్, 2) బ్లాకు స్థాయిలో - పంచాయతీ సమితి, 3) గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నిక లను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమ బద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయి లో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయుల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరి పాలనా, వనరుల, ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ యొక్క ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్య సాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనవంతు కృషి చేస్తూనే ఉన్నాయి.

# స్వరాజ్య సంస్థాపకుడు శివాజీ




ధర్మప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యుడైన వారిలో నిత్యస్మరణీయుడు ఛత్రపతి శివాజీ. అందుకే శివాజీ 'స్వరూపాన్నే ధ్యానించండి, ఆయన ప్రతాపాన్నే అనుష్ఠించండి' అని సమర్థ రామదాసు వంటి మహనీ యులు మన జాతికి ప్రబోధించారు. హిందూ ధ్వజాన్ని మళ్ళీ ఉత్తుంగ శిఖరాలపై ఎగురవేసి, హిందుత్వం లో అమృతాన్ని నింపి ప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు శివాజీ. స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మధ్య యుగంలో హిందూ మతధర్మాన్ని పరిరక్షించిన మహోన్నత వీరుడు శివాజీ. మహారాష్ట్ర ప్రాంతంలో యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం 1307 మార్చి 24తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనం కాగా, ఆ తర్వాత 350 ఏళ్ల వరకూ మరో హిందూ సామ్రాజ్యమే లేకుండా పోయింది. 1630, ఫిబ్రవరి 19వ తేదీన భావి హైందవ సామ్రాజ్య నిర్మాతయైన శివాజీ జన్మించాడు. దేశభక్తిని ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీ తన తల్లి జిజియాబాయి పెంపకంలో అనేక విషయాలు నేర్చుకున్నాడు. 'రామ రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యం నిర్మాణం చేయాలనే కోరిక' శివాజీలో బాల్యంలోనే స్థిర పడింది. తల్లి సంరక్షణ, దాదాజీ ఖాండ్‌దేవ్ శిక్షణతో శివాజీ వీరుడిగా అవతరించారు. భారత రామాయణాల విశిష్టత, హిందూ మతం గొప్పదనం తల్లిద్వారా నేర్చుకున్నాడు. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం కూడా ఆమె ద్వారా పెంపొందించుకున్నాడు. తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి కాలంలో యుద్ధ తంత్రంలో నిష్ణాతుడయ్యాడు. సకల విద్యా పారంగతుడైన శివాజీ, మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా వ్యూహారచన చేశాడు. శివాజీ జాగీరులో రాంఝా గ్రామ పటేలు ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేలును బంధించి, కాళ్ళు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడైనాడు. అప్పట్లో కాశ్మీరం నుండి కావేరీ వరకు మధ్యనున్న చాందా, గోండువనం వదిలి మిగిలిన దేశమంతా తురుష్కుల అధీనంలో ఉండేది. దేవగిరి, విజయనగరం రాజ్యాలు అస్తమించాక, శివాజీ తన మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం దేవాలయం, కొండగుహ, కీకారణ్యం ఇసుకతిన్నెలు వంటి అనేక ప్రాంతాల్లో చర్చోపచర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన 'కాన' లోయలోని 'తోరణ' దుర్గాన్ని జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న 'మురుంబదేవ' గిరిపై కొత్త కోటను నిర్మించి, "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత 'కువారి' కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కుపచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత కొండణా కోటను తన స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివరళ, సుభాను మంగళి దుర్గాలను వశపరు కున్నాడు. 1648 జూలై 25న వజీరు ముస్తాపా, బాజీ ఘోర్పడేలు సైన్యంతో శివాజీ తండ్రి అయిన శహాజీని బంధించారు. శత్రువును శరణు వేడడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే శివాజీ ప్రశ్నలకు... తల్లి జిజియా బాయి- తన మాంగల్యం కన్నా దేశభక్తి గొప్పదని చెప్పింది. పురంధర కోటలో ఉన్న శివాజీ సైన్యానికి, ఫతేఖాన్ సైన్యానికి భీకర యుద్ధం జరగగా శివాజీకే విజయం దక్కింది. 1648 ఆగస్టు 8న ఫతేఖాన్ ఓటమి పాలయ్యాడు. పురంధర దుర్గంలో ఫతేఖాన్, బెంగుళూరులో ఫరాదఖాన్ ఓటముల పాలు కాగా, బీజాపూర్ లో శివాజీ తండ్రి శహాజీ 1649 మే 16న బంధ విముక్తు డైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహరాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా శివాజీ వారిని బంధించి, ఉచిత పదవులు కట్టబెట్టి నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానదీ సమీపంలో టావళి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేకపోగా దత్తపుత్రుడైన యశ్వంతరావుకు పదవినిచ్చాడు. తన అధికారానికి ఇష్టపడని కారణాన 1656లో యుద్ధంలో యశ్వంతరావును ఓడించి శివాజీ స్వరాజ్యంలో కలుపుకున్నాడు. దీనిలో అంతర్భాగ కొండ ప్రాంతమైన 'రాయరి' కోటనే కొన్నే ళ్ళకు శివాజీ రాజధానిగా రాయగఢ్ దుర్గం ఏర్పడింది. 1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదారైన ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివాజీ బీజాపూర్ ప్రాంతం నుండి కోండ్వానా కొంకణ, దండరాజపురి, భీవండి కళ్యాణి, మాహు తదితర కోటలను పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని జయించాడు. కటావ్, మయణి, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాళీ గడ్, యెగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కారతలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావసింహ, జస్వంత సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్ , సూరత్, జున్నర్ నగ రాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ తన జైత్రయాత్ర ఫలితంగా 1674 జూన్ 6న సింహాసనాన్ని అధిష్టించాడు. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెం డర్ శివాజీ మహారాజుకు ప్రణమిల్లి భారీగా కానుకలు సమర్పించాడు. తన రాజ్యానికి అష్టప్రధానుల పారశీక నామాలను మార్చి సంస్కృత పేర్లను శివాజీ పెట్టాడు. ప్రభుత్వ పాలన సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశం తయారు చేయించాడు. యుద్ధ తంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమైన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేశాడు. ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు కాకుండా ప్రజాక్షేమం కోసమే పాటుపడ్డాడు. సుదీర్ఘంగా యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్ర స్థలాలను ధ్వంసం చేయలేదు. ఓడిపోయిన శత్రురాజ్యంలో నిస్సహాయులు, మహిళలు, పసివారికి సహాయం చేశాడు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా గౌరవించాడు. కేవలం ఆలయాలే కాదు, మసీదులను సైతం కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడు వంతులు ముస్లిములే. వారిని కూడా ఉన్నత పదవుల్లో నియమించాడు. ముప్పై సంవత్సరాలు శివాజీ, ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ హిందువులలో నూతనోత్తేజం నింపాయి. యాభై ఏళ్ళ సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా దేహం పూర్తిగా అలసిపోగా ఆరోగ్యం క్షీణించడంతో, 1680 ఏప్రిల్ 3న శివాజీ తుది శ్వాస విడిచాడు. భారతీయుల ఆదర్శ పురుషునిగా నిలిచాడు.

# వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు



తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తి పీఠం ఒకే గిరి శృంగం మీద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. పురాణాల్లో వర్ణితమైనఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభివందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసాల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించబడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరి స్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదళీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు. శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తుసంపదలు సమర్పించారు. శ్రీశైలంలో పంచమఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం - శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు మీదుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోం ది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178-1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 19 తేదీ నుండి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 19న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. 23న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీశైలం క్షేత్రానికి రానున్నారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీఎం పట్టువస్త్రాలు అందజేస్తారు. 26వ తేదీన మహా శివరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు. ప్రభోత్సవం, నంది వాహన సేవ.

లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం, కళ్యాణోత్సవం నిర్వహించ నున్నారు. ఈ ఉత్సవాల్లో స్వామి వారు వివిధ వాహనాలను అధిరోహించి, తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు అనుగ్రహం కలిగిస్తారు. ప్రత్యేకించి మహాశివరాత్రి నాడు స్వామి వారికి ప్రభోత్సవం, నందివాహన సేవలతో పాటు అనేక విశేష కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ కారణంగా స్వామి వారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఉంటుంది. జ్యోతిర్ముడి కలిగిన శివ స్వాములకు మాత్రమే నిర్దిష్ట వేళల్లో ఉచిత స్పర్శ దర్శనానికి అవకాశం ఉంటుంది.

# హత్య కేసులో 8 మందికి జీవిత ఖైదు



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ :** బాపట్ల జిల్లా మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2015లో జరిగిన హత్య కేసులోని 8 మంది నిందితులకు జీవిత ఖైదు విధిస్తు ఒంగోలు అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్ట్ న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలలోకి వెళితే జే.పంగులూరు మండలం రామకూరు గ్రామంకు చెందిన ఫిర్యాది బూరగా యేసుదయమ్మ కుమారుడు మృతుడు రత్నం బాబు (22 సం.లు) ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేసేవాడు అదే గ్రామానికి చెందిన 17 సంవత్సరాలు కలిగిన షేక్ కరిష్మా తో ప్రేమ వ్యవహారం నడిచింది ఇది ఇష్టం లేని అమ్మాయి కుటుంబ సభ్యులు ది:23.3.2015న కరిష్మాను ఇంటి నుండి పంపించి వేశారు రత్నం బాబు వాళ్ళ అమ్మను ఒప్పించుకొని కరిష్మాని తన ఇంట్లోనే ఉంచి మైనారిటీ తీరిన తర్వాత పెళ్లి చేసుకుందామని అనుకున్నాడు 15 రోజుల తర్వాత కరిష్మా మూడో మామ నజీరు నాలుగో మామ మున్నీర్ భాషా అతడి స్నేహితుడు అన్వర్ భాషాలు రత్నం బాబు ఇంటికి వెళ్లి జరిగిన విషయాలు వదిలేయండి మీ పెళ్లి చేయడానికి మేము అందరం ఒప్పుకున్నాం, అని మాయమాటలు చెప్పి వాళ్ళింట్లోనే మద్యం తాగి పార్టీ చేసుకోవడం జరుగుతుంది. మరలా ది:28.4.2015 న సదరు మున్నీర్ భాషా, అన్వర్ భాషా లు రత్నం బాబు ఇంటికి వెళ్ళి రేపు ఉదయం 8 గంటలకు జేపంగులూరు మసీదులో వివాహం నిశ్చయించాము దాని నిమిత్తం వలపర్లలో బట్టలు కొనుక్కొస్తామని చెప్పి సుమారు సాయంత్రం 4:30 గంటల సమయంలో రత్నం బాబుని తీసుకొని వెళ్లారు మార్గం మధ్యలో రత్నం బాబుని బలవతంగా రామకూరు ఉత్తరం వైపు పొలాలలోకి తీసుకు వెళ్ళి కత్తులతో పొడిచి హత్య చేశారు మరుసటి రోజు ఉదయం 7 గంటలకు గ్రామ ప్రజలు పొలాల్లో బూరగ రత్నం బాబు శరీరమంతా కత్తిపోట్లతో రక్తపుమడుగులో చనిపోయారని గుర్తించి ఫిర్యాది ఇచ్చిన రిపోర్ట్ మేరకు అప్పటి మార్టూరు ఎస్.ఐ హత్య కేసు నమోదు చెయ్యగా అప్పటి చీరాల డిఎస్పీ సి జయరామరాజు కేసు దర్యాప్తు నిర్వహించి ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వాగ్మూలం ఆధారంగా నేరస్థలాన్ని పరిశీలించి సేకరించిన భౌతిక సాక్షాదారాలను విశ్లేషించి హత్యకు కారకులైన 9 మంది ముద్దాయిలను క్రైమ్ నెంబర్ 76/2015 302, 364, 120(బీ) అఫ్ ఎస్సీ ఎస్టీ పి ఓ ఏ యాక్ట్ 34 ఐపిసి నేరం చేసినట్లు నిరూపించి అరెస్ట్ చేసినారు అనంతరం నిపుణుల నివేదికను జతచేసి సంబంధిత కోర్టులో అభియోగ పత్రం దాఖలు చెయ్యడం జరిగింది ఒంగోలు వ తరగతి అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్ట్ లో కేసు విచారణకు రాగ బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపిఎస్ ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పీ రామాంజినేయులు పర్యవేక్షణలో మార్టూరు సీఐ శేషగిరిరావు ఒంగోలు జిల్లా కోర్ట్ లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ ఏ శ్రీనివాసులు కోర్టు కానిస్టేబుల్ ఏ కిరణ్ లు సాక్షులు సరైన రీతిలో నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీధు ఇచ్చి సరైన సమయంలో కోర్టుకు హాజరు పరచగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై ప్రశాంత కుమారి కోర్టులో వాదోపవాదాలు వినిపించి నిందితులపై మోపబడిన నేరాన్ని తగిన సాక్షాదారాలతో నిరూపించగా ఒంగోలు అడిషనల్ అండ్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి టి.రాజా వెంకటాద్రి నిందితులు షేక్ మున్నీర్ భాషా (1), షేక్ అన్వర్ భాషా (2), షేక్ నజీర్ (3), షేక్ కరిముల్లా (4), షేక్ బాజీ బుడే (5), షేక్ సద్దాం హుస్సేన్ (6), షేక్ షకీల(7), పటాన్ మౌలాలి (9) లకు జీవిత ఖైదు ఒక్కొక్కరికి 5000 రూపాయల జరిమానా విధిస్తు తీర్పు వెలువరించారు నిందితులకు శిక్షపడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి పోలిస్ అధికారులను సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చిన మార్టూరు సీఐ శేషగిరిరావు కోర్టు లైజన్ ఆఫీసర్ ఏ శ్రీనివాసులు మార్టూరు కోర్టు పిసి ఏ కిరణ్ కుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంత కుమారి లను జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు నేరం చేసిన వారికి న్యాస్థానంలో శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరిగినట్లు అవుతుందని ఇటువంటి తీర్పులు వెలువడినప్పుడు నేరస్థులలో భయం అనేది ఏర్పడుతుందన్నారు.

## ఉపాధి హామీలో అవినీతి

**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి :** మండల పరిధిలోని కదిరిపల్లి గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల్లో అవినీతి వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు 23- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డకౌట్ ఫండ్ కార్యక్రమంలో భాగంగా గత వారం రోజుల క్రితం 85 మందికి ఉపాధి హామీ కల్పించారు. అయితే క్షేత్ర సహాయకుడు చేసిన నిర్వాకం కనీసం ముగ్గురు కూడా పనిచేయలేదని, అధికార పార్టీని అడ్డుపెట్టుకొని 150 పని దినాలు కల్పించినట్టుగా రికార్డ్ సృష్టించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించినప్పుడు గతంలో చేసిన పనిని వర్క్ డిమాండ్ చేసి. జాబ్ కార్డుల లబ్ధిదారుల తో లాలూచీపడి అవినీతికి పాల్పడినట్టు గ్రామస్తులు తెలిపారు. ఇదే విషయం సంబంధిత అధికారులను వివరణ కోరగా గతంలో చేసిన పనులకు ఇతని చేపించిన పనులు బిల్లును నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిపామన్నారు. అయితే టెక్నికల్ అసిస్టెంట్ క్షేత్రస్థాయిలో లేకపోవడం, వర్క్ డిమాండ్ వెయిట్ చేసినప్పుడు పాత లోకేషన్ అని కూడా చూడకుండా అప్రూవ్ చేసిన అధికారులు కూడా ఇతడుతో లాలూచీ పడినట్టు తేటతెల్లమవుతుంది. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్నటువంటి ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన పనుల్లో ఇతను చేపిస్తూ అనవసరంగా ప్రజలను మభ్యపెడుతూ అవినీతికి పాలపడుతున్నాడు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన క్షేత్ర సహాయకుడు పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు కనీసం పనులు కూడా పరిశీలించకపోవడం శోచనీయం.

## పైడితల్లి అమ్మవారి యాత్రా మహోత్సవాలు ,పెద్ద పండుగకై సన్నాహాలు

నేడు స్థానిక కోదండ రామ స్వామి ఆలయంలో యాత్రోత్సవ కమిటీ సమావేశం





**పొందూరు, ఫిబ్రవరి 18,ప్రజా న్యూస్ :** పొందూరు పట్టణంలో వెలసియున్న శ్రీ పైడితల్లి అమ్మవారి 40వ యాత్రా మహోత్సవాలు ,అమ్మవారి పెద్ద పండుగ నిర్వాహణకు యాత్రోత్సవ కమిటీ సన్నాహాలు చేస్తుంది. ఇందులో భాగంగా నేడు బుధవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక కోదండ రామ స్వామి ఆలయంలో యాత్రా మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ,పలు సంఘ నేతలు,ప్రజలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గత ఏడాది నిర్వహించిన యాత్రా మహోత్సవాలలో జరిగిన ఖర్చులు ,ఆదాయ వివరాలను చర్చించనున్నారు. గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు, స్వచ్ఛంద సంస్థ నేతలు అందరూ సమావేశంలో పాల్గొని యాత్రా మహోత్సవాలను, పండుగను దిగ్విజయంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు, తదితర విషయాల గురించి తగు సూచనలు,సలహాలు అందించాలని శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

## చెరుకుపల్లి మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా పేరం శంకర్ బాబు ఏకగ్రీవం



చెరుకుపల్లి, **ఫిబ్రవరి 18,ప్రజాజ్యోతి న్యూస్ :** చెరుకుపల్లి లో మంగళవారం ప్రింట్ మీడియా సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి చెరుకుపల్లి మండల ప్రింట్ మీడియా అందరూ హాజరై అధ్యక్షుడిగా పేరం శంకర్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రింట్ మీడియా సభ్యులందరూ ముందుగా అధ్యక్షుడికి శు భాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ నా మీద ఇంత నమ్మకంతో నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులందరకు ధన్యవాదాలు తెలిపారు పాత్రికేయలకు ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని ఆయన అన్నారు అతి త్వరలో జర్నలిస్టు ఇళ్ల స్థలాల గురించి రాష్ట్ర రెవెన్యూ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళతానని ఆయన అన్నారు ఈ సమావేశంలో. వై వెంకటేశ్వరరావు, పెద్దపల్లి లీలా కృష్ణ, శీను, గోపి, శ్రీహరి, గౌస్, శివ, నాని, ఫణి తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబ్ ఛానల్ విలేకరి మృదేహం లభ్యం



**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి :** మండల పరిధిలోని బుగ్గ సంఘాల గ్రామ సమీపంలో యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్ తిరుమల రెడ్డి మృతదేహం మంగళవారం హంద్రీనీవా కాలువ లభ్యమయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుమలరెడ్డి చాలా డిపార్టుమెంటులకు ఇన్ఫర్మేషన్ యాక్ట్ కట్టడంతో పాటు స్థానిక బుగ్గ సంగమేశ్వర ఆలయం కమిటీ మెంబర్లతో విపరీతంగా గొడవ పడి ఆలయ అభివృద్ధి కృషిచేసిన వృద్ధులను కూడా ఆయన తీవ్రంగా విమర్శించేవాడు అన్నారు. బుగ్గ సంగాల గ్రామానికి చెందిన కొంతమందితో గొడవ పడ్డాడని గ్రామస్తులు తెలుపుతున్నారు. శవం పై కనబడుతున్న ఘాట్లను బట్టి అతను గిటను వారు హతమార్చారాన్ని స్పష్టమవుతుంది. వారు ఎవరు ఎందుకు చంపారో పోలీసుల విచారణలో తెలియవలసి ఉంది.

## నేడు బీసీ రుణాల లబ్ధిదారులు ఎంపిక

**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి :** మండల పరిధిలో ఉన్నటువంటి 135లకు గాను బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లుగా ఎంపీడీవో శ్రీకాంత్ చౌదరి మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 135 మంది బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసుకున్న వారికి రేపు ఇంటర్వ్యూలు ఉంటాయని సంబంధిత సెక్రటరీలు అందుబాటులో ఉంటూ ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని ఆయన సంబంధిత అధికారులకు, దరఖాస్తూ సోదరులకు విజ్ఞప్తి చేశారు.

## కలెక్టర్ ఔదార్యం..

అగ్ని ప్రమాద బాధితురాలకి 10 వేలు ఆర్థిక సాయం అందజేత..



**బాపట్ల, ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) :** అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఇల్లు కాలిపోయిన విద్యార్థిని వేమినేనివెంకట వసంతకు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తక్షణమే 10వేల రూపాయలు ఆర్థిక ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మంగళవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో అద్దాలు తీసుకోవడానికి వచ్చిన వెంకట వసంతను జిల్లా కలెక్టర్ అమ్మా ఈరోజు స్కూలుకు యూనిఫామ్ వేసుకుని రాకపోవడంతో ఎందుకని అడిగారు వెంటనే విద్యార్థి బాపట్లలో అగ్నిప్రమాదంలో తమ ఇల్లు కాలిపోయిందని వేసుకోవడానికి యూనిఫామ్ లేదని జిల్లా కలెక్టర్ కు తెలియజేసింది. దీంతో జిల్లా కలెక్టర్ మనసు చలించిపోయి విద్యార్థిని వెంకట వసంతకు వారి కుటుంబానికి 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ , బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్, రెడ్డి, తహసిల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

ఎమ్మెల్యే వేగేశన



**బాపట్ల, ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) :** ఉమ్మడి గుంటూరు,కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో మంగళవారం బాపట్ల పట్టణం లోని ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఉపాధ్యాయుతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు కోరారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు,ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ మానం నాగేశ్వరరావు ,బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివ నారాయణ,సజ్జా హేమలత ,బాపట్ల పట్టణ బిజెపి అధ్యక్షులు బాల నారాయణ,ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హమైన అర్జీలకు పరిష్కారం - జిల్లా కలెక్టర్ ప్రశాంతి



**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి (ప్రతినిధి) :** రీ సర్వే పై ఇచ్చిన ఉత్తర్వుల, ప్రత్యుత్తరాలకి సంబంధించి రీ ఓపెన్ అయిన అర్జీలను పరిశీలించి అర్హమైన అర్జీలను పరిష్కారం చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో పెండింగ్ ఫైల్స్, రీ ఓపెన్ అర్జీలను జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు ఆధ్వర్యంలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవిన్యూ , భూ అనుబంధ సంబంధ అర్జీల పరిష్కారం విషయంలో తప్పనిసరిగా జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో రీ ఓపెన్ అయిన పీ జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారం, రీ సర్వే అభ్యంతరాలు లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సంబంధించిన సర్వే వివరాలను హేతుబద్ధత కలిగి పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అర్జీలను పరిష్కారం చేసే ప్రక్రియ లో నిజ నిర్ధారణ, ప్రామాణిక పత్రాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యుటేషన్, కోరిలేషన్, రీ సర్వే తదితర అంశాలకు సంబంధించి 60 కేసులను పరిష్కరించి ధ్రువపత్రాలు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, డిప్యూటీ సర్వేయర్ వై. మోహన్ రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు రిఫ్రెష్ ట్రైనింగ్ అవసరం





జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్

**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి (ప్రతినిధి) :** సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు రిఫ్రెష్ ట్రైనింగు ఎంతో ఉపకరిస్తుందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ అన్నారు. యాన్యువల్ డీమొబిలైజేషన్ లో భాగంగా నిర్వహించిన సాయుధ బలగాల కవాతు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో, పోలీసు కవాతు మైదానంలో సాయుధ బలగాల యాన్యువల్ డీమొబిలైజేషన్ కవాతు ఎస్పి వీక్షించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాయుధ బలగాలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండి, అత్యవసర పరిస్థితుల్లో సమర్థంగా వ్యవహరించేందుకు ఈ రీఫ్రెష్ ట్రైనింగ్ ఎంతో ఉపయోగపడుతుందని, ఈ మొబిలైజేషన్ శిక్షణ పోలీసు సిబ్బందికి వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి (అడ్మిన్) ఎన్ బి ఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఎల్. అర్జున్, అడిషనల్ ఎస్పీ( ఏ ఆర్) ఎల్. చెంచి రెడ్డి, డి.ఎస్.పి( ఎస్ బి) బి. రామకృష్ణ, డి.ఎస్.పి( ఏ ఆర్) రవి కుమార్,ఇన్స్పెక్టర్( ఎస్ బి) ఏ. శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్( డి సి ఆర్ బి) పవన్ కుమార్ రెడ్డి, జోనల్ డిఎస్పి లు, ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఆర్ ఎస్సైలు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ మీటర్ రీడర్లకు సంస్థలో మరొక ఉపాధి కల్పించాలి

మీటర్ రీడర్స్ చలో విజయవాడ సభను





విజయవంతం చేయండి - జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రావు

**ప్రత్తిపాడు , ఫిబ్రవరి 18,ప్రజాజ్యోతి న్యూస్ :** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్స్ కు విద్యుత్ సంస్థలో ప్రత్యామ్నాయంగా మరొక ఉపాధి కల్పించాలని జిల్లా రీడర్ సంఘం అధ్యక్షుడు ప్రకాష్ రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రతిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఈనెల 20న చలో విజయవాడ మీటర్ రీడర్స్ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రథమ మహాసభ ను జయప్రదం చేయాలని కోరారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం లో జరగబోయే విద్యుత్ మీటర్ రీడర్ల మహాసభకు జగ్గంపేట డివిజన్, ప్రత్తిపాడు సబ్ డివిజన్, ప్రత్తిపాడు సెక్షన్ రీడర్స్ పాల్గొంటారు అన్నారు. అనంతరం కాకినాడ జిల్లా రీడర్స్ అధ్యక్షుడు చిందాడ ప్రకాశరావు గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మీటర్ రీడర్స్ ఎన్నో ఏళ్ల నుండి చాలీచాలని జీతాలతో ఇబ్బందులకు గురవుతున్నారని మీటర్ రీడర్స్ విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి కనీస వేతనం అమలు అమలు చేయాలని ఉద్యో గ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పసగొడుగుల నానాజీ, ట్రెజరర్ శ్రీను,పసగొడుగుల నూకరాజు,ఏసుబాబు,వినోద్,శ్రీను,తమ్మరాజు యూనియన్ సంఘాలు పాల్గొన్నాయి.

## చలో తుని కార్యక్రమంలో



ముదునూరిని అడ్డుకున్న పోలీసులు

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం వైకాపా నేత ముదునూరి మురళీకృష్ణమరాజు

**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ :** రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని రెడ్ బుక్కు రాజ్యాంగం నడుస్తుందని కూటమినేతల ఆదేశాలతో పోలీసులు ఎస్ రాజ్యాంగాన్ని పాటిస్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ వైకాపా నేత ముదునూరి మురళీకృష్ణ మరాజు ఆరోపించారు తునిలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నికల్లో కూటమినేతల దౌర్జన్యాల నేపథ్యంలో మాజీ మంత్రి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఇచ్చిన పిలుపుమేరకు చలో తుని కార్యక్రమానికి బయలుదేరిన వైసిపి నాయకులను పార్టీ శ్రేణిలను దారిలో పోలీసులు అడ్డుకున్నారు ప్రత్తిపాడు నియోజకవర్గ వైకాపా నేత ముదునూరిని మార్గ మధ్యలో పోలీసులు ఆపి తుని కార్యక్రమానికి అనుమతులు లేవని కాన్వయ్ ని తిరిగి పంపించారు అనంతరం ముదునూరి జిల్లా నాయకులతో కలిసి తుని కార్యక్రమానికి బయలుదేరగా గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద పోలీసులు అనుమతులు లేవని నిలిపివేశారు దీనితో వైకాపా నాయకులు కార్యకర్తలు నిరసన చేపట్టారు ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ కూటమినేతల అరాచకాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని కూటమినేతలు నియంత హిట్లర్ కు వారసులుగా మారి దౌర్జన్యాలు చేస్తున్నారని అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడిచి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని

## ముగిసిన దుర్గాదేవి యాత్రా మహోత్సవాలు









అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

**పొందూరు , ఫిబ్రవరి 18, ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం తం డ్యాం గ్రామంలో వెలసియున్న శ్రీ గణేష , సుబ్రమణ్య , అయ్యప్ప స్వామి సహిత శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 31 వ యాత్రా మహోత్సవాలు మంగళవారం నాడు ముగిశాయి. ఆలయ పురోహితులు అల్లం శెట్టి దామోదర రావు అమ్మవారికి వేద మంత్రాలతో వేకువ జామున నుండి ప్రత్యేక అభిషేకాలు ,పూజలు చేశారు. చివరిరోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.దీంతో ఆలయ ప్రాంగణం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం మహోత్సవాలలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ గణేష్ భక్త బృందం బాల బాలికలచే కోలాటం , గూనాన పేట మాజీ సర్పంచ్ గూనాన లక్ష్మీ ,గూనాన కృష్ణ వారి ఆర్థిక సహాయంతో నిర్వహించిన బాణసంచా కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గాదేవి ఆలయ కమిటీ సభ్యులు వడగా మోహన్ రావు, వెలిశేటి రామచంద్ర రావు , బలివాడ సత్యన్నారాయణ , అల్లం శెట్టి షణ్ముఖ రావు,ఎస్.డి ప్రసాద రావు , , మన్నె రాంబాబు , మాడుగుల కూర్మారావు, కాపల ప్రసాద్,దుర్గాదేవి ఆలయ కమిటీ సభ్యులు యాత్రా మహోత్సవాలకు విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి యాత్రా మహోత్సవాలను దిగ్విజయంగా చేశారు.

## కన్నులపండువగా ఆలయ దశమ వార్షికోత్సవం

అయ్యప్ప స్వామి సహిత పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు ,హెూమాలు

ఘనంగా అయ్యప్ప స్వామి తిరువీధి ఉత్సవం







ముగ్గ్రాటలతో తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

**పొందూరు , ఫిబ్రవరి 18,ప్రజాజ్యోతి న్యూస్ :** పొందూరు మండల కేంద్రంలో వెలసియున్న శ్రీ అయ్యప్ప స్వామి సహిత పంచముఖ ఆంజనేయస్వామి దశమ వార్షికోత్సవం కార్యక్రమాన్ని శ్రీ ధర్మ శాస్త్ర సేవా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మంగళవారం నాడు కన్నుల పండువగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆరవిల్లి గిరి శర్మ, పురోహితుల ధర్మ పురి చరణ్ శర్మ , కూన పులి కిరణ్ శర్మ , జాడ సత్యన్నారాయణ శర్మ , వేద మంత్రోర్చనలతో విశేషంగా పూజలు నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వర పూజ , పుణ్యాహవాచనం ,పరిషత్ ,కృశ్చత్రయం,రక్షా సూత్రదారణ ,వాస్తు , యోగిని , క్షేత్ర పాలక ,నవగ్రహ , మండపారాధన , అగ్ని ప్రతిష్ఠాపన , వేద స్వస్తి ,హెూమాలు వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. దంపతులు ఈ పూజాది కార్యక్రమాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహ తిరువీధి కార్యక్రమాన్ని బాణాసంచా,కోలాటాల నడుమ వైభవంగా ఊరేగించారు.మహిళలు అధిక సంఖ్యలో ముగ్గ్రాటలతో తీరువీధి ఉత్సవంలో పాల్గొన్నారు.

# అభయ రక్షక దళం ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రత కు అవగాహన



**ఏలూరు, ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** జిల్లాలో అభయ రక్షక దళం, మహిళలు, బాలిక భద్రతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో, మహిళా ఎస్సై కాంతిప్రియ సిబ్బంది, మహిళలు, బాలికలు, వృద్ధుల రక్షణ కోసం అభయ రక్షక దళ సభ్యులతో కలిసి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో అభయ మహిళా రక్షక దళ సభ్యులు మహిళల భద్రతను ప్రాముఖ్యతనిచ్చి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి,జిల్లావ్యాప్తంగా గస్తీ నిర్వహిస్తున్నారు. ప్రజలకు సైబర్ నేరాలు, మహిళలపై ఆకతాయిల వేధింపులు, ఇతర భద్రతా సమస్యల గురించి అవగాహన కల్పిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. దీనిలో భాగంగా, అభయ వాహనం ద్వారా ప్రజలకు దృశ్యరూపంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా, సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళల భద్రతకు అవసరమైన సూచనలు, ఆత్మరక్షణ పద్ధతులపై మార్గదర్శనం అందిస్తున్నారు.ఈ కార్యక్రమాల ద్వారా మహిళలు, బాలికలు తమ భద్రతకు సంబంధించిన సమాచారం పొందుతూ, అజాగ్రత్తగా ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే అవకాశం కలుగుతోంది. సమాజంలో మహిళలపై జరిగే నేరాలను తగ్గించేందుకు, ప్రజల్లో భద్రతాపరమైన చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈ అవగాహన కార్యక్రమాలుఉపయోగపడుతున్నాయి అని ప్రజలు అంటున్నారు.టోల్ ఫ్రీ నెంబర్ 112,సైబర్ నేరాల నివారణ కోసం 1930 బాల్య వివాహాల నివారణ కోసం 1098 ఏలూరు జిల్లాలో వాట్సాప్ హెల్ప్‌లైన్ నెంబర్ 9550351100 కు ప్రజలు సంప్రదించవచ్చు అని అభయ రక్షక దళం సభ్యులు చైతన్య పరుస్తున్నారు.ప్రజలు ఈ సేవలను వినియోగించుకొని, తమ భద్రత కోసం అప్రమత్తంగా ఉండాలని అభయ రక్షక దళ సభ్యులు సూచిస్తున్నారు.

# వేగవంతంగా మండల కమిటీలు నియామకం

ఈనెల 22న అనంతపురంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జయప్రదం చేయండి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విస్సంపల్లి సిద్దు మాదిగ పిలుపు




**పోలవరం, ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** జిల్లాలో మండల కమిటీల నియామకం వేగవంతం చేసినట్లు ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు విస్సంపల్లి సిద్ధూ మాదిగ పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీన అనంతపురంలో జరగనున్న ఎమ్మార్పీఎస్, ఎం ఎస్పి అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విస్సంపల్లి సిద్దు మాదిగ పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా పోలవరంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఉంద్రాజవరపు వెంకటరమణ మూర్తి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి రాష్ట్ర నేత విస్సంపల్లి సిద్దు మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల కమిటీ నిర్మాణం వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.ఈనెల 23వ తేదీన అనంతపురం లో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాన్ని ఏలూరు జిల్లాలో ఉన్న ఎంఆర్పిఎస్ ఎంఎస్పి ,ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. ఆగస్టు ఒకటి ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జీల ధర్మాసనం తీర్పు అనంతరం మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ కు మందకృష్ణ మాదిగ విచ్చేయుచున్నారని తెలిపారు.అంబేద్కర్ స్ఫూర్తికి వ్యతిరేకంగా పనిచేసే కొన్ని శక్తులు ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటున్నారని ఇది అన్యాయమని తెలిపారు.ఎస్సీ వర్గీకరణ అంటేనే ఎస్సీల్లో ఉన్న 59 కులాలకు న్యాయం జరగడం అని ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా పంచమని తెలిపారు.ఈ కార్యక్రమంలో 12వ వార్డు నెంబర్ కడిమి చైతన్యకుమార్ మాదిగ, కడిమి నాగేశ్వరావు మాదిగ,రఘు మాదిగ,మాదిగ లాయర్ స్వరం నాయకులు కంభంపాటి జాన సుందరం మాదిగ,ఎమ్మార్పీఎస్ మండల నాయకులు చాపల రాజేంద్ర బాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

మూడు లక్షలు జరిమానా

బాధిత బాలికకు 10 లక్షల పరిహారం విశాఖపట్నం పోక్సో కోర్టు తీర్పు



**అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** అనకాపల్లి జిల్లా సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో 20 19 లో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన ఎర్ర నవీన్‌కు విశాఖ ఫోక్సో కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, మూడు లక్షలు జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 3 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొన్నట్లు వెల్లడించారు. జూలై 2019లో, బాధిత బాలిక పెందుర్తిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. నిందితుడు ఎర్ర నవీన్,బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి, పెళ్లి చేసుకుంటానని మోసగించి అత్యాచారం చేసి గర్భవతిని చేశాడు. బాధితురాలు పెళ్లి చేసుకోమని నిందితుడిని కోరినా, అతను తిరస్కరించడంతో పాటు అతని తల్లిదండ్రులు కూడా మాకు సంబంధం లేదని చెప్పారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.అప్పటి సబ్బవరం ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీలు కుమారస్వామి,శ్రీ మళ్ల మహేష్ ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు.విచారణ అనంతరం, విశాఖపట్నం పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీమతి జి.ఆనందని నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, మూడు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఇదే సందర్భంలో న్యాయస్థానం, బాధిత బాలికకు 10 లక్షల పరిహారం (3 లక్షలు నిందితుడి నుండి, 7 లక్షలు ప్రభుత్వ తరపున) అందజేయాలని తీర్పు లో తెలిపారు.సబ్బవరం పోలీసులు, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది సమయానికి సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. దీని ద్వారా నిందితుడికి కఠిన శిక్ష పడేలా దర్యాప్తు నిర్వహించిన అధికారులను, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు.

# జిల్లాలో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ సాగు వైపు అడుగులు వేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఆరోగ్యకరమైన పంటలు కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం



**కొవ్వూరు, ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** జిల్లాలో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ సాగు వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలం, దొమ్మేరు గ్రామంలో నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వ్యవసాయ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయం 12 ఎకరాలలోని పంటలను పండించడం అభినందనీయమన్నారు. వీరు పొలంలో చెరకు, బొప్పాయి, మొక్కజొన్న, నువ్వులు, అరటి, కోకో, కొబ్బరి, కంద, డ్రాగన్ ఫ్రూట్, జామ తదితర రకాల పంటలు వెయ్యడం జరిగిందన్నారు. వరి పొలంలో డ్రోన్ ద్వారా కషాయాలు పిచి కారీ చేసే విధానాన్ని స్వయంగా వీక్షించారు.జిల్లాలో 42 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారని తెలిపారు. 12 డ్రోన్ల టెక్నాలజీ తో 3800 మంది రైతులు 4200 ఎకరాల్లో కషాయాలు వాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. కషాయాలు వాడుతూ పురుగుల మందులు వాడకం తగ్గించడం శుభ పరిణామం అని తెలిపారు. 7300 మంది రైతులు పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా రని తెలిపారు. రైతులు అందరూ ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించి, ఖర్చు తగ్గించుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంటలను సందర్శన చాలా సంతృప్తికరంగా ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, ఎస్.మాధవరావు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కొవ్వూరు ఏపిసిఎన్ ఎఫ్,డీపీఎం, బి.తాతారావు,అదనపు డిపిఎం మహబూబ్ వలి, వ్యవసాయ శాఖ ఏడి, పి చంద్రశేఖర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# శ్రీ మద్ది క్షేత్రంలో భక్తుల సందడి

ప్రత్యేక అలంకరణలో శ్రీ స్వామి దర్శనం

శ్రీ మద్ది స్వామికి తమలపాకులతో విశేష పూజలు



**జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుఝామున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో దర్శనాలకు అధిక సంఖ్యలో భక్తులు బారులుదీరి క్యూ లైన్ లో వేచి ఉండి స్వామివారిని దర్శించుకొన్నారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు శ్రీస్వామి వారి ఆలయము చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మద్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల రూపేణ 1,32,693 రూపాయి లు ఆదాయం లభించినట్లు దేవస్థానం ఈవో ఆర్ వి చందనా తెలిపారు. ఆలయం వద్ద ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన వేణుగోపాల కోలాట భజనమండలి వారిచే కోలాటం ప్రదర్శించారు. సుమారు 1500 మంది భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీ స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా ఆలయ పర్యవేక్షకులు



# గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించండి

జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్



**నంద్యాల ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** ప్రతిరోజు 25 ఎకరాలకు మించకుండా రీసర్వే పనులు జరిగేలా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ ఆదేశించారు. మంగళవారం రుద్రవరం మండలం బీరవోలు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనుల గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ మండలాల్లో జరుగుతున్న రీ సర్వే పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు 25 ఎకరాలకు మించకుండా రీసర్వే పనుల గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ విస్తీర్ణ కొలతలు అడిగి తెలుసుకుంటూ మార్పులు లేకుండా రికార్డుల్లో వున్న మేరకు సర్వే పనులు చేపట్టాలన్నారు. గ్రామ సరిహద్దు స్థిరీకరణ, స్టోన్ ప్లాంటేషన్ తదితర పనులు కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ కరెక్షన్స్, మ్యుటేషన్ ట్రాన్స్‌యాక్షన్స్ డేటా ఎంట్రీ కూడ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వే అండ్ ల్యాండ్ ఏడీ జయరాజ్, మండల తాసీల్దార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఆళ్లగడ్డ మండలం బత్తులూరు గ్రామంలో నూతన పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సంబంధించి అభ్యంతర లేని ధ్రువీకరణ మంజూరు విషయంపై సంబంధిత స్థలాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు.

# అరటి తోటలు, నర్సరీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి



**నంద్యాల ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** సిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామంలో అరటి తోటలు, పూల తోటల నర్సరీని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పరిశీలించారు. మంగళవారం సిరివెళ్ల మండలం మహాదేవపురం, బోయలకుంట్ల గ్రామా లలోని అరటి తోటలు, పూల, కూరగాయల తోటల నర్సరీని పరిశీలించారు. రైతుల పొలాలను సూపర్ చెక్ చేస్తూ ఏ మొక్కలను పెంచుతున్నారనే వివ రాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసు కున్నారు. మొక్కల పెంపకం, నిర్వహణ బాగుండే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. బోయలకుంట్ల గ్రామంలో జింక నారాయణ, లక్ష్మీ దంపతుల పూల, కూరగాయ తోటల నర్సరీలను పరిశీలిస్తూ మొక్కల పెంపకం, నిర్వహణ బాగుండడంతో కలెక్టర్ ప్రశంసిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు.

# సాయిరాం రాయల్ నూతన గృహప్రవేశం పాల్గొన్న మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్,ఎన్ఎండి ఫిరోజ్





**నంద్యాల ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** స్థానిక సాయిబాబా నగర్ తిక్క స్వామి దర్గా వద్ద 24వ వార్డు టిడిపి ఇంచార్జ్ సాయిరాం రాయల్,జ్యోతి రాయల్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమంకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్,నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

# అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇవ్వాలి సిపిఐ సదస్సులో డిమాండ్






**కర్నూలు ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం 11 గంటలకు సిపిఐ కార్యాలయం నందు ఇంటి స్థలాల లబ్ధిదారుల సదస్సు జరిగినది ఈ సదస్సు కార్యక్రమానికి అధ్యక్షులుగా సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య సిపిఐ సీనియర్ నాయకులు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం హాజరైనారు రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా మా ప్రభుత్వ వస్తే ఈ రాష్ట్రంలోని ఇల్లు లేని ప్రతి నిరుపేదకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని పేద ప్రజలకు హామీ ఇచ్చి ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన తర్వాత ఇప్పుడు పేదలకు ఇచ్చే రెండు సెంట్లు స్థలం కి అనేక రకాల షరతులు పెట్టి ఇస్తామంటే సరైన పద్ధతి కాదని ఎలాంటి షరతులు లేకుండా పట్టణ ప్రాంతంలోని పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని గ్రామీణ ప్రాంతంలోని పేదలకు మూడు సెట్ల స్థలం ఇవ్వాలని ఈ స్థలాలు కూడా ప్రజలు కు నివాసయోగ్యంగా ఉండే ప్రాంతాలలో స్థలాలు చూపాలని నగరాలకు సుదూర ప్రాంతాల్లో కాదని వారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈనాడు ఇల్లు కట్టుకోవాలంటే 10 నుండి 20 లక్షల దాకా ఖర్చవుతుందని ప్రభుత్వం ఇచ్చే నాలుగు లక్షల రూపాయలు ఏమాత్రం సరిపోదని ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నాలుగు లక్షల రూపాయలను ఐదు లక్షలకు పెంచాలని పేదలు నిర్మించుకునే ఇండ్లకు ఇసుక సిమెంటు స్టీలు ఫ్రీగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గిడ్డయ్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా పేద ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని తల్లికి వందనం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మహాలక్ష్మి పథకం నిరుద్యోగ భృతి ఇవన్నీ కూడా హామీలు హామీలుగానే మిగిలిపోయే పరిస్థితి ఉన్నదని పేద ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసాలను పసిగతి ఎప్పటికప్పుడు ఆందోళన చేపట్టి హక్కులను సాధించుకునే దానికోసం ఎర్రజెండా చేతపట్టి పోరాటాలకు సిద్ధం కావాలని సదస్సులో పాల్గొన్న మహిళా సోదరులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ శ్రావణి రెడ్డి నగర కార్యదర్శి భారతి సిపిఐ నగర సహాయ కార్యదర్శిలు శ్రీనివాసరావు ,మహేష్ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు బిసన్న అన్వర్ నల్లన్న ఏ ఐ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసులు ఏ ఐ యస్ యఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ భాష దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామచంద్ర నగర కార్యదర్శి కుమార్ రాజా ప్రజానాట్యమండలి నగర అధ్యక్ష కార్యదర్శులు శీను .శివ మరియు పార్టీ ప్రజాసంఘాల బాధ్యతలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు సదస్సు అనంతరం ఇండ్ల స్థలాల లబ్ధిదారుల నగర కమిటీ ఏర్పాటు చేయడం జరిగినది.కమిటీ మెంబర్స్ గా సుశీలమ్మ పద్మమ్మ వరలక్ష్మి సర్దార్ అబ్రహం రత్నమ్మ బుజ్జి శిరీష శివమ్మ జయన్న భీముడు నూర్జహాన్ ఏసు రాజు నాగలక్ష్మి ముర్తుజావలి నూర్జహాన్ జరీనా రమణ అల్లాబు మంగమ్మ హనుమక్క లక్ష్మి చంద్రకళ మాలాంబి కృష్ణవేణి లలితమ్మ నరసింహులు సర్దార్ శ్రావణి భారతి మాధవి లక్ష్మీబాయి మున్ని మద్దమ్మ మారెమ్మ లను కమిటీ మెంబర్స్ గా ఎన్నుకోవడం జరిగినది 1.నగర కన్వీనర్ గా రబియా 2 కో కన్వీనర్లుగా -అబ్రహం -జరీనా -అల్లాబు -చంద్రకళలను

# ప్రజా సమస్యల పై పోరాట కమిటీ కార్యవర్గ సభ్యుల ఎన్నిక



**నంద్యాల ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** స్థానిక పట్టణములోని ప్రజా సంఘాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో నంద్యాల జిల్లా నందు అనేక సామాజిక సమస్యలు ఉన్నాయి,ఆ సమస్యల భాదితులు ఎక్కడికి వెళ్ళాలో,ఎవరిని సంప్రదిస్తే తమ సమస్య పరిష్కారం లభిస్తుందో తెలియక చాల మంది భాదితులు ఇబ్బంది పడుతున్నా విషయాన్ని గుర్తించి నంద్యాల లో ఉన్న వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రజా సమస్యల పై పోరాట కమిటీ అనే ఒక కమిటీ ఏర్పాటు చేసుకొని నూతన కార్యవర్గాన్ని ప్రజాస్వామ్య బద్ధంగా,ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకోవడం జరిగింది. ఈ కమిటీ అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా,కుల మతాలకు అతీతంగా పని చేయాలని నిర్ణయించుకోవడం జరిగింది అని తెలిపారు.

**వర్కింగ్ ప్రెసిడెంట్ లు గా**

1 ఆకుమాళ్ల రహీమ్,(అల్ మదద్ ఫౌండేషన్ చైర్మన్).

2. రఫీ ,(పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షులు)

3. గౌరవ అధ్యక్షులుగా జానయ్య(క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి).

4.గౌరవ సలహా దారుడుగా అడ్వకేట్ షేక్.రియాజ్,(డెమొక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)

5 అధ్యక్షులుగా సయ్యద్ మహబూబ్ భాష (జానో జాగో జాతీయ కార్యదర్శి).

6.ప్రధాన కార్యదర్శిగా శివరామి రెడ్డి(సాంస్కృతిక విభాగం కన్వీనర్)

7 .ఉపాధ్యక్షులుగా అర్షద్(విజిటబుల్ మార్కెట్ ప్రెసిడెంట్). యేసు దాసు,(క్రిస్టియన్ జేఏసీ సభ్యులు),సత్య నారాయణ(చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు).

8 సహాయ కార్యదర్శులుగా వాహిదా,అల్తాఫ్,దారం మధు బాబు.

9.కోశాధికారిగా మొహమ్మద్ అయ్యూబ్ హుస్సేన్, ఈ కమిటీ నీ భవిష్యత్తులో కలిసి పని చేయడానికి ముందుకు వచ్చే ప్రజా సంఘాల నాయకులుకు,అన్ని కుల సంఘాల నాయకులు కలుపుకొని విస్తరించడం జరుగుతుంది. ఉత్సాహం ఉన్న ఎవరైనా మా సంఘంలో కలిసి పనిచేయడానికి వస్తే ఆహ్వానిస్తామని కమిటీ పెద్దలు తెలిపారు.

ఇందులో భాగంగా కార్యాచరణలో మొదటగా ఉర్దూ జూనియర్ కళాశాలకు భాలాజీ కాంప్లెక్స్ లో ఉన్న వక్ఫ్ బోర్డు ఆస్తుల బిల్డింగ్ లో (మాజీ ఇక్రా స్కూల్ ) నందు ఏర్పాటు చేయడం కొరకు.

రెండవ అంశంగా క్రిస్టియన్ మైనార్టీ లకు స్మశాన స్థలం కేటాయింపు కొరకు,మూడవ అంశంగా సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేయాలని పోరాటం చేయాలని ప్రస్తుతం ఈ మూడు అంశాల పైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

# ‘తండేల్’లో ప్రేమికులు వీరే..



శ్రీకాకుళం జిల్లా కె. మత్స్యలేశం గ్రామంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తండేల్ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ఆ చిత్ర యూనిట్ చెప్పుకుంది.కె. మత్స్యలేశం గ్రామస్థులు కొందరు వేటకు వెళ్లి పాకిస్తాన్ నేవీకి చిక్కడం, 14 నెలల తర్వాత రిలీజ్ కావడం, వారి కుటుంబాలు పడిన ఆవేదన అంతా ఈ చిత్రంలో చూపించారని గ్రామస్థులు చెబుతున్నారు.ఈ సినిమాతో తమ గ్రామం పేరు ఇప్పుడు అందరికీ తెలిసిందని, ఇందులో ప్రధాన పాత్రలన్నీ కూడా తమ గ్రామస్థులవే కావడంతో ఇప్పుడు తమ గ్రామం, తాము చిన్నపాటి సెలబ్రిటీలుగా మారిపోయామని కె. మత్స్యలేశం గ్రామస్థులు బీబీసీతో చెప్పారు.

తండేల్ సినిమాతో కె. మత్స్యలేశం గ్రామాన్ని తండేల్ గ్రామమంటూ అంతా చెప్పుకుంటున్నారు.తండేల్ సినిమా మూల కథకు ఆధారమైన ఈ గ్రామంపై మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయి.అలాగే ఈ సినిమా, గ్రామంలో కొద్దిపాటి రాజకీయ వివాదాన్ని కూడా లేపింది.ఇంతకీ తండేల్ అనే పదానికి అర్థమేంటి? తండేల్ గ్రామంగా పేరు పొందిన కె.మత్స్యలేశంలో ప్రస్తుత పరిస్థితి ఏంటి?గ్రామస్థులు తండేల్ సినిమా కథపై ఏమంటున్నారు? తండేల్ సినిమాతో రేగిన రాజకీయ వివాదమేంటో కూడా చూద్దాం.

తండేల్ సినిమా తర్వాత ‘తండేల్’ అంటే ఏంటని చాలా మంది తెలుసుకోవాలని అనుకున్నారు. ఇది తెలుగు పదం కాదు. గుజరాతీ పదం.గుజరాత్‌కు చెందిన మత్స్యకారుల్లోని ఒక వర్గానికి చెందినదే తండేల్ అనే పదం. సముద్రంలో వేటకు వెళ్లే బృందానికి వీళ్లు నాయకత్వం వహిస్తుంటారు. వీరిని తండేల్ అని పిలుస్తుంటారు.ఇలా తండేల్ అని పిలుచుకునే మత్స్యకారుల వద్దకే కె. మత్స్యలేశం గ్రామానికి చెందిన మత్స్యకారులు పనికి వెళుతుంటారు. దాంతో ఈ తండేల్ అనే పదం ఈ గ్రామస్థులకు పరిచయమైంది. శబ్ధం కూడా ఆసక్తికరంగా ఉండటంతో వేటకు వెళ్లే తెలుగు మత్స్యకారులు కూడా తమ బృందానికి నాయకత్వం వహించే వ్యక్తిని ‘తండేల్’ అని పిలవడం అలవాటు చేసుకున్నారు.ఇందులో జూనియర్ తండేల్, సీనియర్ తండేల్ అని కూడా ఉంటారు. వయసు, వేటకు వెళ్లే అనుభవం ఆధారంగా పిలుస్తుంటామని గత ఇరవై ఏళ్లుగా గుజరాత్‌లోని వేరావల్ తీరానికి వేటకు వెళ్తున్న సీనియర్ తండేల్ రామారావు బీబీసీతో చెప్పారు.“గుజరాత్‌లో తండేల్ అంటే బోటుకి, అందులోని సభ్యులకు నాయకత్వం వహించేవాడు. వారి బాధ్యత మొత్తం ఆయనదే. గుజరాత్‌లోనే ఎక్కువ ఉండటంతో మాకు ఆ పదం అలవాటైపోయింది. ఇక్కడైనా అక్కడైనా నన్ను తండేల్ అనే అంటారు” అని చెప్పారు తండేల్ రామారావు.తండేల్ సినిమాలో ఈ రామారావు నిజ జీవిత పాత్రనే నాగచైతన్య, రామారావు భార్య నూకమ్మ పాత్రని సాయిపల్లవి పోషించినట్లు సినిమా బృందం ప్రకటించింది.

**తండేల్ సినిమాకి ఆధారమైన కథ ఇక్కడ ఎలా మొదలైందంటే...**

శ్రీకాకుళం జిల్లాలోని మత్స్యకారులు చేపల వేట కోసం గుజరాత్, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు వెళ్తుంటారు.వేట సమయంలో జీపీఎస్ పని చేయకపోవడం, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వంటి కారణాలతో సముద్రంలో దారి తప్పి అప్పుడప్పుడు పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక బోర్డర్లలో ప్రవేశించి అక్కడి కోస్ట్ గార్డు, నేవీలకు చిక్కి జైళ్ల పాలవుతుంటారు.శ్రీకాకుళం జిల్లాలోని డి. మత్స్యలేశం పంచాయతీలోని కె. మత్స్యలేశం గ్రామంలో తండేల్ సినిమా కథ మొదలైంది.ఇక్కడ నుంచి ఏటా ఫిషింగ్ సీజన్ (జులై–ఫిబ్రవరి) లో వందల మంది మత్స్యకారులు జీవనోపాధి కోసం గుజరాత్ తీరంలోని వేరావల్‌కు వలస వెళ్తుంటారు.ఈ ఏడెనిమిది నెలలు కుటుంబాలకు దూరంగా అక్కడే ఉంటారు.కె. మత్స్యలేశానికి చెందిన మత్స్యకారులు 2018 నవంబర్‌లో చేపల వేటకు గుజరాత్ వెళ్లారు. అక్కడి నుంచి అనుకోని పరిస్థితుల్లో 22 మంది పాకిస్తాన్ కోస్ట్ గార్డుకు చిక్కారు.ఇది గమనించిన కొందరు మత్స్యకారులు విషయాన్ని భారత అధికారులకు, వారి కుటుంబసభ్యులకు తెలిపారు.పాకిస్తాన్ కోస్ట్ గార్డు అధికారులు తమకు చిక్కిన మత్స్యకారులను కరాచీ జైలుకి తరలించారు.“మా ఆధార్ కార్డులు, సెల్‌ఫోన్లు తీసుకున్నారు. 14 నెలలు అక్కడి జైల్లోనే ఉన్నాం. తిరిగి వస్తామని అనుకోలేదు. ఎట్టకేలకు ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, మీడియా సహకారంతో 14 నెలల తర్వాత భారతదేశంలో అడుగుపెట్టాం. ఆ సమయంలో మా కుటుంబాలు, మేం పడిన ఆవేదన అంతా ఇంతా కాదు. అదంతా సినిమాలో చూపించారు.



జెట్టీలు కడితే ఇలా వలసకు వెళ్లి కష్టాలు ఎదుర్కొవాల్సిన పరిస్థితులు ఉండవని ఈ సినిమా ద్వారా మరోసారి చెప్పారు. ప్రభుత్వాలు పట్టించుకుంటాయో లేదో మరి” అని మత్స్యకారుడు వి. రాము బీబీసీతో చెప్పారు.

**తండేల్ తర్వాత గ్రామంలో పరిస్థితి ఎలా ఉందంటే...**

ఈ సినిమా షూటింగ్ జరుగకముందే కె. మత్స్యలేశం మత్స్యకారులతో మాట్లాడేందుకు హీరో నాగచైతన్య, చిత్ర బృందం ఇక్కడికి రావడంతో కె. మత్స్యలేశం గ్రామం ఫోకస్‌లోకి వచ్చింది.సినిమా విడుదల తర్వాత కె. మత్స్యలేశం గ్రామంలో కాస్త హుషారైన వాతావరణం కనిపించింది.అక్కడక్కడ నాగచైతన్యతో మత్స్యకారులున్న బ్యానర్లు కనిపించాయి. ఈ సినిమా ద్వారా తమ గ్రామం అందరికీ తెలిసిందంటూ దాదాపు గ్రామంలోని మత్స్యకారులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.“సినిమా చూసి నేను హ్యాపీగా ఫీలయ్యాను. మా మత్స్యకారుల రియల్ స్టోరీ. మా మారుమూల గ్రామం కోసం పాన్ ఇండియా స్థాయిలో ఒక సినిమా వచ్చిదంటే గ్రేట్ కదా” అని బీబీసీతో నూకమ్మ చెప్పారు. తండేల్ సినిమాలో ఈమె పాత్రనే సాయిపల్లవి పోషించారు.“మా చుట్టుపక్కల గ్రామాలతో పాటు, శ్రీకాకుళం వెళ్లినా కూడా రియల్ తండేల్, రియల్ సాయిపల్లవి అంటున్నారు. మాతో పాటు పాకిస్తాన్‌లో చిక్కుకున్న మత్స్యకారులందర్నీ హీరోలంటూ మాట్లాడుకుంటున్నారు” అని నూకమ్మ చెప్పారు.

**సినిమాతో వెలుగులోకి...**

ఈ సినిమా ద్వారా గ్రామానికి, తమకు కాస్త పేరు వచ్చిందని కొందరు మత్స్యకారులు అన్నారు. అయితే, తమకు కావాల్సింది అది కాదని వారు అంటున్నారు. అప్పన్న అనే మహిళ బీబీసీతో మాట్లాడుతూ ఏమన్నారంటే.“పాకిస్తాన్‌కు చిక్కినప్పుడు, విడుదలైనప్పుడు ప్రభుత్వాలు... ఇప్పుడు సినిమా కోసం నటులు ఎంతో కొంత సాయం చేశారు. కానీ, అసలు వేట కోసం గుజరాత్ లేదా వేరే దేశం ఎందుకు వెళ్లాలి? జెట్టీలు కడితే మా ఊరిలోనో, పక్కనో వేట చేసుకుంటాం కదా?సినిమా తీశారని మీరంతా మా ఊరు వస్తున్నారు. కానీ, మా ఊర్లో ఏముందసలు? మీరు చూశారు కదా... మూడు పూటలు తిని, మంచి బట్ట కట్టినోళ్లు బాగా ఉన్నోళ్ల కిందే లెక్క ఇక్కడ. కానీ, ఆ పరిస్థితి మా ఊర్లో లేదు. పేద బతుకులు మావి” అన్నారు అప్పన్న.”సినిమా పక్కన పెట్టండి. జెట్టీలు నిర్మించి వలసలు ఆరికడతామని గతంలో చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్ అందరూ మాటిచ్చారు. ఎవరైనా కనికరించి, జెట్టీలు కడితే ఇక్కడే ఉండేటట్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని” మత్స్యకారుడు రామారావు అన్నారు.

**‘తండేల్’ తో రాజకీయం**

కె. మత్స్యలేశం మత్స్యకారులు పాకిస్తాన్‌కు చిక్కినప్పుడు (2018 నవంబర్) టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. వారు విడుదలైనప్పుడు (2020 జనవరి) వైసీపీ అధికారంలో ఉంది.ఈ రెండు ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం తమ విడుదలకు ఎంతో సహాయం చేశాయని, అలాగే కష్టంలో ఉన్నప్పుడు ఆర్థికంగా ఆదుకున్నాయని మత్స్యకారులు చెప్తున్నారు.కానీ, వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను విడుదల చేసేందుకు కృషి చేసిందని, దానిని సినిమాలో చూపించలేదని కొందరు గ్రామస్థులు అంటున్నారు.అప్పుడు శ్రీకాకుళం ఎంపీగా ఉన్న రామ్మోహన్ నాయుడు కేంద్రంతో జరిపిన సంప్రదింపుల వల్లే వీరి విడుదల సాధ్యమైందని మరి కొందరు అంటున్నారు.ఈ విషయంలో మాత్రం గ్రామంలోని ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయి మాట్లాడటం కనిపించింది. ఇదే సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

**అసలు జెట్టీ అంటే ఏంటి?**

జెట్టీ అనేది తీరప్రాంతాన్ని అలల ప్రవాహం, అటుపోట్ల నుంచి రక్షించే ఒక నిర్మాణం. మత్స్యకారుల బోట్లను లంగరు వేసుకునేందుకు నిర్మించే జెట్టీలు సాధారణంగా రాయి లేదా కాంక్రీటుతో నిర్మిస్తారు. అవి తీరం నుంచి సముద్రపు నీటిలోకి నిర్మిస్తారు.గుజరాత్, కేరళ, తమిళనాడులోని తీరప్రాంతాల్లో ప్రతి 20, 30 కిలోమీటర్లకు ఒక జెట్టీ ఉంటుందని, శ్రీకాకుళం జిల్లాకు చూసుకుంటే విశాఖపట్నం దాటిన తర్వాత మళ్లీ ఎక్కడ జెట్టీ లేదని మత్స్యకారులు చెప్పారు.“జెట్టీ లేకపోతే అలలు, ఆటుపోట్ల వల్ల వేటలో ఉన్న పడవలు తిరగబడి, చనిపోయిన సంఘటనలు చాలా చూశాం. జెట్టీ ఉంటే అలాంటి పరిస్థితి రాదు. వానొచ్చినా, తుపానొచ్చినా మా పడవలు అన్నింటిని జెట్టీ దగ్గరే కట్టేసుకొవచ్చు.


# న్యాయమూర్తి నాస్తికుడు కానవసరం లేదు

ఇతర మతాల విషయంలో నిష్పాక్షికంగా ఉండేందుకు న్యాయమూర్తి నాస్తికుడు కానవసరం లేదు

జస్టిస్ డీవై చంద్రచూడ్

జస్టిస్ డీవై చంద్రచూడ్, సుప్రీంకోర్ట్ ఆఫ్ ఇండియా, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి,

అయోధ్యలో రామ మందిర నిర్మాణం కేసులో తీర్పు వెలువరించడానికి ముందు, ఈ సమస్యకు పరిష్కారం చూపించమని దేవుడిని ప్రార్థించాననే వార్తల్ని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనుంజయ్ యశ్వంత్ చంద్రచూడ్ తిరస్కరించారు.అయోధ్య వివాదంలో తీర్పు, ఆర్టికల్ 370, న్యాయ శాఖలో పారదర్శకతతో పాటు అనేక అంశాలపైన జస్టిస్ చంద్రచూడ్ బీబీసీ ప్రతినిధి స్టీవెన్ సేకర్‌తో ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలో మాట్లాడారు.“రామ మందిర వివాదంపై నిర్ణయం తీసుకోవడానికి ముందు మార్గం చూపించాలని మీరు భగవంతుడిని ప్రార్థించారా?” అని స్టీవెన్ అడిగారు.ఈ ప్రశ్నకు జస్టిస్ చంద్రచూడ్ సమాధానం ఇస్తూ “ఇది పూర్తిగా అబద్ధం. సామాజిక మాధ్యమాల్లో ఈ ప్రచారం జరిగింది. నా వ్యాఖ్యల్ని తప్పుగా అర్థం చేసుకున్నారు” అని చెప్పారు.జస్టిస్ డీవై చంద్రచూడ్ 2022 నవంబర్ నుంచి 2024 నవంబర్ 10వరకు భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు.చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలోనే అనేక ముఖ్యమైన అంశాల మీద సుప్రీంకోర్టు తీర్పులు వెల్లడించింది.కొన్ని తీర్పుల విషయంలో ఆయనపై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా రాజకీయ ఒత్తిడి ఉందనే ఆరోపణలు వినిపించాయి.



1 ఆగస్టు 2024 జస్టిస్ డీవై చంద్రచూడ్, సుప్రీంకోర్ట్ ఆఫ్ ఇండియా, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, అయోధ్యలో రామ మందిరం, ఆర్టికల్ 370, న్యాయ స్వేచ్ఛ

**న్యాయ స్వేచ్ఛ**

నరేంద్ర మోదీ భారతదేశాన్ని ఏక పార్టీ పాలన కిందకు తెచ్చేందుకు, బీజేపీని రక్షించుకోవడానికి, ప్రత్యర్థుల్ని అణచి వేయడానికి కోర్టులను ఆశ్రయించారని విశ్లేషకులు, దౌత్యవేత్తలు ప్రతిపక్షాలు అంగీకరించాయంటూ 2023లో న్యూయార్క్‌టైమ్స్ రాసింది.న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని ప్రస్తావిస్తూ, స్టీవెన్ సేకర్ మీరు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న కాలంలో రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొన్నారా అని అడిగినప్పుడు జస్టిస్ డీవై చంద్రచూడ్ “ది న్యూయార్క్ టైమ్స్‌లో రాసిందంతా పూర్తిగా అబద్ధం. ఎందుకంటే 2024 ఎన్నికల్లో ఏం జరుగుతుందో అర్థం చేసుకోవడంలో వాళ్లు విఫలం అయ్యారు. 2024 ఎన్నికలు ఒకే దేశం– ఒకే పార్టీ అనే ఆలోచనను భగ్నం చేశాయి. భారత దేశంలోని రాష్ట్రాల్లో ప్రాంతీయ ఆశలు, ఆకాంక్షలే ముఖ్యం. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. వాటి పని తీరు అద్భుతంగా ఉంది” అని చెప్పారు.కొన్నేళ్లుగా అనేక మంది ప్రతిపక్ష నాయకులు, పౌర సమాజ కార్యకర్తలు, జర్నలిస్టులను జైళ్లలో పెట్టారు. 2023లో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి పరువు నష్టం దావా కేసులో గుజరాత్ కోర్టు శిక్ష విధించింది. దీని వల్ల ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని కోల్పోయే అవకాశం ఏర్పడింది. అయితే తర్వాత సుప్రీంకోర్టు ఈ తీర్పుపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది.రాహుల్ గాంధీ కేసులో సుప్రీంకోర్టు జోక్యంతో న్యాయ వ్యవస్థ మీద రాజకీయ జోక్యం లేదని భావించవచ్చా? అని స్టీవెన్.. జస్టిస్ చంద్రచూడ్‌ను అడిగారు.ఈ ప్రశ్నపై స్పందించిన జస్టిస్ చంద్రచూడ్ “2024లో సుప్రీంకోర్టులో 21,300 బెయిల్ పిటిషన్లు దాఖలయ్యాయి. వాటన్నింటి మీద సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీనర్థం ఏంటంటే చట్టం తన పని తాను చేస్తోందని. అమెరికా, బ్రిటన్ లేదా ఆస్ట్రేలియా, ప్రతి దేశానికి తనదైన న్యాయప్రక్రియ ఉంటుంది” అని అన్నారు.“అయితే ఉన్నత న్యాయస్థానాలు, ప్రత్యేకించి సుప్రీంకోర్టులో వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడతామని స్పష్టమైన సందేశం ఇచ్చాయి. వివిధ కేసుల్లో తీర్పులు తప్పుగా ఇచ్చారనో, కరెక్టుగా ఇచ్చారనో వేర్వేరు అభిప్రాయాలు ఉండవచ్చు. అయితే దీనిపై పరిష్కారాలు ఉన్నాయి. వాస్తవం ఏంటంటే వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడే విషయంలో సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా ముందుంది” అని చంద్రచూడ్ చెప్పారు.

జమ్ముకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ 2023లో సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. జస్టిస్ డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు చెప్పింది.సుప్రీంకోర్టు తీర్పును అనేకమంది న్యాయ నిపుణులు విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించడంలో జస్టిస్ డీవై చంద్రచూడ్ విఫలమయ్యారని అన్నారు.“ఈ కేసులో ఇచ్చిన తీర్పులో కొంత భాగం నేను రాశాను. ఆర్టికల్ 370ను రాజ్యాంగం రాసినప్పుడే అందులో పొందుపరిచారు. అది కూడా మార్పుగలిగిన నిబంధనలు అనే భాగంలో చేర్చారు. తర్వాత దానికి తాత్కాలిక మార్పుగలిగిన నిబంధనలు అని పేరు పెట్టారు””కాబట్టి రాజ్యాంగం రాసినప్పుడు ఈ నిబంధన క్రమేపీ అంతరించిపోతుందని భావించారు. ఒక ప్రతిపాదనను అంతరించి పోవడానికి 75 సంవత్సరాలు తక్కువ సమయం అనుకోవాలా?” అని చంద్రచూడ్ అన్నారు.ఆర్టికల్ 370ని రద్దు చేయడమే కాదు, జమ్ముకశ్మీర్‌కు ఉన్న రాష్ట్ర హోదాను తొలగించారు. దాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు గడువు విధించలేదు కదా అని స్టీవెన్ సేకర్ అడిగారు.ఈ ప్రశ్నకు స్పందనగా జస్టిస్ చంద్రచూడ్ “జమ్మూ కశ్మీర్‌లో ప్రజాస్వామ్య ప్రక్రియ స్థాపనకు సుప్రీంకోర్టు 2024 సెప్టెంబర్ 30ని డెడ్‌లైన్‌గా పెట్టింది. 2024 అక్టోబర్‌లో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రకటన వచ్చింది” అని చంద్రచూడ్ చెప్పారు.కాగా.. సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, దుష్యంత్ దవే ఈ నిర్ణయాన్ని రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.ఈ ఆరోపణలపై స్పందించిన డీవై చంద్రచూడ్.. “చూడండి. ఇప్పుడక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కాకుండా మరో పార్టీకి అక్కడ చాలా ప్రశాంతంగా అధికారం దక్కింది. జమ్ముకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం విజయవంతమైందని ఇది స్పష్టం చేస్తోంది” అని చంద్రచూడ్ అన్నారు.జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా రద్దు చేయడంపై స్పందిస్తూ “జమ్ముకశ్మీర్‌ను మూడు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చేటప్పుడు.. రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అఫిడవిట్లను సుప్రీంకోర్టు ఆమోదించింది” అని చంద్రచూడ్ అన్నారు.అయితే సుప్రీంకోర్టు జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ఎలాంటి గడువు నిర్ణయించలేదు. “ఆ కోణంలో చూస్తే సుప్రీంకోర్టు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వ జవాబుదారీతనాన్ని పరిగణనలోకి తీసుకుంది. మేం రాజ్యాంగ హక్కులను ఉపయోగించుకోలేదనే విమర్శ సరైనది కాదు” అని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి చెప్పారు.

**మైనార్టీల వ్యవహారాలు**

పౌరసత్వ సవరణ చట్టం పొరుగు దేశాల్లోని హిందువులకు భారత పౌరసత్వం ఇవ్వడం గురించి ప్రస్తావిస్తుంది. అయితే భారత రాజ్యాంగం మాత్రం, జాతి, మతం లాంటి వాటిని పట్టించుకోకుండా అందరినీ సమానంగా చూడాలని చెబుతోంది.పౌరసత్వ సవరణ చట్టంతో భారతదేశంలోని మైనారిటీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించవచ్చని అనిపించలేదా?ఈ ప్రశ్నకు సమాధానంగా జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ “బ్రిటన్‌లో కోర్టుకు కూడా అలాంటి చట్టాన్ని రద్దు చేసే హక్కు లేదు. కానీ భారతదేశంలో ఉంది. పౌరసత్వం అంశం ఇప్పటికీ కోర్టులోనే ఉంది” అని చెప్పారు.“నా పదవీకాలంలో రాజ్యాంగ ధర్మాసనం కోసం 62 తీర్పులు రాశాను. సమాఖ్య నిర్మాణం, రాష్ట్రాలకు మరిన్ని హక్కులు అనే అంశంతో పాటు అనేక రాజ్యాంగపరమైన అంశాల గురించి 20 ఏళ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసులపై మా తీర్పుల ద్వారా రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చాం. అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయానికి మైనారిటీ హోదా ఉండాలా వద్దా అని మేం నిర్ణయించాం. 1968 నాటి సుప్రీంకోర్టు నిర్ణయాన్ని మేము రద్దు చేశాం” అని తెలిపారు.ఆర్టికల్ 370 రద్దు: సుప్రీంకోర్టు తీర్పును ఈ న్యాయ కోవిదులు ఎందుకు తప్పుబడుతున్నారు?

## తెలంగాణ : ఆ బోర్ల నుంచి సలసల కాగే నీరు, 40 ఏళ్లుగా ఈ జలధారలు ఎందుకిలా వస్తున్నాయి

పగిడేరులో బావుల నుంచి ధారగా వస్తోన్న వేడి నీరు



ఎక్కడైనా బావుల నుంచి తాగేందుకు మంచినీళ్లు వస్తాయి. లేదంటే ఉప్పు నీళ్లు వస్తాయి. కానీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిలేరు గ్రామంలోని కొన్ని బోరుబావుల నుంచి మాత్రం పొగలు కక్కే వేడి నీళ్లు వస్తున్నాయి.మోటార్లు లేకుండా, ఎవరూ తోడకుండానే సుమారు 40 ఏళ్లుగా 365 రోజులూ ధారగా వేడి నీళ్లు వస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.”మాది సింగరేణి ప్రభావిత ప్రాంతం. కింద మైన్స్ ఉండటం వల్ల నలభై ఏళ్ల కిందట సింగరేణి వాళ్లు టెస్టింగ్ కోసం బోర్‌వెల్స్ వేశారు. అందులో భాగంగా కొన్ని బోర్‌వెల్స్ వెయ్యి, 2 వేల మీటర్ల లోతున తవ్వితే వేడి నీళ్లు ఉబికి వచ్చాయి. వ్యవసాయానికో, మరొక విధంగానో ఉపయోగపడతాయని వాటిని వదిలేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి 24 గంటలూ నీళ్లు వస్తూనే ఉన్నాయి’ అని గ్రామస్థుడు కోరెం రాంపండు తెలిపారు.”ఆ బోరు ద్వారా వేడి నీళ్లు వాటంతట అవే బయటకు వస్తున్నాయి. కరెంటు, మోటారు, ఆయిల్ ఇంజన్ లేకుండా వాటంతట అవే భూమి నుంచి బయటకు వస్తున్నాయి.

**దాదాపు 60 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో..**

”పగిడేరు గ్రామం సమీపంలో దాదాపు నలభై ఏళ్ల కిందట జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) వాళ్లు 8 బోర్లు వేశారు. కిలోమీటరు లోతు వరకు బోర్లు వేశారు. అప్పట్లో ఈ ఏరియాలో జియో థర్మల్ ఎనర్జీ ఉందని కొన్ని సంకేతాలు రావడంతో ఈ బావులు తవ్వారు. తవ్విననాటి నుంచి ఆ బోరు బావి నుంచి ప్రెషర్‌తో వేడి నీరు వస్తూనే ఉంది. ఆ వాటర్ 60 డిగ్రీల సెల్సియస్ వేడి ఉంటుంది. ఆ నీటిలో గంధకం (సల్ఫర్) శాతం ఎక్కువగా ఉంటుంది”.

**అక్కడే ఎందుకంటే..**

సహజంగా భూమి లోపలి పొరల్లో ఎక్కువ వేడి ఉంటుంది. పగిడేరులో వేడి నీరు రావడానికి భూమి అంతర్భాగంలో ఎక్కువ పగుళ్లు ఉండటం, ఒకటి రెండు కిలోమీటర్ల లోతులో వేడి నీరు వచ్చే కేంద్రం ఉండటం కారణంగా భావిస్తున్నామని, అందుకే దీన్ని అరుదైన గ్రామంగా భావిస్తున్నామని రాంచందర్ అన్నారు.అయితే, దీనికి ఖచ్చితమైన కారణం ఏంటనే దానిపై ఇంకా పరిశోధనలు, అధ్యయనాలు జరుగుతున్నాయని చెప్పారు.

**ఆ నీళ్లతో పంటలు**

పగిడేరు గ్రామంలోని దాదాపు 200 ఎకరాల పంట భూములను ఆ బోరుబావుల నుంచి వచ్చే వేడి నీటి ద్వారానే సాగు చేసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు.బావుల నుంచి వచ్చే వేడి నీటిని



ఒకరోజు కుంటల్లో ఆరబెట్టి మరుసటి రోజు పొలాల్లోకి వదిలి సాగు చేస్తున్నామని తెలిపారు.”ఇంతకు ముందు వరి పంట వేయాలంటే నీళ్లకు ఇబ్బంది అయ్యేది. ఉడుకు నీళ్లు పడ్డాకే వాటిని చల్లబరిచి రెండు ఎకరాలు సాగు చేస్తున్నాను. రెండు పంటలు వేస్తున్నాను. అంతకు ముందు ఒక పంటకే నీళ్లకు ఇబ్బంది అయ్యేది. మూడు నాలుగేళ్లుగా సాగు బాగానే ఉంది. ఉడుకు నీళ్లు ఒకరోజు కుంటల్లో ఆర బెట్టిన తర్వాత పొలాలకు పంపిస్తాం.” తెలిపారు.

గతేడాది డిసెంబర్‌లో వచ్చిన భూకంపంతో రెండు బోర్లు ఆగిపోయాయని, మళ్లీ వేడి నీళ్ల బోర్లను తవ్వించాలని గ్రామస్థులు కోరుతున్నారు.”డిసెంబర్ 4వ తేదీన భూకంపం వచ్చినప్పుడు రెండు బోర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతాంగానికి ఉపయోగపడే బోర్లు పోవడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి ఆ బోర్లకు మళ్లీ కేసింగ్ చేసి వాటర్ తెప్పించాలని కోరుకుంటున్నాం” అని రైతు కోరారు.ఆ బోర్లే తమకు జీవనాధారమని, పోయిన బోర్లతో పాటు కొత్త బోర్లు వేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

**బోర్ల వల్ల ఊరికి పేరు**

ఆ బోర్ల వల్ల పగిడేరు ప్రత్యేక గ్రామంగా నిలుస్తోంది. ఇప్పుడు వేడి నీళ్ల బావులను చూసేందుకు పర్యటకులు వస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.”ఎక్కడా లేనట్టుగా మా ఊళ్లో బావుల నుంచి వేడి



నీరు వస్తుండటంతో మా పగిడేరు ప్రత్యేక గ్రామంగా నిలిచింది. చాలామంది మా ఊరు చూసేందుకు వస్తున్నారు. ఇందుకు చాలా గర్వంగా ఉంది” అని గ్రామ మాజీ సర్పంచ్ తాడి భిక్షం, గ్రామ యువతి కుంజా రేవతిలు బీబీసీ వద్ద ఆనందం వ్యక్తం చేశారు.అయితే, స్థానికులు వేసుకున్న బోర్ల నుంచి మామూలు నీళ్లే వస్తుంటాయని, ఊరిలో 300 అడుగుల లోతు వరకు బోరు వేస్తే చాలని, నీరు ధారాళంగా వస్తుందని గ్రామస్థులు చెబుతున్నారు.

**ఆ వేడి నీళ్లతో కరెంటు**

నిరంతరం బోర్ల నుంచి దాదాపు 55 నుంచి 60 డిగ్రీల సెల్సియస్ వేడితో నీళ్లు వస్తుండటంతో ఆ నీటి నుంచి కరెంటు ఉత్పత్తి చేయాలని సింగరేణి భావిస్తోందని సింగరేణి జీఎం డి.రాంచందర్ చెప్పారు.”థర్మల్ పవర్ ప్లాంట్‌లో కూడా బొగ్గును మండించి, వాటర్‌ను హీట్ చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తాం. అదే విధంగా ఇక్కడ జియో థర్మల్ ఎనర్జీ పొటెన్షియల్ ఉంది కాబట్టి, ఈ నీటి ఉష్ణోగ్రతను ఉపయోగించి మనం కరెంటు ఎందుకు తయారు చేయకూడదు.. అనే కాన్సెప్ట్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టు కింద దిల్లీలో శ్రీరామ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ వాళ్లకి అప్పగించాం” అని అన్నారు.

**‘5 కేవీ ఉత్పత్తి చేశాం..’**

దిల్లీలోని లేబరేటరీలో 5 కిలోవాట్ ప్లాంట్ తయారు చేసి సక్సెస్ అయ్యారనీ, ఇక్కడ పగిడేరులో కూడా 5 కిలోవాట్ ఎగ్జిబిట్ చేశారని, దీంతో ఇప్పుడు 20 కిలోవాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో పగిడేరులో జియో థర్మల్ పైలట్ పవర్ ప్రాజెక్టును నెలకొల్పారని సింగరేణి జీఎం రాంచందర్ వెల్లడించారు.”కొన్ని ఇష్యూస్ వస్తున్నాయి. ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నారు. 20 కిలోవాట్ పవర్ ఉత్పత్తి విజయవంతమైతే, ఇండియాలో ఇదే మొదటి ప్రాజెక్టు అవుతుంది” అని ఆయన అన్నారు.జియో థర్మల్ ప్లాంట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి అయ్యాక ముందుగా తమ గ్రామంలోని వీధి లైట్లకు ఆ కరెంటును వినియోగించాలని గ్రామస్థులు కోరారు.



# రష్యాను సవాలు చెయ్యడానికి 'యూరప్ సైన్యం'



అమెరికా నుంచి యూరప్ దేశాలకు అందుతున్న ఆర్థిక, సైనిక సాయం ఇకపై అందే అవకాశం కనిపించకపోవడంతో 'యూరప్ సైన్యం' ఒకటి ఏర్పాటు చేసుకోవాలని యుక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలియెన్స్కీ పిలుపిచ్చారు.యూరప్, అమెరికా మధ్య ఉన్న చిరకాల బంధం 'ముగింపు దశకు' చేరుకుందని, ఈ విషయాన్ని యూరప్ దేశాలు అర్థం చేసుకోవాలని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యల్ని జెలియెన్స్కీ మ్యూనిచ్‌లో జరిగిన భద్రత సదస్సుల్లో గుర్తు చేశారు.అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ శాంతి చర్చలు ప్రారంభించేందుకు అంగీకరించినట్లు తెలిసిన తర్వాత 'మా ప్రమేయం లేకుండా మా వెనుక జరిగే ఒప్పందాలను మేం ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించే ప్రసక్తే లేదు' అని యుక్రెయిన్ అధ్యక్షుడు స్పష్టం చేశారు.ట్రంప్-పుతిన్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో 'చర్చల ప్రక్రియను విస్తరించే విషయమై' రష్యా విదేశాంగమంత్రితో ఫోన్‌లో మాట్లాడారు.

ట్రంప్, పుతిన్ ఫోన్ సంభాషణ 'అమెరికా వైపు నుంచి వచ్చిన అభ్యర్థన' అని రష్యా విదేశాంగ శాఖ తెలిపింది. ఈ ప్రకటనలో యుక్రెయిన్ గురించి ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.అయితే 'చర్చల విషయంలో రెండు దేశాలు నిబద్ధతతో ఉన్నాయని పునరుద్ఘాటిస్తున్నట్లు' చెప్పారు.అమెరికా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేయడంతో మూడేళ్లుగా అమెరికా, రష్యా మధ్య ఉన్న నిశ్శబ్దానికి ముగింపు పలికినట్లయింది.ట్రంప్ ప్రత్యేక దూత కీత్ కెల్లాగ్ 'అమెరికా రష్యా మధ్య చర్చల్లో యూరప్‌ను సంప్రదిస్తాం, అయితే చర్చల్లో వారికి ఎలాంటి భాగస్వామ్యం ఉండదు' అని చెప్పారు.ఆయన వ్యాఖ్యలు యుక్రెయిన్‌తో పాటు యూరప్ దేశాల్లోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. 'ఎక్కువ మంది చర్చల్లో పాల్గొనడం వల్లనే గతంలో అవి విఫలం అయ్యాయి' అని ఆయన అన్నారు.'ఇది బ్లాక్ బోర్డు మీద చాక్‌పీసుతో రాసినప్పుడు అది రాలిపోతున్నట్లుగా అనిపించవచ్చు. కానీ నేను మీకు వాస్తవాలు చెబుతున్నాను' అని కీత్ కెల్లాగ్ అన్నారు.యుక్రెయిన్‌కు చెందిన విస్తృత సహజవనరులను అమెరికాకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ట్రంప్ ప్రతిపాదించిన ఒప్పందాన్ని తాను అడ్డుకున్నట్లు జెలియెన్స్కీ చెప్పారు.ట్రంప్ ప్రతిపాదనలో తమకు 'భద్రత హామీలు' లేవని, అది కీయెవ్ ప్రయోజనాలను 'పరిరక్షించేలా లేదని' యుక్రెయిన్ అధ్యక్షుడు అన్నారు.అమెరికా యుక్రెయిన్‌కు అందిస్తున్న సాయానికి బదులుగా, ఆ దేశంలోని అరుదైన సహజ వనరులను తమకు అందుబాటులోకి తేవాలని ట్రంప్ ప్రతిపాదించారు. అలా కాకున్నా అమెరికా ఇప్పటికే చేసిన సాయానికి పరిహారంగానైనా ఇవ్వాలని అన్నారు.రష్యా యుక్రెయిన్ మీద పూర్తి స్థాయి యుద్ధం చెయ్యడం నేటోకు 'ఫ్యాక్టరీ రీసెట్'లాంటిదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ చెప్పారు.యుక్రెయిన్‌పై రష్యా దాడి నేటో సభ్య దేశాలు బలంగా, దూకుడుగా ఉండాలన్న సంకేతం ఇచ్చిందన్నారు.'ఒక్క విషయం నిజంగా మాట్లాడుకుందాం. యూరప్‌ను భయపెట్టే సమస్య విషయంలో అమెరికా అండగా నిలబడదనే విషయాన్ని మనమిపుడు కొట్టిపారేయలేం. అనేక మంది నాయకులు యూరప్‌కు సొంత సైన్యం ఉండాలని, అది ఆర్మీ ఆఫ్ యూరప్ కావాలని అంటున్నారు' అని జెలియెన్స్కీ చెప్పారు.అమెరికా మీద ఆధారపడడాన్ని తగ్గించేందుకు యూరోపియన్ దేశాలకు సైనిక వ్యవస్థ ఉండాలని గతంలో అనేక మంది నాయకులు ప్రతిపాదించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ కూడా ఈ ప్రతిపాదనకు మద్దతిచ్చారు.యూరోపియన్ యూనియన్ విదేశీ విధాన అధ్యక్షుడు కజ కల్లాస్ కూడా దీన్ని సమర్థించారు.'కొన్ని రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్, తాను పుతిన్‌తో జరిపిన సంభాషణ గురించి నాతో చెప్పారు. ఒక్కసారి కూడా ఆయన చర్చల్లో యూరప్ ఉండాలని అనలేదు. అందులో ఎంతో అర్థం ఉంది. యూరప్‌కు అవసరమైనప్పుడల్లా అమెరికా అండగా ఉంటుందనేదిప్పుడు గతం' అని జెలియెన్స్కీ అన్నారు.రష్యా యుక్రెయిన్ మీద దాడి చేసి మూడేళ్లవుతోంది. యుక్రెయిన్‌ను నేటోలో చేర్చుకోవడం సాధ్యం కాకపోవచ్చని ట్రంప్, హెగ్‌సెత్ చెప్పారు.2014కి ముందు యుక్రెయిన్‌కున్న సరిహద్దుల్ని తిరిగి ఆ దేశానికి అప్పగించడం కుదరదని అమెరికా రక్షణ మంత్రి అన్నారు.చర్చల్లో యుక్రెయిన్‌ను పక్కన పెడితే తాను నేటో సభ్యత్వం తీసుకోనని జెలియెన్స్కీ చెప్పారు.



రష్యా యూరప్ దేశాలతో యుద్ధం చేసేందుకు సిద్ధమవుతోందని జెలియెన్స్కీ గతంలో హెచ్చరించారు. మిగతా భాగస్వాములను పక్కన పెట్టి యుక్రెయిన్ విషయంలో చర్చల ప్రక్రియ కొనసాగించాలని ట్రంప్, పుతిన్ గత వారం జరిగిన ఫోన్ కాల్ సంభాషణలో నిర్ణయించారు."యుక్రెయిన్, యూరప్ మీద నిర్ణయాలు తీసుకునేటప్పుడు యుక్రెయిన్ మాదిరిగానే, యూరప్ కూడా చర్చల్లో భాగస్వామిగా ఉండాలని" జెలియెన్స్కీ అడుగుతున్నారు.తాను, పుతిన్ సౌదీ అరేబియాలో కలిసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు చెప్పారు. పుతిన్‌ను తాను వాషింగ్టన్ పర్యటనకు ఆహ్వానించానని, అలాగే ఆయన తనను మాస్కోకు రావాల్సిందిగా కోరారని ట్రంప్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు.ట్రంప్ మాస్కో పర్యటన ఎప్పుడనేది ఖరారు కాలేదు."ఏదో ఒక రూపంలో యుక్రెయిన్ కూడా చర్చల్లో పాల్గొంటుంది" అని రష్యా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ చెప్పారు.శాంతిని బలవంతంగా రుద్దడాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని జర్మనీ చాన్సలర్ ఓలాఫ్ షోల్జ్

# మూడు ట్రంకు పెట్టెల్లో తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత బంగారం, వజ్రాలు, నగలు

**తమిళనాడుకు తరలింపు**



తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలితపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గతంలో ఆమె నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదు, ఆస్తుల పత్రాలు మూడు ట్రంకు పెట్టెల్లో తమిళనాడు ప్రభుత్వానికి చేరాయి.శనివారం సాయంత్రం బెంగళూరులోని కోర్టు నుంచి ఈ ఆస్తులను ఏకే-47లతో వచ్చిన తమిళనాడు పోలీసు అధికారుల రక్షణలో చెన్నైకి తీసుకెళ్లారు.జయలలితకు చెందిన ఈ ఆస్తులను 1996లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా 36వ అదనపు సివిల్ అండ్ సెషన్స్ జడ్జి హెచ్.ఎస్. మోహన్ ఆదేశాల మేరకు వాటిని తమిళనాడుకు పంపారు.

**అందులో ఏం ఉన్నాయి?**

జయలలిత నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులలో 27 కిలోల బంగారు నగలు, వజ్రాలు, పచ్చలు, కెంపులు పొదిగిన నగలు, మూడు వెండి నాణేలు ఉన్నాయి.రూ. 59, 870తో పాటు మరో రూ.1,60, 514 విలువగల గల పాత కరెన్సీ నోట్లు, 2023 నాటి విలువ ప్రకారం రూ.10.18 కోట్లకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్ ఫండ్‌ను కూడా తమిళనాడు పోలీసు బృందానికి అందజేశారు.ఈ ఆస్తులను తమిళనాడు హోం వ్యవహారాల జాయింట్ సెక్రటరీ జె. ఆన్ మేరీ స్వర్ణ నేతృత్వంలోని తమిళనాడు అధికారులు, స్పెషల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ ఎస్పీ విమలకు బెంగళూరు కోర్టు అందజేసింది.చెన్నై, కాంచీపురం, తంజావూరు, తిరుప్పత్తూరు, తూత్తుకుడిలో ఉన్న 6 కంపెనీలకు చెందిన 1526 ఎకరాల భూమికి సంబంధించిన ఆస్తి పత్రాలు ఇందులో ఉన్నాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జయలలితను దోషిగా తేల్చుతూ బెంగళూరు కోర్టు 2014 సెప్టెంబర్ 27న తీర్పునిచ్చింది.



**ఆస్తులను ఏం చేస్తారు?**

జప్తు చేసిన ఆస్తులను ఏం చేయాలో నిర్ణయించాల్సిన బాధ్యత తమిళనాడు ప్రభుత్వానిదేనని కోర్టు పేర్కొంది. అంటే, ఆస్తులను విలువ కట్టి వేలంలో విక్రయించి సొమ్ము రాబట్టుకోవచ్చు లేదా ట్రెజరీకి పంపవచ్చని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిరణ్ ఎస్.జవళి విలేఖరులతో చెప్పారు.ఈ కేసులో ప్రజల మనోభావాలు ఎక్కువగా ఉన్నందున, వీటిని అక్రమ ఆస్తులుగా ప్రకటించి, తదనుగుణంగా జప్తు చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించినందున, సేకరించిన భూములను ఏం చేయాలో ఆ రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయించడం సరైనదని బెంగళూరు కోర్టు అభిప్రాయపడింది."ఈ భూములను ప్రజాప్రయోజనాల కోసం డెవలప్‌మెంట్‌కు ఇవ్వవచ్చు, లేదా భూమిలేని వారికి పంచవచ్చు. లేదంటే, ఆ భూములను అమ్మి ప్రభుత్వ నిధులుగా మార్చవచ్చు" అని కోర్టు ఉత్తర్వులు సూచించాయి.

"ఈ కేసును పరిగణనలోకి తీసుకుంటే, తమిళనాడు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు ప్రాథమిక విద్యకు అవసరమైన



మౌలిక సదుపాయాల కోసం ఈ ఆస్తులను ఉపయోగిస్తుందని భావిస్తున్నాను" అని జస్టిస్ మోహన్ అన్నారు.జయలలిత కేసును విచారణ జరిపి, సుప్రీంకోర్టులో కూడా అప్పీల్ చేసినందుకు అయిన ఖర్చులకు కర్ణాటక ప్రభుత్వానికి, వీకే శశికళ, ఇళవరసి నుంచి వసూలు చేసిన రూ. 20 కోట్ల 20 వేల జరిమానాలో రూ. 13 కోట్లను చెల్లించాల్సిందిగా న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

**ఏమిటీ కేసు?**

జయలలిత ముఖ్యమంత్రిగా ఉండటంతో ఆమెపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసును తమిళనాడు నుంచి కర్ణాటకకు బదిలీ చేశారు. 18 ఏళ్ల పాటు వాదనలు సాగిన ఈ కేసులో జయలలితను దోషిగా తేలుస్తూ 2014 సెప్టెంబర్ 27న బెంగళూరు స్పెషల్ కోర్టు ఉత్తర్వులు వెల్లడించింది.జయలలితకు నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు, రూ. 100 కోట్ల జరిమానా సైతం విధించింది. దీంతో జయలలిత ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ కేసుపై కర్ణాటక హైకోర్టులో ఆమె అప్పీల్ చేశారు.ఈ కేసులో జయలలితను నిర్దోషిగా ప్రకటిస్తూ కర్ణాటక హైకోర్టు 2015 మేలో తీర్పు ఇచ్చింది. దీంతో ఆమె తమిళనాడు ముఖ్యమంత్రిగా మళ్లీ బాధ్యతలు చేపట్టారు.అయితే, ఈ తీర్పును సవాలు చేస్తూ కర్ణాటక ప్రభుత్వం



అదే ఏడాది సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అప్పీల్‌పై సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకునేలోపు జయలలిత (2016 డిసెంబర్ 6న) మరణించారు.జయలలిత ఆస్తులను వేలం వేయడానికి లేదా విక్రయించడానికి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని కోరుతూ న్యాయవాది టి.నరసింహమూర్తి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో 2024లో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను

## ఏపీ పాటు తెలంగాణలో బర్డ్ ఫ్లూ విస్తరిస్తోందా, మనుషులకూ ఈ వ్యాధి సోకుతుందా?

కోళ్ల ఫారం, పౌల్ట్రీ ఫామ్, చికెన్, ఎగ్స్, గుడ్లు బర్డ్ ఫ్లూ, హెచ్ వన్ ఎన్ వన్ ఇన్‌ఫ్లూయంజా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లా



ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ బర్డ్ ఫ్లూ ఆందోళన కలిగిస్తోంది. మూడు రోజుల కిందట గోదావరి జిల్లాల్లోని రెండు కోళ్ల ఫారాలలో బర్డ్ ఫ్లూ కేసులు బయటపడ్డాయి. తరువాత సమీప ఏలూరు జిల్లా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కోళ్ల ఫారాల్లోనూ ఉన్నట్టుండి కోళ్లు చనిపోవడంతో వాటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు.మరోవైపు ఏపీలోని కోళ్లల్లో బర్డ్ ఫ్లూ కేసులు బయటపడటంతో అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం ఏపీ నుంచి కోళ్లు, గుడ్లు తమ రాష్ట్రంలోకి రాకుండా రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది.

**ఎలా బయటపడిందంటే..**

ఏపీలోని పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో సంక్రాంతి తరువాత కోళ్లు చనిపోవడం మొదలైంది. మొదట నాటుకోళ్లు, తర్వాత బాయిలర్..ఫారం కోళ్లు లక్షలసంఖ్యలోనే మృత్యువాత పడ్డాయి.ప్రధానంగా తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని రామకృష్ణ కోళ్ల ఫారంలోనూ, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని కృష్ణానందం కోళ్ల ఫారంలోనూ రోజుల వ్యవధిలో వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి.దీంతో ఆయా కోళ్ల ఫారాల యజమానులు ఈ విషయాన్ని పశు సంవర్ధకశాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన అధికారులు ఆ ఫారాల్లో చనిపోయిన కోళ్ళ శాంపిల్స్‌ను ఏలూరులోని ల్యాబ్ ద్వారా సేకరించి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న నేషనల్ హైసెక్యూరిటీ డిసీజ్ డయాగ్నోసిస్ లేబొరేటరీకి ఈనెల 6వ తేదీన పంపించారు.చనిపోయిన కోళ్లల్లో బర్డ్‌ఫ్లూ (వైరస్ ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజ - హెచ్5ఎన్1) నిర్ధరణ అయినట్టు నివేదిక వచ్చింది.

**10 కిలోమీటర్ల వరకు అలర్ట్ జోన్**

బర్డ్‌ఫ్లూపై నివేదిక వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసింది. కలెక్టర్ల ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లోని పశు సంవర్ధకశాఖ, వైద్య ఆరోగ్యశాఖ,రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకున్నారు.ముందుగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బర్డ్ ఫ్లూ నిర్ధరణ అయిన పౌల్ట్రీల నుంచి కిలోమీటరు పరిధి వరకు పరిధి రెడ్ జోన్‌గా, అక్కడి



నుంచి పది కిలోమీటర్ల వరకు అలర్ట్ జోన్‌గా ప్రకటించారు.రెడ్ జోన్ పరిధిలోని కోళ్ల పారాల్లోని అన్ని కోళ్లనూ, గుడ్లనూ పూడ్చిపెట్టాలని ఆదేశించారు.మూడు నెలల వరకు ఈ పౌల్ట్రీలు, చికెన్ షాపులు తెరుచుకోవు.కోడిమాంసం, గుడ్లపై అమ్మకాలపై మూడు నెలలపాటు నిషేధం ఉంటుంది.అలర్ట్ జోన్ పరిధిలోని కోళ్ల ఫారాలు, చికెన్ షాపులను కూడా మూడు వారాలపాటు మూసివేస్తారు.బర్డ్ ఫ్లూ వైరస్ ప్రస్తుతం అదుపులో ఉందని, మనుషులకు సోకే అవకాశం లేదని పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ దామోదర్ బీబీసీకి తెలిపారు."కోడి మాంసం, గుడ్లు బాగా ఉడికించి తినడం వల్ల ఈ వైరస్ సోకే ప్రమాదం ఉండదు. ఈ వైరస్ 70 డిగ్రీల సెంటీగ్రేట్ వద్ద పూర్తిగా నాశనం అవుతుంది. భారతీయ ఆహారపు అలవాట్లలో భాగంగా ఆహారాన్ని ఉడికించి తినడం వల్ల ప్రజలకు ఎలాంటి అనారోగ్యం కానీ, బర్డ్ ఫ్లూ సోకడం గానీ జరగదు. బర్డ్ ఫ్లూ వల్ల మనుషులు చనిపోయిన దాఖలాలు లేవు కాబట్టి ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదు." అని ఆయన బీబీసీతో చెప్పారు.

**కోళ్ల ఫారాలను మూసేస్తే రైతుల పరిస్థితేంటి ?**

రెడ్‌జోన్ పరిధిలో అన్ని కోళ్లఫారాలను మూసివేయడం, చికెన్ గుడ్ల అమ్మకాలపై నిషేధం విధించడంపై పౌల్ట్రీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు."పౌల్ట్రీ పరిశ్రమ బర్డ్ ఫ్లూ ప్రచారంతో ఇబ్బందుల్లోకి వెళ్లిపోయింది. కొద్ది రోజులుగా వివిధ కారణాలతో కోళ్ల పరిశ్రమ ఇబ్బందుల్లో ఉంది. దాణా ధర పెరిగి గుడ్డు ధర కూడా గిట్టుబాటు కావడం లేదు.. ఇప్పటికే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పరిశ్రమను గాడిలో పెట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేదంటే రైతుకు చాలా నష్టం వస్తుంది. ఓ పౌల్ట్రీలో కోళ్లకు వైరస్ సోకితే కిలోమీటరు పరిధిలో ఉన్న ఫారాలన్నీ మూసివేయడం అన్యాయం.. " అని ప్రస్తుతం రెడ్‌జోన్‌గా ప్రకటించిన పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరులోని ఓ పౌల్ట్రీ యజమాని అయిన పెనుమర్తి మోహన్ బీబీసీతో అన్నారు.అదే రెడ్ జోన్ పరిధిలోనే ఉన్న వేల్పూరుకు చెందిన మరో పౌల్ట్రీ యజమాని జీవీఆర్ఎస్ కుమార్ బీబీసీతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు." మా ఫారంలో 30వేల కోళ్లు ఉన్నాయి. వాటిల్లో ఏ ఒక్క దానికి కూడా బర్డ్ ఫ్లూ ఎటాక్ కాలేదు.. అయితే పక్క ఫారం ఎఫెక్ట్ వల్ల మేం కూడా బలైపోయాం., మమ్మల్ని ఆదుకోవాల్సిందిగా గవర్నమెంట్ వారిని కోరుతున్నాం." అన్నారు.

**ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ ఆందోళన**

మూడు రోజులుగా గోదావరి జిల్లాల్లో కలకలం రేపుతున్న బర్డ్ ఫ్లూ బుధవారం నుంచి ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ ఆందోళన కలిగిస్తోంది. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుమ్మోలంకలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో మూడు రోజుల్లో 11 వేల కోళ్లు మృతి చెందాయి. దీంతో చనిపోయిన కోళ్లను పరిశీలించి శాంపిల్స్ ను ల్యాబ్ కు పంపించారు.పౌల్ట్రీల వద్ద బయో సెక్యూరిటీ మెజర్స్ అమలు చేస్తున్నారు, ఇప్పటికే పశు వైద్యాధికారుల పర్యవేక్షణలో యన్.టి.ఆర్.జిల్లాలో 19 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ కోళ్ల ఫారాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ హనుమంతరావు మీడియాకు తెలిపారు.మరోవైపు ఏలూరు జిల్లా బాదంపూడి సమీపంలోని ఓ పౌల్ట్రీలో బుధవారం పెద్దసంఖ్యలో కోళ్లు చనిపోవడంతో శాంపిల్స్ తీసి పరీక్షకు పంపారు.

**ఇతర రాష్ట్రాల నుంచి కోళ్లు రాకుండా చెక్ పోస్టులు**

రాష్ట్రంతో సరిహద్దు ఉన్న ఎన్టీఆర్ జిల్లా బోర్డర్ వద్ద ఇతర రాష్ట్రాల నుంచి కోళ్లు, కోళ్ల ఉత్పత్తులు రాకుండా 12 చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేశామని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ హనుమంతరావు తెలిపారు.జిల్లాలో మృతి చెందిన కోళ్లను భూమిలో పూడ్చిపెడుతున్నామని తెలిపారు.ఏలూరు జిల్లా ఉంగుటూరుకి చెందిన ఓ వ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకిందంటూ వస్తోన్న వార్తలను ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలిని ఖండించారు.అదంతా తప్పుడు ప్రచారమని ఆమె బీబీసీతో చెప్పారు."బాదంపూడిలో కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోవడంతో శాంపిల్స్ తీసి పంపించాం, అంతే కానీ అక్కడ మనుషులెవరికీ బర్డ్ ఫ్లూ సోకలేదు. వైద్యశాఖ అధికారులు ఎక్కడికక్కడ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను పరీక్షిస్తున్నారు" అని ఆమె చెప్పారు.

**రెడ్ జోన్ పరిధిలోని ఓ కోళ్ల ఫారంలో చనిపోయిన కోళ్లు**

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వల్ల దాదాపు 5 లక్షల కోళ్లు మరణించినట్లు సమాచారం ఉందని ఏపీ పశు సంవర్ధక, వ్యవసాయ శాఖల మంత్రి కె. అచ్చెన్నాయుడు వివరించారు.40 లక్షల కోళ్లు మరణించినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.స్వల్ప ఉష్ణోగ్రతల వల్ల

# ఒక ఇంజినీర్ ట్రైన్ మిస్ కావడం వల్ల ఇంత పెద్ద ఆవిష్కరణ సాధ్యమైందని తెలుసా?



రైలు మార్గాలు వేయడం అనేది భూతల ప్రయాణంలో కొత్త శకానికి నాంది పలికింది. అంతేకాదు, మనుషులు కాలాన్ని చూసే విధానాన్ని కూడా శాశ్వతంగా మార్చివేసింది.అమెరికా, కెనడా దేశాలలోని రైల్ రోడ్ కంపెనీలు 1883లో అక్కడి వేళల్లో చేసిన మార్పులు ప్రపంచవ్యాప్తంగా టైమ్ జోన్ అనే భావనకు దారితీసింది.అంతకుముందు వేల ఏళ్లుగా సమయాన్ని కొలవడానికి సూర్యుడినే ఆధారంగా చేసుకునేవారు.గడియారం కనిపెట్టే వరకు సమయాన్ని తెలుసుకోవడానికి సూర్యుడి గమనాన్నే పరిశీలించేవారు. సూర్యుడు నడినెత్తికి వస్తే మధ్యాహ్నం అయిందని అనుకునేవారు.మధ్య యుగాల నాటి సన్ డయల్స్ స్థానంలో మెకానికల్ క్లాక్స్ వచ్చాయి.అయితే, పట్టణాల్లోని ఇలాంటి మెకానికల్ క్లాక్స్‌లో సమయాన్ని కూడా మళ్లీ సూర్యుడి గమనం ఆధారంగానే సరిచేసేవారు.దీంతో ఒక్కో పట్టణంలో ఒక్కో సమయం ఉండేది.1800 కాలం వరకు దాదాపు ఇలాంటి పరిస్థితి కొనసాగింది. అప్పట్లో ఉత్తర అమెరికాలో ఏకంగా 144 టైమ్ జోన్స్ ఉండేవి.చరిత్రను పరిశీలిస్తే చాలామంది ప్రజలు తమ ఇళ్ల నుంచి ఎక్కువ దూరాలు ప్రయాణించేవారు కాదు. గుర్రాలు, ఒంటెలు, ఎడ్ల బళ్లు వంటివే అప్పట్లో ప్రయాణ సాధనాలు. దీంతో సుదూర ప్రయాణాలు ఉండేవి కాదు.దీంతో సమయపాలన అవసరం అంతగా ఉండేది కాదు.కానీ, రైలు మార్గాలు వచ్చాక ఈ సమస్య మొదలైంది.1800ల మధ్యకాలంలో అమెరికా, కెనడాల్లో రైలు ప్రయాణాలు పెరిగాయని మేరీల్యాండ్‌లోని బాల్టిమోర్ బీఅండ్ఓ రైల్‌రోడ్ మ్యూజియం చీఫ్ క్యూరేటర్ జాన్ గోల్డ్‌మాన్ చెప్పారు.ఉత్తర అమెరికా ఖండం అంతటా రైళ్లు సరకు రవాణా, ప్రయాణికుల రవాణా చేస్తుండేవని చెప్పారు.దీంతో రైళ్ల సమయాల నిర్వహణలో సమస్యలు మొదలయ్యాయని గోల్డ్‌మాన్ చెప్పారు.'వేర్వేరు స్థానిక టైమ్ జోన్‌ల రైళ్ల నిర్వహణకు పెద్ద సమస్యలే తెచ్చిపెట్టింది. ప్రజలు తమ రైళ్లను మిస్ కావడం నుంచి, ఒకే ట్రాక్‌ను ఉపయోగిస్తున్నప్పుడు రైళ్లు ఢీకొనే అవకాశం కూడా ఉంది." అని గోల్డ్‌మాన్ అన్నారు.ఇలా, అమెరికా, కెనడాలోని రైళ్ల నిర్వహణ కంపెనీలు టైమ్ జోన్‌ల విధానానికి నాంది పలికాయి.1825లో ఆధునిక రైల్వే వ్యవస్థ పుట్టిన బ్రిటన్‌లో కూడా ఇలాంటి సమస్యే ఎదురైంది.రైళ్లు నగరాలను, పట్టణాలను ఒకదానికొకటి అనుసంధానం చేయడం ప్రారంభించడంతో స్థానిక టైమ్ జోన్‌ల ఆధారంగా ప్రతి రైలుకు వేర్వేరుగా రాకపోకల సమయాల జాబితాను తయారు చేయడం కష్టంగా మారింది.1847 నాటికి, అన్ని బ్రిటిష్ రైల్వే కంపెనీలు తమ నెట్‌వర్క్‌లలో ఒకే ప్రామాణిక 'రైల్వే టైమ్' ను అనుసరించాయి.కొత్త సమయపాలన పద్ధతి 1880లో ఆ దేశమంతటా అమలైంది. ఇలా సమయాన్ని ప్రామాణీకరించిన మొదటి దేశంగా బ్రిటన్ చరిత్రకెక్కింది.ప్రస్తుతం దీన్నే గ్రీన్‌విచ్ మీన్ టైమ్ అని పిలుస్తారు.సమయాన్నిప్రామాణీకరించడం వల్ల రైళ్ల సామర్థ్యం మెరుగుపడింది. రైలు ప్రమాదాలు తగ్గాయి.ఇదే ఆలోచన ఉత్తర అమెరికా వరకు వ్యాపించడానికి ఎక్కువ కాలం పట్టలేదు. కానీ అమెరికా, కెనడా విషయానికొచ్చేసరికి ఏకంగా ఒక ఖండం అంతటా సమయాన్ని ప్రామాణీకరించడానికి మార్గాన్ని కనిపెట్టాల్సి వచ్చింది.1879లో సర్ శాన్‌ఫోర్డ్ ఫ్లెమింగ్ రైలును మిస్ అయ్యారు. కెనడాలో రైలు ఇంజనీర్ అయిన ఫ్లెమింగ్‌కు ఒక ఆలోచన వచ్చింది. అదే టైమ్ జోన్.1883 నవంబర్ 18న అమెరికా, కెనడాల్లోని రైలు పరిశ్రమలు ఫ్లెమింగ్ ప్రతిపాదనను ఆమోదించాయి.అయితే, ఉత్తర అమెరికా ఖండం పెద్దది కావడంతో నాలుగు ప్రధాన టైమ్ జోన్‌లు రూపొందించాలని

# దేశం సుభిక్షంగా వుండాలంటే బీజేపీతోనే సాధ్యం

**ఖమ్మం :** ఖమ్మం, నల్లగొండ, వరంగల్ టీచర్ ఎంఎల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో మీడియా సమావేశంలో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడారు. పులి సరోత్తం రెడ్డి టీచర్ ఎంఎల్సీ ఎన్నికల్లో మా అభ్యర్థి. ప్రచారంలో తిరుగుతుంటే టీచర్లు ఒకటే చెప్తున్నారు.. 317 జీఓ తెచ్చి కెసిఆర్ టీచర్ల బ్రతుకుల్లో మట్టి కొట్టారు. అంత వేదనకు గురైన సందర్భం మరోటి లేదని టీచర్లు చెప్తున్నారు. దాన్ని తొలగిస్తానని చెప్పిన రేవంత్ కూడా మోసం చేశారు. ఐదు డీయేలు లు పెండింగ్ ఉన్నాయి. పిఆర్సీ అమలు కాలేదు. సీపీఎస్ పెన్షన్ వద్దు అనుకుంటే రాష్ట్రాలు ఆప్షన్ తీసుకోవచ్చు అని కేంద్రం చెపితే కెసిఆర్ తీసివేయలేదు. ఇప్పటివరకు దానిపై రేవంత్ పాలసీ ప్రకటించలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ 15 నెలలుగా రాని దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ కాంగ్రెస్ రెండు దగా, మోసం చేశాయి వారి వాసన లేనివారికి మేము ఓటు వేస్తామని టీచర్లు లెక్చరర్లు బాజాప్తా చెప్తున్నారని అన్నారు.
యూటీఎఫ్ ని గెలిపిస్తే వారు ఒరగబెట్టింది ఏమీ లేదు. నరోత్తం రెడ్డి కి అపారమైన అనుభవం ఉంది. 317 జీఓ కి వ్యతిరేకంగా కొట్లాడింది బీజేపీ. ఇన్కమ్ టాక్స్ 12 లక్షల 75 వేల వరకు రాయితీ ఇచ్చి మధ్య తరగతి వారికి అండగా ఉంది మోడీ ప్రభుత్వం. బీజేపీ చేస్తే మేలు చేసింది తప్ప హాని



చేయలేదు ప్రాక్టికల్ గా ఉంది. మీరంతా మేధావులు, విజ్ఞులు. సంఘాలుగా కాకుండా దేశం గురించి ఆలోచించండి. దేశం సుభిక్షం ఉండాలంటే, నిరుద్యోగం సమస్య పరిష్కారానికి కృషి జరగాలంటే అది బీజేపీతోనే సాధ్యం. 2024-25 బడ్జెట్లో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి 4 లక్షల కోట్లు పెట్టారు. ఈ బడ్జెట్ లో ఉపాధి కోసం గొప్ప నిర్ణయాలు తీసుకున్నారు. 2014 లోపు జాతీయ రహదారుల, ఎయిర్పోర్ట్, రైల్వే పరిస్థితి - ఇప్పటి పరిస్థితి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. కోల్ స్కాం, బోఫోర్స్ స్కాం, 2జి స్కాములు మంత్రులు జైలుకు పోవుడు అప్పుడు ఉంటే.. ఇప్పుడు ఒక్క మచ్చ లేకుండా గొప్పగా జాతి తలెత్తుకునేలా పాలన సాగుతుందని అన్నారు.
ఒకప్పుడు భారత దేశం థర్డ్ వరల్డ్ కంట్రీ. ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు అప్పులతో బ్రతికేది. ఇప్పుడు భరోసాగా పాలన సాగుతోంది. అమెరికా ప్రెసిడెంట్ మన మోదీ గారికి కుర్చీ జరిపే పరిస్థితి వచ్చింది. భారత మాత ముద్దు బిడ్డలుగా నేను ఇండియన్ అని గర్వంగా చెప్పుకునే స్థాయి వచ్చింది. సంస్కృతి సంప్రదాయాలు కలగలిపి తీసుకుపోతున్న ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం. ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్ బంగ్లాదేశ్ దుస్థితి చూస్తున్నాం.. సిరియా ఇరాన్ ఇరాక్ ధ్వంసం అవుతున్నాయి. కానీ ఇంత పెద్ద దేశం ప్రజాస్వామ్య మూలాలతో ఐక్యంగా ముందుకు సాగడం మోదీ గారి పటిష్ట నాయకత్వం వల్లనే. దాని ఫలితమే డిల్లీ గెలుపు. మోదీ చేతుల్లో దేశం పురోగమనం చెందుతుంది. టీచర్లారా ఎందుకు బీజేపీకి ఓటు వేయాలని డిబేట్ పెట్టండి. కాంగ్రెస్ నిజస్వరూపం తెలిసింది. ఇది చాలా కీలక సందర్భం. సరోత్తం రెడ్డి ఒకటో నెంబర్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి. టీచర్లారా మేము మీకు అండగా ఉంటాం. మా చరిత్ర మీకు తెలుసని అన్నారు.

## అధైర్య పడకు.. అండగా ఉంటా

**-న్యాయవాది ఇనుముల సతీష్ ను పరామర్శించిన ఐటి మంత్రి శ్రీధర్ బాబు**

**మంథని :** తండ్రి నీ కోల్పోయి దుఃఖంలో ఉన్న మంథని మాజీ ఉపసర్పంచ్, ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇనుముల సతీష్ ను మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించ్చారు. అధైర్య పడకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఇనుముల సతీష్ తండ్రి ఇనుముల శంకరయ్య గత ఆరు రోజుల క్రితం మృతి చెందగా సోమవారం రాత్రి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇనుముల సతీష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సతీష్ తండ్రి శంకరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు పోలు శివ, నాయకులు శశిభూషణ్ కాచే ఉప్పట్ల శ్రీనివాస్, ఆకుల కిరణ్, మూల పురుషోత్తం రెడ్డి, నాంపల్లి సతీష్ లతో పాటు పలువురు పాల్గొన్నారు/

## న్యాయస్థానం ఆదేశాలను తక్షణమే అమలు చేయాలి

**గురుకుల అభ్యర్థుల డిమాండ్**

**హైదరాబాద్ :** న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి తమకు న్యాయం చేయాలని గురుకుల అభ్యర్థులు ప్రజాభవన్ వద్ద బైఠాయించారు. భారీగా తరలివచ్చిన అభ్యర్థులు నేరుగా ప్రజాభవానికి చేరుకొని మెట్లపై కూర్చొని తమ నిరసనను తెలియజేస్తున్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాపాలన అందిస్తామన్న కాంగ్రెస్ హామీని నమ్మి అన్ని వర్గాల ప్రజలు అధికారంలోకి తీసుకొస్తే ఇలా వ్యవహరించడం ఏమిటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయస్థానం ఆదేశాలను అమలు చేసి గురుకుల అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

## కీసర ఆలయంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు

**అధికారుల సమీక్షా సమావేశం**

**మేడ్చల్ :** కీసర గుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్ట లో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ 26 నుండి మార్చ 1 వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అధికారులు అందరూ కలిసి సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని అన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కావలసిన ఏర్పాట్లు అధికారులు చేయాలని సూచించారు. ఎండలు ఉండడం వలన భక్తుల కోసం చల్వ పందిర్లు , మంచినీరు మజ్జిగ ఏర్పాటు చేయాలని అన్నారు. లైన్ లో వచ్చే సామాన్య ప్రజలకు సులువుగా దర్శనమయ్యే విధంగా కావలసిన బార్కెట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఆలయం చుట్టూ సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు తో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఈవో, అధికారులు పాల్గొన్నారు.

## వీరరాఘవ రెడ్డికి పోలీసు కస్టడి

**రంగారెడ్డి :** రంగరాజన్ పై దాడి చేసిన రామరాజ్యం వీర రాఘవరెడ్డినిపోలీస్ కస్టడీకి అప్పగించారు. మూడు రోజులపాటు కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. మంగళవారం నుంచి మూడు రోజులపాటు వీర రాఘవరెడ్డిని పోలీసులు విచారించ నున్నారు. మొయినబాద్ పోలీస్ స్టేషన్లలో విచారణ చేయనున్నారు. సీన్ రికన్స్ట్రక్షన్ కోసం వీర రాఘవ రెడ్డిని చిలుకూరు కి తీసుకెళ్లనునట్లు సమాచారం.. రంగరాజన్ పై దాడి కేసులో నిందితుడు వీర రాఘవ రెడ్డిని మొయినాబాద్ పోలీస్ స్టేషన్ కి

## ప్రతిపక్షాల ఫ్లెక్సీలు మాత్రమే తొలగిస్తున్నారు

**రంగారెడ్డి :** కూకట్ పల్లి నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఫ్లెక్సీలను,బ్యానర్లను ఏర్పాటు చేస్తే దానిపై కూడా రేవంత్ రెడ్డి సర్కార్ రాజకీయం చేస్తుందని బీఆర్ఎస్ కార్పొరేటర్లు దుయ్యబట్టారు. గత 14 నెలలలో ఏ గల్లీలో చూసిన ఏ రోడ్డులో చూసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు కానీ జిహెచ్ఎంసి అధికారులు వాటిని చూసి చూడనట్టుగా వదిలేస్తున్నారు. ఎన్ని రోజులుగాలేని నిబంధనలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పుట్టినరోజులకి వర్తిస్తాయని అధికారులను కార్పొరేటర్లు ప్రశ్నించారు. కార్పొరేటర్లుగా ప్రజా సమస్యలను జిహెచ్ఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవట్లేదు కానీ ప్రజా ప్రతినిధిల పుట్టినరోజు జరగకముందే ఫ్లెక్సీలను తొలగించడం ఎంతవరకు న్యాయమో జిహెచ్ఎంసి అధికారులు ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఇకనుండి ఏ పార్టీ వారైనా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన అదేవిధంగా చర్యలు తీసుకోవాలి కానీ కాంగ్రెస్ బిజెపి పార్టీలకు ఒక న్యాయం... బిఆర్ఎస్ పార్టీకి ఒక న్యాయమంటే బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు , కార్యకర్తలు చూస్తూ ఊరుకోరన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని వింత ప్రవర్తనతో బిఆర్ఎస్ నాయకులను ఇబ్బందులు పెట్టాలని రేవంత్ రెడ్డి సర్కార్ అధికారులు చూస్తున్నారు కానీ రాబోయేది కెసిఆర్ ప్రభుత్వమేనని అప్పుడు అధికారులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు వడ్డీతో సహా ఖచ్చితంగా చెల్లిస్తామని కూకట్పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు,సతీష్ గౌడ్,ఆవుల రవీందర్ రెడ్డి, సభిహ గౌసుద్దిన్,మాజీ కార్పొరేటర్ బాబురావు పాల్గొన్నారు.

# కవితక్క... కేరాఫ్ సిద్ధిపేట..

**మెదక్ :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కవిత జైలు నుండి బెయిల్ పై బయటకు వచ్చారు. కొద్దిరోజులు పార్టీ స్థితిగతులు అంచనా వేసిన కవిత, ఆ తర్వాత స్పీడ్ పెంచారు. కవితకు బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ లో స్పెషల్ క్రేజ్ ఉంది. పార్టీ క్యాడర్ కూడా ఆమెకిచ్చే గౌరవంలో ఏమాత్రం తక్కువ చేయరు. ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టడంలో ఎవరైనా కవిత తర్వాతే అంటారు పార్టీ క్యాడర్. అయితే ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలను బట్టి కవిత.. కాస్త బీఆర్ఎస్ అధినాయకత్వానికి భిన్నంగా నడుచుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. పలు విషయాలతో విభేదిస్తూ.. తన పని తాను కవిత చేసుకుపోతున్నారట.ఇటీవల శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వాకౌట్ చేసినప్పటికీ కవిత మాత్రం సభలో ఉండిపోయారు. అంతేకాదు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణన సర్వేలో కేసీఆర్, కేటీఆర్ పాల్గొనలేదు. కవిత మాత్రం సర్వేలో పాల్గొని తన వివరాలు అందజేశారు. దీనితో మంత్రులు కూడా కవిత సర్వేలో పాల్గొంది.. మీకేమైంది అంటూ కేటీఆర్, కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. ఇలా కొన్ని అంశాలలో కవిత తనకంటూ ప్రత్యేకత చాటుకుంటూ.. తనకు ఉన్న ఇమేజ్ ను పెంచుకుంటూ పోతున్నారని టాక్.కాగా ఇటీవల సిద్దిపేటపై కవిత ఫోకస్ పెట్టారని బీఆర్ఎస్ క్యాడర్ భావిస్తోంది. సిద్దిపేట నుండి మాజీ మంత్రి హరీష్ రావు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. హరీష్ స్వయాన వరుసకు కవితకు బావ అవుతారు. కేసీఆర్ కుటుంబానికి సమీప బంధువైన హరీష్ రావుకు, కేటీఆర్, కవితలకు మనస్పర్థలు ఉన్నాయని పలుమార్లు వదంతులు



వ్యాపించాయి. ఇలాంటి తరుణంలో కవిత ఇటీవల స్పీడ్ పెంచి ఎక్కువగా సిద్దిపేట నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. పార్టీలో తనకంటూ బ్రాండ్ ఇమేజ్ ఉన్న కవిత కన్ను సిద్దిపేటపై పడిందని, రానున్న ఎన్నికల్లో కవిత పోటీ ఇక్కడి నుండే అంటూ ప్రచారం సాగుతోంది.అలాగే జగిత్యాల నుండి పోటీ చేస్తారని కూడా మరో ప్రచారం సాగుతోంది. కానీ హరీష్ రావుకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే సిద్దిపేటలో కవిత తరచూ పర్యటిస్తున్నారని, రానున్న ఎన్నికలకు ఇప్పటినుండే రూట్ వేస్తున్నట్లు కొందరి అభిప్రాయం. అదే నిజమైతే హరీష్ రావు నెక్స్ట్ పోటీ ఎక్కడి నుండి సాగుతుందనే కోణంలో కూడా చర్చలు సాగుతున్నాయి. మొత్తం మీద మీడియా ముందు మేమంతా ఒకటే అనే నినాదం అంటూ వీరు ప్రచారం సాగిస్తున్నప్పటికీ, విభేదాలు ఉన్నాయ్.. అందుకే సిద్దిపేటపై కవిత ఫోకస్ అంటూ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి ఈ ప్రచారంలో ఎంత మేరకు వాస్తవం ఉందో కానీ, మొత్తం మీద కవిత దెబ్బకు హరీష్ రావు అనుచరులు ఏ క్యాహై అనేస్తున్నారట.

# ఫ్లై ఓవర్లు కింద గేమింగ్ జోన్స్

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కొత్తగా ఫ్లైఓవర్లు నిర్మించిన సంగతి తెలిసిందే. చాలా ప్రాంతాల్లో కొత్తగా ఫ్లైఓవర్లు నిర్మించారు. కొన్ని ఏరియాల్లో అయితే కి.మీ పొడవునా వీటిని ఏర్పాటు చేశారు. అయితే ఈ ఫ్లైఓవర్ల కింద చాలా విశాలమైన స్థలాలు ఉన్నాయి. ప్రస్తుతం అవి నిరూపయోగంగా ఉండగా.. మల్టీ పర్పస్‌గా వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఎక్కువ వెడల్పు ఉన్న పైవంతెనలను జీహెచ్ఎంసీ అధికారులు గుర్తిస్తున్నారు. ఇప్పటికే షేక్‌పేట ఫ్లైఓవర్‌ను క్రీడా మైదానంలా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.ప్రస్తుతం చాలా కాలనీలకు పార్కులు, ఆట స్థలాల కొరత ఉండగా.. దాన్ని కొంత వరకైనా భర్తీ చేసేందుకు.. ఫ్లైఓవర్ల కింద ఉండే స్థలాన్ని ఉపయోగించుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సీఎం సూచనల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు నగరంలోని ఫ్లైఓవర్లపై అధ్యయనం చేస్తున్నారు. ఎక్కడైతే మల్టీపర్పస్‌గా వినియోగించుకోవటానికి వీలుటుందో వాటిపై అధ్యయనం చేస్తున్నారు. షేక్‌పేట పైవంతెన మె?త్తం పొడవు 2.5కి.మీ కాగా, 24మీటర్ల వెడల్పుతో దీన్ని నిర్మించారు. 24 మీటర్ల వెడల్పుతో ఫ్లైఓవర్ కింద ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించారు. సీఎం ఆదేశాల మేరకు అక్కడ పార్కు, గేమింగ్ జోన్ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.ఇక ఆరాంఘర్-జూపార్కు కొత్త ఫ్లైఓవర్, జేఎన్‌టీయూ నుంచి మలేషియన్ టౌన్‌షిప్ ఫ్లైఓవర్, కొత్తగూడ కూడలి ఫ్లైఓవర్, లాలాపేట, నాగోల్, కామినేని కూడళ్ల ఫ్లైఓవర్లు కూడా చాలా ఎక్కువ వెడల్పుతో నిర్మించారు. వాటి కింద క్రీడా వసతులు కల్పించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఒకటో పిల్లరు నుంచి రెండో పిల్లరు మధ్య పచ్చదనానికి పాధాన్యం ఇస్తూ మొక్కలు, వాటి చుట్టూ కుర్చీలు, నడక మార్గం ఏర్పాటు చేస్తారు. రెండు, మూడో పిల్లర్ల మధ్య కార్లు, బైకులకు పార్కింగ్ వసతి కల్పిస్తారు. మూడు, నాలుగో పిల్లర్ల మధ్య యోగా సెంటర్, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్ వంటివి ఏర్పాటు చేయనున్నారు. నాలుగు, ఐదో పిల్లర్ల మధ్య స్కేటింగ్ రింగ్, ఐదు, ఆరో పిల్లర్ల మధ్య బ్యాడ్మింటన్ కోర్టు, సీటింగ్ ఏరియా ఏర్పాటు చేస్తారు. ఆరు, ఏడో పిల్లర్ల మధ్య బాక్స్ క్రికెట్. ఏడు, ఎనిమిదో పిల్లర్ల మధ్య మొక్కలు, కుర్చీలు. ఏర్పాటు చేస్తారు. ఒకటో పిల్లరు నుంచి ఎనిమిదో పిల్లరును కలుపుతూ అంచుల్లో వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేస్తారు.

## ఏసీబీ వలలో పోలీసు సిఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు

**నారాయణ పేట :** మక్తల్ పోలీసు స్టేషన్ లో లంచం తీసుకుంటూ సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కిపోయాడు. నేపథ్యంలో మక్తల్ పోలీస్ స్టేషన్ లో ఏసీబీ సోదాలు జరిపింది. బాధితుడినుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా సీఐ చంద్రశేఖర్ ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఐతో పాటు కానిస్టేబుళ్లు శివరెడ్డి, నరసింహ కూడా ఉన్నట్లు సమాచారం

## తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే పెద్దగట్టు అభివృద్ధి...

**మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**పెద్ద గట్టు జాతరకు హాజరైన మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**సూర్యాపేట :** గుట్టపై లింగమంతుల స్వామిని మాజీ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, దర్శించుకున్నారు. జాతరకు వచ్చిన మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కు యాదవ సంఘాల నాయకులు స్వాగతం పలికారు. తలసాని మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం 14 కోట్ల రూపాయల వ్యయంతో భక్తులకు అనేక అభివృద్ధి పనులు చేపట్టింది. రాష్ట్రంలో సమ్మక్క సారక్క జాతర తర్వాత అతిపెద్ద రెండోది లింగమంతుల జాతర. 5 రోజుల పాటు జరిగే జాతరకు లక్షలాదిమంది భక్తులు హాజరవుతారు. జాతర నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం 5 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించింది. అభివృద్ధి పనులు జరిగిన ఆనవాలు లేవు. సరైన ఏర్పాట్లు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని అన్నారు.

## ఆస్పరి పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం అస్పరి పోలీసు స్టేషనప్ ను తనిఖీ చేసారు.నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు, పోలీసు సిబ్బందికి సూచించారు. సిబ్బంది పని తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తగిన సూచనలు, సలహాలు చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నేను సైబర్ స్మార్ట్ అనే అవగాహన కార్యక్రమంతో ప్రజలకు , విద్యార్డులకు అవగాహన కల్పించి సైబర్ నేరాల బారిన పడకుండా చేయాలని ఆదేశించారు. వివిధ కేసులలో పట్టు బడిన వాహనాలను డిస్పోజబుల్ చేయాలన్నారు. యు ఐ కేసులు తగ్గించాలన్నారు. రాత్రి గస్తీ బాగా పెంచాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ , ఒపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. పోలీసు స్టేషన్ ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి సిఐ డి. మస్తాన్ వలి , ఆస్పరి ఎస్సై నరసింహులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఎల్బీనగర్ డీసీపీ ఫుల్ టైం ల్యాండ్ సెటిల్మెంట్లు..

**హైదరాబాద్ :** ఎల్బీ నగర్ డీసీపీ పై కాంగ్రెస్ నేత మధు యాష్కీ గౌడ్ మండిపడ్డారు. అయన ఫుల్ టైం ల్యాండ్ సెటిల్మెంట్లు.. పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడని అన్నారు. అధికారుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పింది నిజమే.. ఓ భూ వివాదంలో తలదూర్చి.. సెటిల్మెంట్ చేస్తానంటూ ఒత్తిడి తెస్తున్నారు. భూ వివాదాల్లో జోక్యం చేసుకోవడానికి పోలీసులకు ఏం పని..? ఈ విషయాన్ని నేను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను.. ఆ అధికారి మారితే మంచిది, లేకపోతే ఆయనపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారని అన్నారు.

## నగరంలో ఇసుకు మాఫియా గుట్టు రట్టు

**హైదరాబాద్ :** నగరంలో ఇసుక అక్రమ రవాణా మాఫియా గుట్టు నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేసారు. అక్రమ ఇసుక రవాణాపై కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ ఆదేశాల నేపథ్యంలో టాస్క్ ఫోర్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. నగరంలోని తాడ్బండ్ తో పాటు పలు చోట్ల ఇసుక అమకాల కేంద్రాలపై దాడులు చేసారు. ఇసుక డంపింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు జరిపారు. వారికి ఉన్న అనుమతులను క్షుణ్ణంగా పరిశీలించారు. రూ 10వేలకు లభించే లారీ ఇసుక నిర్మాణ దారుడుకి రూ 50వేలకు అమ్ముతున్న వైనం బయటపడింది. సరైన వే బిల్లులు, పత్రాలు లేకుండా అమ్ముతున్న మాఫియా ను గుర్తించారు. ఎటువంటి అనుమతులు లేకుండా డంపింగ్ యార్డుల ఏర్పాటు చేస్తే , చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు.

## జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి :** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 26 నుండి మార్చి 6వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఉదయం 7 నుండి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు.

## ఆరుగురి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు జిల్లా కోర్టు సంచలన తీర్పు

**నిజామాబాద్ :** ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని హత్య చేసిన సీరియల్ కిల్లర్ ప్రశాంత్ కు జిల్లా జడ్జి జస్టిస్ సునీత కుంచాల జీవిత ఖైదు విధించారుర. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరుస హత్యల ఘటనపై తీర్పు వెలువడింది. ప్రధాన నిందితుడు ప్రశాంత్ తో పాటు సహకరించిన తల్లి కి సైతం యావజ్జివ శిక్ష విధించారు.

## లింగమంతుల జాతరలో ఎమ్మెల్సీ కవిత

**సూర్యాపేట :** తెలంగాణ ప్రజలకు లింగమంతుల జాతర శుభాకాంక్షలు. స్వామివారికి బోనం చెల్లిండం నా అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సమ్మక్క, సారక్క జాతర తరువాత రెండో అతి పెద్ద జాతర లింగమంతుల జాతర. తెలంగాణ రాష్ట్ర సంప్రదాయం, సంస్కృతులకు లింగమంతుల జాతర నిదర్శనం. -కేసీఆర్ హయాంలో జాతరకు 14 కోట్ల నిధులు కేటాయించడం జరిగింది. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశాం. ఈ ప్రభుత్వం సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నామని అన్నారు.

## ప్రశాంతి నిలయంలో విద్యార్థులకు నిత్యవసర వస్తువులు పంపిణీ

**రామడుగు :** రామడుగు మండలం వెలిచాల గ్రామ శివారులో గల ప్రశాంతి నిలయం విద్యార్థులకు మ్యాక్స్ ఫౌండేషన్ సహకారంతో రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారానికి సంబంధించిన వ్యక్తిగత వినియోగ వస్తువులు బ్రషులు కొబ్బరినూనె సబ్బుల వంటి వస్తువులను మంగళవారం పంపిణీ చేశామని రైజింగ్ సన్ యూత్ క్లబ్ అధ్యక్షులు యువజన అవార్డు గ్రహీత గజ్జల అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మ్యాక్స్ ఫౌండేషన్ సంస్థ ఫౌండర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా పిల్లలకు 11 వేల రూపాయల విలువగల ఆరోగ్యకరమైన అల్పాహారం అందించడం వారి వ్యక్తిగత పరిశుభ్రతకు అవసరమైన వస్తువులను అందించడం మా లక్ష్యం అని వారు తెలిపారు. అనంతరం యువజన అవార్డు గ్రహీత గజ్జల అశోక్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలకు స్థానిక వ్యక్తులు దాతలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరై పిల్లలకు సహాయంగా ముందుకు రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైజింగ్ యూత్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జేరిపోతుల మహేష్ సహాయ కార్యదర్శి గజ్జల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుడ్లు తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందా?



అనారోగ్యకరమైన జీవనశైలి, ఆహారం కారణంగా.. చాలా మంది అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. అటువంటి పరిస్థితిలో ప్రజలు గుడ్లు తినడం మానేస్తారు. గుడ్లు తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుందా..? గుడ్లు ఆరోగ్యానికి మంచిది కాదా..? నిపుణులు ఏం చెబుతున్నారు. సైలెంట్ కిల్లర్.. హై కొలెస్ట్రాల్ ప్రాణాలు తీస్తోంది.. ముఖ్యంగా అనారోగ్యకరమైన జీవనశైలి, ఆహారం కారణంగా.. చాలా మంది అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. అయితే.. ప్రమాదకర జబ్బులకు అధిక బరువుతోపాటు కొలెస్ట్రాల్ కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే.. ఈ రోజుల్లో చాలా మంది కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. అధిక కొలెస్ట్రాల్ కారణంగా గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది. కొలెస్ట్రాల్ అనేది రక్త నాళాలలో పేరుకుపోయే మైనపు లాంటి కొవ్వు.. చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, అది ధమనులలో అడ్డంకిని కలిగిస్తుంది.. దీని కారణంగా గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది. గుండె సంబంధిత వ్యాధులను నివారించడానికి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం లేదా అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం.. కొలెస్ట్రాల్ పెరగడానికి అధిక కొవ్వు పదార్థాలు జంక్ ఫుడ్, నూనె పదార్థాలు తీసుకోవడం వంటి అనేక కారణాలు కావొచ్చు.. కొవ్వు పదార్థాలు తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుడ్లు ఆరోగ్యానికి చాలామంచిది. అయితే.. చాలా మంది గుడ్లను కొవ్వు పదార్థంగా భావిస్తారు. చాలా మంది గుడ్లను అధిక కొలెస్ట్రాల్ ఆహారంగా భావిస్తారు.. అందువల్ల దానిని ఆహారంలో చేర్చుకోరు.. ఇది నిజం కాదని.. గుడ్లలో పోషకాలు చాలా ఉన్నాయని.. ఇవి కొలెస్ట్రాల్ ప్రమాదాన్ని పెంచవని అధ్యయనం పేర్కొంది. గుడ్లలో ఉండే కొలెస్ట్రాల్ మన శరీరంలో కొలెస్ట్రాల్‌ను పెంచుతుందని, దీనివల్ల గుండె సంబంధిత వ్యాధులు వస్తాయని నమ్ముతారు. 1968లో అమెరికన్ హార్ట్ అసోసియేషన్ గుడ్ల వినియోగాన్ని తగ్గించాలని సిఫారసు చేసింది.. కానీ తరువాతి అధ్యయనాలు, పరిశోధనలు గుడ్లలో ఉండే కొలెస్ట్రాల్‌కు శరీరంలోని కొలెస్ట్రాల్‌తో ప్రత్యక్ష సంబంధం లేదని నిరూపించాయి. ఈ కారణంగా, గుడ్లు ఆరోగ్యానికి ప్రయోజనకరంగా భావిస్తారు.

# లివర్ ఆరోగ్యానికి మేలు చేసే మార్గాలు




లివర్ ని కాపాడుకోండి.. జీవన విధానంలో సిర్రోసిస్‌ను నియంత్రించండి. లివర్ సిర్రోసిస్ అంటే లివర్ ఆరోగ్యంగా ఉండాల్సిన కణాల స్థానంలో మచ్చలు ఏర్పడటం. దీనివల్ల లివర్ సరిగ్గా పనిచేయలేదు. ఎక్కువగా మద్యం తాగడం, హెపటైటిస్, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి దీనికి కారణాలు. జీవన విధానంలో కొన్ని మార్పులు చేయడం వల్ల ఈ వ్యాధిని అదుపులో ఉంచొచ్చు. ఎప్పుడూ నీరసంగా ఉండటం మామూలే అనిపించొచ్చు.. ఆకలి లేకపోవడం, కాళ్ళు లేదా కడుపులో వాపు ఉంటే ఇది ప్రమాదకరమైన విషయం కావచ్చు. మీ లివర్ మీకు సహాయం కావాలని చెబుతున్నట్టు గుర్తుంచుకోండి. మన శరీరాన్ని శుభ్రం చేసేది లివరే.. ఇది మనల్ని ఆరోగ్యంగా ఉంచడానికి నిరంతరం పనిచేస్తుంది. కానీ ఇది ఇబ్బంది పడటం మొదలు పెడితే సిర్రోసిస్ లాంటివి వస్తాయి. అప్పుడు మన జీవనశైలిని మార్చుకోవాలి అని వైద్య నిపుణులు చెబుతున్నారు. లివర్ కణాలు దెబ్బతిని, మచ్చలు ఏర్పడితే లివర్ సిర్రోసిస్ వస్తుంది. దీనివల్ల లివర్ పనిచేయడం ఆగిపోతుంది. వ్యాధిని మొదట్లోనే గుర్తించడం, పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం చాలా ముఖ్యం అని నిపుణులు అంటున్నారు. మంచి ఆహారం లివర్ కి చాలా ముఖ్యం. తాజా పండ్లు, కూరగాయలు, ప్రోటీన్, తృణధాన్యాలు ఎక్కువగా తినండి. జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉండండి. ఉప్పు కూడా తక్కువగా తినాలి. ఎక్కువ ఉప్పు సిర్రోసిస్ లక్షణాలను మరింత తీవ్రంగా చేస్తుంది. రోజుకు 2,000 ఎమ్జీ కంటే తక్కువ ఉప్పు తినాలి. మీ శరీర బరువుకు తగ్గట్టుగా ప్రోటీన్ తినాలి. ఎక్కువ ప్రోటీన్ తింటే లివర్ పై ఎక్కువ భారం పడుతుంది. రోజులో కొంచెం కొంచెంగా, తరచుగా ఆహారం తినడం వల్ల శక్తి నిలుస్తుంది.

సిర్రోసిస్‌తో బాధపడుతున్నవారు తరచుగా డాక్టర్ దగ్గరకు వెళ్లాలి. లివర్ ఫంక్షన్ టెస్ట్ చేయించుకోవడం వల్ల ఆరోగ్యం ఎలా ఉందో తెలుస్తుంది, సమస్యలను ముందుగానే గుర్తించవచ్చు. అల్ట్రాసౌండ్, ఎలాస్టోగ్రఫీ లాంటి పరీక్షలు లివర్ ఎలా ఉందో తెలుసుకోవడానికి పనిచేస్తాయి. అదే విధంగా లివర్ క్యాన్సర్ లాంటి సమస్యలను గుర్తించడానికి పరీక్షలు చేస్తారు. డాక్టర్ దగ్గరకు వెళ్లడం వల్ల వ్యాధిని అదుపులో ఉంచొచ్చు. వ్యాధి ఎక్కువ అవ్వకుండా కాపాడుకోవచ్చు. డాక్టర్ చెప్పిన మందులు క్రమం తప్పకుండా వేసుకోవాలి. యాంటీవైరల్ మందులు హెపటైటిస్ బీ, జ ని తగ్గిస్తాయి. ఇవి లివర్ కి హాని చేస్తాయి. నీరు ఎక్కువగా ఉండటం, రక్తస్రావం తగ్గించడానికి కొన్ని మందులు ఇస్తారు. డాక్టర్ చెప్పినట్టుగానే మందులు వేసుకోవాలి. ఏవైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే డాక్టర్‌కు చెప్పాలి. లివర్ ని కాపాడుకోవడం అంటే హాని చేసే వాటికి దూరంగా ఉండటం. కొన్ని మందులు, ఎక్కువగా పారాసిటమాల్ లాంటివి లివర్ కి హాని చేస్తాయి. డాక్టర్ సలహా లేకుండా వీటిని తీసుకోకూడదు. ఆయుర్వేదం మందులు కూడా డాక్టర్ సలహా తీసుకున్నాకే వాడాలి. సిగరెట్ కూడా హాని చేస్తుంది. ముఖ్యంగా మద్యం తాగకూడదు. కొంచెం తాగినా లివర్ కి హాని కలుగుతుంది. దీని వల్ల సిర్రోసిస్ ఎక్కువ అవుతుంది.

## ఖాళీ కడుపుతో నీళ్లు తాగేస్తున్నారా?




శరీరం ఆరోగ్యంగా ఉండటానికి నీరు చాలా ముఖ్యం. ముఖ్యంగా ఉదయం ఖాళీ కడుపుతో నీళ్లు తాగడం చాలా ప్రయోజనకరంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతుంటారు. ఇది మిమ్మల్ని ఎక్కువ రోజులు ఆరోగ్యంగా ఉంచుతుందని చెబుతున్నారు. శరీరానికి నీరు అత్యంత అవసరం. అన్ని అవయవాలు సక్రమంగా పని చేయాలంటే రోజూ తగినంత నీళ్లు తాగాలని వైద్య ఆరోగ్య నిపుణులు పదే పదే చెబుతుంటారు. కానీ, చాలామంది ఈ విషయాన్ని సరిగా పట్టించుకోరు. నిద్ర లేచిన వెంటనే నీళ్లు తాగితే శరీరాన్ని త్వరగా రీహైడ్రేట్ చేయవచ్చు, రోజంతా చురుకుగా ఉండవచ్చు. ఇంకా దీనివల్ల మరెన్నో హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయి. ఖాళీ కడుపుతో నీళ్లు తాగడం వల్ల డైజెస్టివ్ సిస్టమ్ క్లీన్ అయిపోతుంది. వాటర్ శరీరం నుండి విష పదార్థాలను తొలగిస్తుంది, మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. మలబద్ధకం లేదా కడుపులో అసౌకర్యంగా ఉంటే, ఉదయం ఖాళీ కడుపుతో నీళ్లు తాగితే రిలీఫ్ ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీరు త్రాగడం వల్ల గ్యాస్, అసిడిటీ మరియు అజీర్ణం వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుందని అనేక పరిశోధనల ద్వారా వెలుగులోకి వచ్చింది. ఉదయం నిద్రలేచిన తర్వాత ఖాళీ కడుపుతో నీరు త్రాగడం వల్ల మెరిసే చర్మం లభిస్తుంది. దీనితో పాటు, మొటిమలు, మొటిమల వల్ల ఏర్పడే మచ్చల సమస్య నుండి కూడా చాలా ఉపశమనం కలిగిస్తుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో నీరు తాగితే, అది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. కొన్ని రోజుల్లోనే తేడా కనిపిస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో నీరు త్రాగడం వల్ల మెదడుపై సానుకూల ప్రభావం ఉంటుంది. ఇది మీ జ్ఞాపకశక్తిని బలోపేతం చేస్తుంది. మనసు కూడా ప్రశాంతంగా ఉంటుంది. ఉదయం ఖాళీ కడుపుతో నీరు త్రాగడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడటమే కాకుండా మలబద్ధకం నుండి బయటపడటానికి కూడా సహాయపడుతుంది. ఆరోగ్యంగా ఉండాలంటే రోజు నాలుగు లీటర్ల నీరు తాగాలని నిపుణులు చెబుతున్నారు. నిద్ర మేల్కొన్న వెంటనే నీటిని తాగితే పేగు కదలికలు ఆరోగ్యంగా మారుతాయి. శరీరం డీ హైడ్రేషన్ కాకుండా ఉంటుంది. ఉదయాన్నే నీటిని తాగడం వల్ల వ్యాధి నిరోధకశక్తి కూడా పెరుగుతుంది.

## పోషకాల్లో మేటి ఏది?



పల్లీలు, జీడిపప్పు రెండూ పోషకాలకు కొదవలేని ఆహార పదార్థాలే. మరి వీటిలో ఎందుకు అధిక పోషకాలు ఉన్నాయి. ఏది చాలా మంచిది? గుండె ఆరోగ్యానికి, ఇతర ప్రత్యేకమైన ఆరోగ్య ప్రయోజనాల్లో ఏవి ఎక్కువగా ఉపయోగపడతాయి? ప్రస్తుతం ఈ గజిబిజి బిజీ జీవితంలో ఆరోగ్యం బాగా దెబ్బతింటోంది. పని ఒత్తిడి, పొల్యూషన్, కల్తీ ఆహారం.. ఇలా అన్ని కలిసి మన ఆరోగ్యాన్ని సర్వనాశం చేస్తున్నాయి. ఈ క్రమంలో చాలా మంది తమ ఆరోగ్యాన్ని కొంతలో కొంతైన కాపాడుకోవడానికి డ్రై ఫ్రూట్స్‌ను తింటుంటారు. అందులోనూ మరీ ముఖ్యంగా జీడిపప్పు తింటారు. బాదం, పిస్తా, ఖర్జురంతో పాటు జీడిపప్పులో పోషకాలు మెండుగా ఉంటాయని వాటిని తింటుంటారు. అయితే ఇవి కాస్త కాస్ట్లీ. ఇక మరికొంత మంది పీనట్స్(పల్లీలు) కూడా తింటుంటారు. జీడిపప్పుతో పోల్చుకుంటే ధర కాస్త తక్కువే అయినా పల్లీల్లో కూడా మంచి పోషకాలు ఉంటాయి. మరి ఈ రెండింటిలో(జీడిపప్పు, పల్లీలు) ఏది అధిక పోషక విలువలు కలిగి ఉంటుంది? పల్లీల్లో సాధారణంగా ఎక్కువ ప్రోటీన్, ఫైబర్ ఉంటాయి, జీడిపప్పులో కొంచెం ఎక్కువ ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. అలాగే మెగ్నీషియం వంటి కొన్ని ఖనిజాలు అధికంగా ఉంటాయి. జీడిపప్పు, పీనట్స్ రెండూ గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి. అయితే కొన్ని ప్రత్యేకమైన పోషకాలతో పల్లీల్లో అధిక ప్రోటీన్ ఉంటుంది. మెగ్నీషియంతో పాటు తక్కువ కొవ్వు కోసం అయితే జీడిపప్పు ఉత్తమం.



## జస్ట్ నొప్పేగా.. మనకేం అవుతుందిలే అనుకునేరు

దైనందిన జీవితంలో తరచుగా శరీరంలోని పలు ప్రాంతాల్లో నొప్పిని ఎదుర్కొంటాము.. కానీ కొన్ని చిన్న చిన్న నొప్పులు పెను ప్రమాదంలో పడేలా చేస్తాయి.. ఈ నొప్పుల వెనుక సమస్యలను సకాలంలో గుర్తించకపోతే.. శరీరంలో అసౌకర్యం పెరుగుతుంది.. క్రమంగా అత్యవసర పరిస్థితికి కూడా దారితీయొచ్చు. కాబట్టి అప్రమత్తంగా ఉండటం ముఖ్యం. ప్రస్తుత కాలంలో మనం ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నాం.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం.. ఎల్లప్పుడూ.. మనం.. ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండాలి. శ్రద్ధతో జాగ్రత్తగా చూసుకోవాలి.. అయితే.. ఉరుకులు పరుగుల జీవితంలో మన శరీరం చాలా నొప్పులను ఎదుర్కొంటుంది. అయితే.. వాటిలో మనం శరీరంలోని పలు ప్రాంతాల్లో చిన్న చిన్న నొప్పులను విస్మరిస్తాము. కానీ అలా చేయడం ప్రమాదకరం.. కొన్ని నొప్పులను విస్మరించడం ద్వారా.. భవిష్యత్తులో చాలా సమస్యలను ఎదుర్కొవాల్సి వస్తుందని.. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మనం మన దైనందిన జీవితంలో తరచుగా విస్మరించే కొన్ని నొప్పుల విషయంలో.. వాటి మూలాలను గుర్తించకపోతే శరీరంలో అసౌకర్యం పెరుగుతుంది.. కావున ఇలాంటి నొప్పుల విషయంలో అప్రమత్తంగా ఉండటం ముఖ్యం.. అయితే.. ఎలాంటి నొప్పులను విస్మరించకూడదు.. వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు.. ఈ విషయాలను తెలుసుకోండి. తలనొప్పి: తలనొప్పి అనేక కారణాల వల్ల వస్తుంది. నిద్ర లేకపోవడం, ఒత్తిడి వంటివి.. కానీ మీరు ఈ నొప్పిని పదే పదే అనుభవించాల్సి వస్తే అది మైగ్రేన్‌కు సంకేతం కావచ్చు.



# యూరిక్‌యాసిడ్‌తో ఇబ్బందిపడుతున్నారా?

యూరిక్ యాసిడ్ అనేది మన శరీరంలో తయారయ్యే ఒక వ్యర్థ పదార్థం. ఇది సాధారణంగా మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది. అయితే కొన్నిసార్లు కిడ్నీలు యూరిక్ యాసిడ్‌ను సరిగ్గా బయటకు పంపలేవు. దీనికి కారణాలు చాలా ఉన్నాయి. మనం తినే ఆహారంలోని ప్యూరిన్‌లు సరిగ్గా జీర్ణం కాకపోవడం కూడా ఒక కారణం. ఇలాంటప్పుడు యూరిక్ యాసిడ్ శరీరంలో పేరుకుపోతుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే కీళ్ల నొప్పులు, కిడ్నీ వ్యాధులు, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే యూరిక్ యాసిడ్‌ను నియంత్రించడానికి కొన్ని ఆహారాలకు దూరంగా ఉండాలి. రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగితే కీళ్ల నొప్పులు వస్తాయి. ముఖ్యంగా కీళ్లలో యూరిక్ యాసిడ్ స్ఫటికాలు పేరుకుపోయి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. దీనినే గౌట్ అని కూడా అంటారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి కూడా యూరిక్ యాసిడ్ కారణం కావచ్చు. ఇది కిడ్నీ వ్యాధులకు దారి తీస్తుంది. గుండె జబ్బులు కూడా యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల వస్తాయి. యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే రక్తపోటు పెరుగుతుంది. ఇది గుండెకు హాని చేస్తుంది. అందుకే యూరిక్ యాసిడ్‌ను అదుపులో ఉంచడం చాలా ముఖ్యం. యూరిక్ యాసిడ్ సమస్య ఉన్నవారు కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండాలి. సార్డినెస్, రొయ్యలు, పీతలు లాంటి సీఫుడ్‌లో ప్యూరిన్‌లు ఎక్కువగా ఉంటాయి. ఇవి యూరిక్ యాసిడ్‌ను పెంచుతాయి. కాబట్టి వీటిని తినకూడదు. కూల్ డ్రింక్స్ లలో ప్యూరిన్‌లు తక్కువగా ఉన్నా.. వాటిలో ఫ్రక్టోజ్ అనే చక్కెర ఎక్కువ ఉంటుంది. ఇది శరీరంలో యూరిక్ యాసిడ్‌ను పెంచుతుంది. పప్పులు ప్రోటీన్ ఉన్న ఆరోగ్యకరమైన ఆహారమే అయినా.. ప్రోటీన్ యూరిక్ యాసిడ్‌ను పెంచుతుంది. కాబట్టి పప్పులు కూడా తక్కువగా తినాలి. యూరిక్ యాసిడ్ సమస్య ఉంటే మద్యం తాగకూడదు. ఆల్కహాల్ యూరిక్ యాసిడ్ స్థాయిలను పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఆల్కహాల్ కిడ్నీలు యూరిక్ యాసిడ్‌ను ఫిల్టర్ చేయకుండా చేస్తుంది.

బచ్చలికూర, క్యాబేజీ, పుట్టగొడుగులు లాంటి కూరగాయలలో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉన్నవారు ఈ కూరగాయలు తక్కువగా తినాలి. మాంసంలో యూరిక్ యాసిడ్‌ను పెంచే ప్యూరిన్‌లు ఎక్కువగా ఉంటాయి. అందుకే యూరిక్ యాసిడ్ సమస్య ఉన్నవారు మాంసాహారానికి దూరంగా ఉండాలి. యూరిక్ యాసిడ్ సమస్య ఉన్నవారు పైన చెప్పిన ఆహారాలకు దూరంగా ఉండాలి. అలాగే డాక్టర్ సలహా మేరకు మందులు వాడాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం కూడా చాలా ముఖ్యం. నీళ్లు ఎక్కువగా తాగడం, వ్యాయామం చేయడం వల్ల యూరిక్ యాసిడ్‌ను నియంత్రించవచ్చు.

## బిజినెస్

### ఎల్ఐసి నుంచి మరో అద్భుతమైన పెన్షన్ స్కీమ్




ప్రభుత్వ రంగ ఎల్ఐసి నికర ప్రీమియం ఆదాయం తాజా మూడవ త్రైమాసికంలో 9% తగ్గి రూ.1.07 లక్షల కోట్లకు చేరుకుంది. దీనికి సింగిల్ ప్రీమియం వసూళ్లలో 24% తగ్గుదల, మొదటి సంవత్సరం ప్రీమియం వసూళ్లలో 14% క్షీణత కారణమైంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తన కొత్త ప్లాన్ ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్‌ను ప్రారంభించినట్లు అధికారికంగా ప్రకటించింది. ఇది ఫిబ్రవరి 18, 2025 నుండి ఇది అందుబాటులో ఉంటుంది. 'స్మార్ట్ పెన్షన్' ప్లాన్ అనేది 'నాన్-పార్టిసిపేటింగ్, నాన్-లింక్డ్, ఇండివిజువల్/గ్రూప్, సేవింగ్స్, ఇమ్మీడియట్ యాన్యుటీ ప్లాన్. ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్, భారతదేశంలో పెన్షన్, పదవి విరమణ పొదుపు మార్కెట్‌లో రా×జ నాయకత్వ స్థానాన్ని మరింత బలపరిచే అవకాశం ఉంది. జనాభా పెరుగుతుండగా, వారు తమ ఆర్థిక భవిష్యత్తును భద్రపరచుకోడానికి మార్గాలను అన్వేషిస్తున్నారు. అందులో పెన్షన్ ప్రోగ్రాములు ఒక ముఖ్యమైన భాగంగా మారుతున్నాయి. దీని గురించి మరిన్ని వివరాలు అందించనున్నాము.డ్రాప్ డౌన్ జాబితా నుండి తగిన డాక్యుమెంట్ రకాన్ని ఎంచుకోవడం ద్వారా ధృవీకరణ కోసం మీ పత్రాలను స్కాన్ చేసి అప్‌డేట్ చేయండి. ఆ తర్వాత మీకు సర్వీస్ రిక్వెస్ట్ నంబర్ వస్తుంది. ఈ నంబర్‌తో మీరు ఈ పోర్టల్ నుండి అప్‌డేట్ స్థితిని తెలుసుకోవచ్చు. ప్రభుత్వ రంగ ఎల్ఐసి నికర ప్రీమియం ఆదాయం తాజా మూడవ త్రైమాసికంలో 9% తగ్గి రూ.1.07 లక్షల కోట్లకు చేరుకుంది. దీనికి సింగిల్ ప్రీమియం వసూళ్లలో 24% తగ్గుదల, మొదటి సంవత్సరం ప్రీమియం వసూళ్లలో 14% క్షీణత కారణమైంది. డిసెంబర్ త్రైమాసికంలో ఉద్యోగుల పరిహారం, సంక్షేమ ఖర్చులు దాదాపు మూడింట ఒక వంతు తగ్గడంతో ఎల్ఐసీ ఇప్పటికీ పన్ను తర్వాత లాభంలో 17% పెరుగుదల రూ. 11,056 కోట్లను నమోదు చేసింది.

### మార్చిలో టీసీఎస్‌లో శాలరీ పెంపు

భారత్‌లో అతిపెద్ద ఐటీ రంగ సంస్థ టీసీఎస్ ఉద్యోగుల శాలరీలు పెంచేందుకు రెడీ అయ్యింది. మార్చిలో జీతాల్లో పెంపు ఉంటుందని తెలుస్తోంది. ఈ మేరకు ఏప్రిల్ నుంచి ఉద్యోగులు పెరిగిన జీతాలు అందుకోనున్నారు. అయితే, శాలరీ పెంపు ఈ మారు 4 నుంచి 8 శాతం మధ్య ఉంటుందని సమాచారం. "శాలరీ పెంపు సమాచారం మాకు అందింది. ఈ సారి 4 - 8 శాతం మధ్య ఉంటుందని తెలిపారు. ఈసారి శాలరీ పెంపు తక్కువగానే ఉందని చెప్పకతప్పదు" అని ఓ ఉద్యోగి జాతీయ మీడియాకు తెలిపారు. 2022 ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్ ఉద్యోగుల శాలరీలు సగటున 10.5 శాతం మేర పెరిగాయి. కానీ గత ఆర్థిక సంవత్సరంలో మాత్రం ఇది 7-9 శాతానికి పడిపోయింది. ఇక భారతీయ టాప్ ఐటీ కంపెనీలు అన్నింటిలో ఈసారి జీతాల పెంపు ఓమోస్తరు స్థాయిలోనే ఉండనుంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికరంగంలో ఒడిదుడుకులు భారతీయ ఐటీ రంగంపై పడటమే ఇందుకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. కొవిడ్ సంక్షోభ సమయంలో భారతీయ ఐటీ ఉద్యోగులు అత్యధిక స్థాయిలో శాలరీల పెంపు పొందిన విషయం తెలిసిందే. మరోవైపు, భారత్‌లో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ శాలరీ పెంపునకు సంబంధించి ఫిబ్రవరి చివరికల్లా ఉద్యోగులకు సమాచారం ఇవ్వనుంది. ఇన్ఫోసిస్‌లో శాలరీ పెంపు 5 నుంచి 8 శాతం వరకూ ఉండొచ్చని అంచనా. ఇక టీసీఎస్‌లో ప్రస్తుతం ఆరు లక్షల పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. ఈ మార్చి నెలాఖరు కల్లా మరో 40 వేల మంది ఫ్రెషర్లను నియమించుకునేందుకు టీసీఎస్ యోచిస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఇంతకంటే ఎక్కువ మందిని నియమించుకోవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇక టీసీఎస్‌లో శాలరీ పెంపు, వేరియబుల్ పేఔట్ చెల్లింపులు ఉద్యోగుల రిటర్న్ టూ ఆఫీస్ లింక్ చేసినట్టు కూడా తెలుస్తోంది.

# భారీగా పెరుగుతున్న బంగారం దిగుమతులు

బంగారం దిగుమతుల పెరుగుదల జనవరిలో దేశ వాణిజ్య లోటు (దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం) వి23 బిలియన్లకు చేరుకుంది. చైనా తర్వాత భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు దేశం. దిగుమతులు ప్రధానంగా ఆభరణాల పరిశ్రమ అవసరాల కోసమే. జనవరిలో దేశంలో బంగారం దిగుమతులు 40.79 శాతం పెరిగి 2.68 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దేశీయ డిమాండ్ పెరగడం వల్ల బంగారం దిగుమతులు పెరిగాయి. ఈ సమాచారం వాణిజ్య మంత్రిత్వ శాఖ డేటా నుండి అందింది. ఒక సంవత్సరం క్రితం జనవరి 2024లో బంగారం దిగుమతులు వి1.9 బిలియన్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జనవరి కాలంలో బంగారం దిగుమతులు 32 శాతం పెరిగి 50 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 37.85 బిలియన్ డాలర్లుగా ఉంది. దిగుమతుల పెరుగుదల ఈ విలువైన లోహాన్ని సురక్షితమైన ఆస్తిగా పెట్టుబడిదారుల బలమైన విశ్వాసాన్ని కూడా సూచిస్తుంది. ప్రపంచ అనిశ్చితుల కారణంగా పెట్టుబడులను వైవిధ్యపరచడానికి బంగారంలో పెట్టుబడి పెట్టడం, బ్యాంకుల నుండి డిమాండ్, కస్టమ్ డ్యూటీ తగ్గింపు ఇతర కారణాలు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధర 11 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.88,200కి చేరుకుంది. 2023-24లో భారతదేశ బంగారం దిగుమతులు 30 శాతం పెరిగి వి45.54 బిలియన్లకు చేరుకున్నాయి. బంగారం దిగుమతులు




దేశ కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం చూపుతాయి. బంగారం దిగుమతులలో స్విట్జర్లాండ్ అతిపెద్ద వనరుగా ఉంది. దీని వాటా దాదాపు 40 శాతం. దీని తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (16 శాతం కంటే ఎక్కువ), దక్షిణాఫ్రికా (సుమారు 10 శాతం) ఉన్నాయి. దేశం మొత్తం దిగుమతుల్లో ఈ విలువైన లోహం వాటా ఐదు శాతం కంటే ఎక్కువ. బంగారం దిగుమతుల పెరుగుదల జనవరిలో దేశ వాణిజ్య లోటు (దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం) వి23 బిలియన్లకు చేరుకుంది. చైనా తర్వాత భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు దేశం. దిగుమతులు ప్రధానంగా ఆభరణాల పరిశ్రమ అవసరాల కోసమే. గత నెలలో రత్నాలు, ఆభరణాల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 15.95 శాతం పెరిగి దాదాపు 3 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. జనవరిలో దేశంలో వెండి దిగుమతులు 82.84 శాతం పెరిగి 883.2 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

## సామాన్యుడి కారు ధరకు రెక్కలు.. రేటు పెంచేసి షాక్ ఇచ్చిన కంపెనీ

దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న కార్ల జాబితాలో మారుతీ సుజుకి కంపెనీ తయారు చేసిన వ్యాగన్ ఆర్ తప్పనిసరిగా ఉంటుంది. కొన్నేళ్లుగా ఆటో మార్కెట్ లో దీని విక్రయాలు స్థిరంగా జరుగుతున్నాయి. కాలానుగుణంగా ఈ కారులో వివిధ మార్పులను తీసుకువచ్చారు. మారుతీ సుజుకీ వ్యాగన్ ఆర్ పాత ధర కంటే దాదాపు రూ.15 వేలు పెంచింది. కాగా.. ఈ పెరుగుదల మోడల్, వేరియంట్ ఆధారంగా రూ.32,500 వరకూ ఉంటుంది. మారుతీ సుజుకి వ్యాగన్ ఆర్ నాలుగు వేరియంట్లు, తొమ్మిది రకాల విభిన్న రంగులలో అందుబాటులో ఉంది. 1.0 లీటర్, 1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోలు ఇంజిన్లతో లభిస్తుంది. ట్రాన్స్ మిషన్ ఎంపిక ల్లో ఐదు స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్, ఏఎంటీ ఏర్పాటు చేశారు. పెట్రోలు - సీఎన్ జీ ఇంధన వేరియంట్ ను కూడా మార్కెట్ లోకి తీసుకువచ్చారు. 1.0 లీటర్ పెట్రోలు మోటారు నుంచి 55.92 బీహెచ్పీ గరిష్ట శక్తి, 92.1 ఎన్ఎం అధిక టార్కు విడుదల అవుతుంది. అలాగే 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ నుంచి 88.5 బీహెచ్పీ, 113 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి అవుతుంది. ఇంజిన్ వేరియంట్లకు అనుగుణంగా లీటర్ కు సుమారు 24 నుంచి 25 కిలోమీటర్ల మైలేజీ అందిస్తుంది. మారుతీ సుజుకి వ్యాగర్ ఆర్ ధర రూ.15 వేల వరకూ పెరిగింది. వీఎక్స్ఐ 1.0 ఏజీఎస్, జెడ్ ఎక్స్ఐ 1.2 ఏజీఎస్, జెడ్ ఎక్స్ ప్లస్ 1.2 ఏజీఎస్, జెడ్ ఎక్స్ ఐ ప్లస్ ఏజీఎస్ డ్యూయల్ టోన్ వేరియంట్లకు ఈ పెరుగుదల వర్తిస్తుంది. మిగిలిన అన్ని రకాల వేరియంట్లకు రూ.పది వేల చొప్పున పెరుగుదల నెలకొంది. పెరిగిన ధరల ప్రకారం ఆ కార్ల ధరలు (ఎక్స్ షోరూమ్) ఇలా ఉన్నాయి. బేస్ వేరియంట్ (ఎల్ఎక్స్ఐ) రూ.5.64 లక్షలు, వీఎక్స్ఐ రూ.6.09 లక్షలు,జెడ్ ఎక్స్ఐ రూ.6.38 లక్షలు,ఎల్ఎక్స్ఐ సీఎన్జీ రూ.6.54 లక్షలు,వీఎక్స్ఐ ఏజీఎస్ రూ.6.59 లక్షలు,జెడ్ఎక్స్ఐ ప్లస్ రూ.6.85 లక్షలు,జెడ్ఎక్స్ఐ ఏజీఎస్ రూ.6.88 లక్షలు,ఎల్ఎక్స్ఐ సీఎన్జీ రూ.6.99 లక్షలు,జెడ్ఎక్స్ఐ ప్లస్ ఏజీఎస్ రూ.7.35 లక్షలు, మారుతీ వ్యాగన్ ఆర్ కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అలాగే అనేక ప్రధాన కంపెనీల వాహనాలతో పోటీ పడుతోంది.



వీటిలో మారుతీ సెలెరియా, ఎస్ ప్రెస్సో, రెనాల్డ్ క్విడ్, హ్యుందాయ్ గ్రాంట్ నియోస్ ఐ10 వంటి హ్యాచ్ బ్యాక్ కార్లు ఉన్నాయి. అలాగే టాటా పంచ్, నిస్సాన్ మాగ్నైట్, రెనాల్డ్ కిగర్ వంటి ఎస్ యూవీలతో కూడా పోటీ నెలకొంది. వాహనాల తయారీ ఖర్చులు పెరగడం, మార్కెట్ వ్యూహాలు తదితర అంశాలు ధరలను పెంచడానికి కారణమని చెప్పవచ్చు.

## స్పోర్ట్స్

### బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు భారత తుదిజట్టు ఇదే!

# రోహిత్ కోరుకుంటేనే అతడికి ఛాన్స్

చాంపియన్స్ ట్రోఫీ-2025 టోర్నమెంట్‌కు టీమిండియా పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ మెగా ఈవెంట్లో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగనున్న రోహిత్ సేనకు లీగ్ దశలోని మూడు మ్యాచ్‌లు కీలకమే. ఇందులో ఒక్కటి ఓడినా సెమీ ఫైనల్ చేరే అవకాశాలపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఈ నేపథ్యంలో తుదిజట్టు ఎంపిక విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మూల్యం చెల్లించాల్సి వస్తుందంటున్నాడు భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా టీమిండియా ఈ టోర్నీలో ఆడబోయే తొలి మ్యాచ్‌కు తన ప్లేయింగ్ ఎలెవన్ ఇదేనంటూ యూట్యూబ్ వేదికగా అభిప్రాయాలు పంచుకున్నాడు.

**పేసర్ల విభాగంలో మాత్రం**

జట్టులో ఇద్దరు స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్లతో పాటు ఓ స్పెషలిస్టు స్పిన్నర్ తప్పక ఉంటాడన్న ఆకాశ్ చోప్రా.. అయితే, ఈ విషయంలో కెప్టెన్, హెడ్‌కోచ్ ఎవరివైపు మొగ్గుచూపుతారన్నది చెప్పడం కాస్త కష్టమేనని పేర్కొన్నాడు. ఇక పేసర్ల విభాగంలో మాత్రం మొదటి ప్రాధాన్య ఆటగాడిగా అర్ష్‌దీప్ సింగ్‌కు తప్పక స్థానం దక్కుతుందని అంచనా వేశాడు. కాగా 2017 తర్వాత తొలిసారిగా చాంపియన్స్ ట్రోఫీ జరుగనుంది. పాకిస్తాన్ వేదికగా ఈ వన్డే ఫార్మాట్ టోర్నీ మొదలుకానుండగా... టీమిండియా మాత్రం తమ మ్యాచ్‌లు దుబాయ్‌లో ఆడనుంది. ఇందులో భాగంగా గురువారం(ఫిబ్రవరి 20)




రోహిత్ సేన తమ తొలి మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-'ఎ'లో ఉన్న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఈ నేపథ్యంలో భారత తుదిజట్టు కూర్పు గురించి ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. "రోహిత్ శర్మ- శుబ్‌మన్ గిల్.. కెప్టెన్, వైస్ కెప్టెన్.. ఓపెనర్లుగా వీరే ఉంటారు. ఇక వన్‌డౌన్ బ్యాటర్ గురించి సందేహాలు అక్కర్లేదు. రన్ మెషీన్ కోహ్లి మూడో స్థానంలో వస్తాడు. ఇక నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ ఆడతాడు. నా అభిప్రాయం ప్రకారం.. అక్షర్ పటేల్ ఐదు, కేఎల్ రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేస్తారు. హార్దిక్ పాండ్యా ఏడు.. రవీంద్ర జడేజా ఎనిమిదో స్థానంలో ఆడతారు. ఒకవేళ రోహిత్ శర్మ కోరుకుంటే కుల్దీప్ యాదవ్ తుదిజట్టులో ఉంటాడు.

**నా ఓటు కుల్దీప్ యాదవ్‌కే**

అలా కాకుండా గంభీర్ తన నిర్ణయానుగుణంగానే వెళ్లాలనుకుంటే మాత్రం వరుణ్ చక్రవర్తికి అవకాశం వస్తుంది. అయితే, నేను మాత్రం కుల్దీప్ యాదవ్‌కే ఓటు వేస్తాను. ఇక నా జట్టులో అర్ష్‌దీప్ సింగ్ తప్పక ఉంటాడు. అతడికి తోడుగా మహ్మద్ షమీ తుదిజట్టులో ఉంటే పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది. ఒకవేళ అలాగాక హర్షిత్ రాణాను పిలిపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మిడిల్, డెత్ ఓవర్లలో అతడు చక్కగా రాణించగలడు" అని పేర్కొన్నాడు. దుబాయ్ పిచ్‌లకు అనుగుణంగా టీమిండియా బ్యాటర్లు క్రీజులో కాస్త ఎక్కువ సమయం గడిపితేనే భారీ స్కోర్లు చేయగలిగే ఆస్కారం ఉంటుందని ఆకాశ్ చోప్రా ఈ సందర్భంగా అభిప్రాయపడ్డాడు. చాంపియన్స్ ట్రోఫీ-2025: టీమిండియా వర్సెస్ బంగ్లాదేశ్ మ్యాచ్‌కు ఆకాశ్ చోప్రా ఎంచుకున్న భారత తుదిజట్టు రోహిత్ శర్మ(కెప్టెన్), శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్/వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ షమీ/హర్షిత్ రాణా.

### ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు మరో బిగ్ వికెట్ డౌన్

ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు మరో పెద్ద వికెట్ పడింది. న్యూజిలాండ్ స్టార్ పేసర్ లోకీ ఫెర్గూసన్ గాయం కారణంగా మెగా టోర్నీకి దూరమయ్యాడు. ఫెర్గూసన్ కుడికాలి పాదంపై గాయమైంది. ఫెర్గూసన్ ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనడంపై ముందు నుంచి అనుమానంగా ఉండింది. ప్రస్తుతం అదే నిజమైంది. ఫెర్గూసన్ ఛాంపియన్స్ ట్రోఫీ మొత్తానికి దూరం కానున్నాడని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఫెర్గూసన్‌కు రీప్లేస్‌మెం ట్‌గా కైల్ జేమీసన్‌ను ఎంపిక చేశారు న్యూజిలాండ్ సెలెక్టర్లు. గాయాల కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైన 11వ ప్లేయర్ ఫెర్గూసన్. ఇదివరకే స్టార్ ప్లేయర్లు పాట్ కమిన్స్, జోష్ హాజిల్‌వుడ్, జస్ప్రీత్ బుమ్రా, మిచెల్ స్టార్క్, అన్రిచ్ నోర్జే, గెరాల్డ్ కొయెట్జీ, సైమ్ అయూబ్, జేకబ్ బేతెల్, అల్లా ఘజన్‌ఫర్, బెన్ సియర్స్ గాయాల కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యారు. స్టార్ ఆటగాళ్లు.. ముఖ్యంగా పేసర్లు దూరం కావడంతో మెగా టోర్నీ కళ తప్పే అవకాశముంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు గాయం బారిన పడిన రెండో ఆటగాడు ఫెర్గూసన్. కొద్ది రోజుల ముందు పేసర్ బెన్ సియర్స్ కూడా గాయం బారిన పడ్డాడు. అతని స్థానంలో జేకబ్ డఫీ జట్టులోకి వచ్చాడు. తాజాగా ఫెర్గూసన్ కూడా గాయపడటంతో న్యూజిలాండ్ పేస్ విభాగం బలహీనపడినట్లు కనిపిస్తుంది. ఆ జట్టు పేస్ విభాగంలో మ్యాట్ హెన్రీ ఒక్కడే అనుభవజ్ఞుడు. కాగా, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 పాకిస్తాన్,




దుబాయ్ వేదికలుగా ఈ నెల 19 నుంచి ప్రారంభం కానుంది. టోర్నీ తొలి మ్యాచ్‌లోనే న్యూజిలాండ్ పాకిస్తాన్‌తో తలపడనుంది. కరాచీలో ఈ మ్యాచ్ జరుగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో జరుగనుండగా.. మిగతా మ్యాచ్‌లు పాకిస్తాన్‌లో జరుగుతాయి. ఈ టోర్నీలో భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు గ్రూప్-ఏలో ఉండగా.. గ్రూప్-బిలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ జట్లు పోటీపడుతున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 20న ఆడనుంది. తొలి మ్యాచ్‌లో టీమిండియా.. బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. అనంతరం ఫిబ్రవరి 23న భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరుగనుంది. మార్చి 2న భారత్.. న్యూజిలాండ్‌తో తమ చివరి గ్రూప్ స్టేజీ మ్యాచ్ ఆడుతుంది.

**ఛాంపియన్స్ ట్రోఫీ కోసం న్యూజిలాండ్ జట్టు..**

మార్క్ చాప్‌మన్, విల్ యంగ్, కేన్ విలియమ్సన్, డారిల్ మిచెల్, మైఖేల్ బ్రేస్‌వెల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), నాథన్ స్మిత్, డెవాన్ కాన్వే, టామ్ లాథమ్, విలియమ్ ఓరూర్కీ, మ్యాట్ హెన్రీ, జేకబ్ డఫీ, కైల్ జేమీసన్

### చరిత్ర సృష్టించిన కేరళ క్రికెటర్



అహ్మదాబాద్ వేదికగా గుజరాత్, కేరళ జట్ల మధ్య రంజీ ట్రోఫీ తొలి సెమీఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో కేరళ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేస్తుంది. రెండో రోజు రెండో సెషన్ సమయానికి కేరళ 134.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. వికెట్‌కీపర్ మొహమ్మద్ అజహారుద్దీన్ (105 నాటౌట్), సల్మాన్ నిజర్ (40 నాటౌట్) బ్యాటింగ్ చేస్తున్నారు. కేరళ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ సచిన్ బేబి (69) అ?ర్ధ సెంచరీతో రాణించగా.. అక్షయ్ చంద్రన్, రోహన్ కున్నుమ్మల్, జలజ్ సక్సేనా తలో 30 పరుగులు చేశారు. వరుణ్ నయనార్ 10 పరుగులకు ఔటయ్యాడు. గుజరాత్ బౌలర్లలో అర్జన్ నగస్వల్లా 2, పి జడేజా, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో సెంచరీతో కదంతొక్కిన మొహమ్మద్ అజహారుద్దీన్ రికార్డుబుక్కుల్లోకెక్కాడు. రంజీ సెమీఫైనల్లో సెంచరీ చేసిన తొలి కేరళ ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. రంజీల్లో కేరళ గతంలో ఒకే ఒ?క సారి సెమీస్‌కు చేరుకుంది. 2018-19 సీజన్‌లో కేరళ ఫైనల్ ఫోర్‌కు అర్హత సాధించింది. అయితే ఆ సీజన్ సెమీస్‌లో ఏ కేరళ ఆటగాడు సెంచరీ చేయలేదు. అజహారుద్దీనే రంజీల్లో కేరళ తరఫున సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ప్రస్తుత రంజీ సీజన్‌లో కేరళ అద్భుతమైన ప్రదర్శనలతో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఎలైట్ గ్రూప్-సిలో కేరళ 7 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 4 డ్రాలతో గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. క్వార్టర్ ఫైనల్లో కేరళ.. జమ్మూ అండ్ కశ్మీర్‌పై ఒక్క పరుగు ఆధిక్యం (తొలి ఇన్నింగ్స్‌లో) సాధించి సెమీస్ బెర్త్ దక్కించుకుంది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో విదర్భ, ముంబై జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 383 పరుగులకు ఆలౌటైంది. ముంబై బౌలర్ శివమ్ దూబే ఐదు వికెట్లతో రాణించాడు. షమ్స్‌ములానీ, రాయ్‌స్టన్ డయాస్ తలో రెండు, శార్దూల్ ఠాకూర్ ఓ వికెట్ తీశారు. విదర్భ ఇన్నింగ్స్‌లో ధృవ్ షోరే (74), దినిశ్ మాలేవార్ (79), యశ్ రాథోడ్ (54) అర్ధ సెంచరీలతో రాణించగా.. కరుణ్ నాయర్ (45), కెప్టెన్ అక్షయ్ వాద్కర్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అథర్వ తైడే 4, పార్థ్ రేఖడే 23, హర్ష్ దూబే 18, భూటే 11, యశ్ ఠాకూర్ 3 పరుగులు చేసి ఔట్ కాగా.. దర్శన్ నల్కండే 12 పరుగులతో అజేయంగా నిలిచాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబై.. 18 పరుగుల వద్దే తొలి వికెట్ కోల్పోయింది. దర్శన్ నల్కండే బౌలింగ్‌లో దనిశ్ మలేవార్‌కు క్యాచ్ ఇచ్చి ఆయుశ్ మాత్రే (9) ఔటయ్యాడు. ప్రస్తుతం ఆకాశ్ ఆనంద్ (29), సిద్దేశ్ లాడ్ (19) క్రీజ్‌లో ఉన్నారు. 23 ఓవర్ల అనంతరం ముంబై తొలి ఇన్నింగ్స్ స్కోర్ 62/1గా ఉంది. విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు ముంబై ఇంకా 321 పరుగులు వెనుకపడి ఉంది.

# ‘పుష్ప2’ ఫైనల్ కలెక్షన్స్.. ప్రకటించిన మేకర్స్

పుష్ప2 ఫైనల్ కలెక్షన్స్‌ను మేకర్స్ ప్రకటించారు. గతేడాది డిసెంబర్ 5న విడుదలైన ఈ చిత్రం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అనేక రికార్డులను రప్పా.. రప్పా.. రప్పా అంటూ దాటుకుంటూ వచ్చేసింది. 75 రోజుల్లో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 1871 కోట్ల (గ్రాస్) వసూలు చేసినట్టు చిత్ర యూనిట్ వెల్లడించింది. 2024లో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన సినిమాగా ‘పుష్ప 2’ నిలవడమే కాకుండా బాలీవుడ్ ఇండస్ట్రీగా నిలిచింది. సినిమా విడుదలైన ఆరు రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి భారతీయ మూవీగా పుష్ప2 రికార్డ్ క్రియేట్ చేసింది. ఇండియన్ సినిమా హిస్టరీలో అత్యధిక వసూలు సాధించిన చిత్రాల జాబితాలో ‘దంగల్’ (రూ.2024 కోట్లు) టాప్‌లో కొనసాగుతుంది. రెండో స్థానంలో ‘పుష్ప2’ (రూ. 1875 కోట్లు), మూడో స్థానంలో బాహుబలి-2 (రూ.1810 కోట్లు) ఉంది. తర్వాతి స్థానాల్లో ఆర్ఆర్ఆర్ (రూ.1387 కోట్లు), కేజీయఫ్- 2 (రూ.1250 కోట్లు), కల్కి 2898 ఏడీ (రూ.1153 కోట్లు), జవాన్ (రూ.1148 కోట్లు), పఠాన్ (రూ.1050 కోట్లు) వరుసగా ఉన్నాయి. ముఖ్యంగా పుష్ప2 సినిమాకు బాలీవుడ్‌లోనే అత్యధికంగా కలెక్షన్స్ వచ్చాయి. 100 ఏళ్ల బాలీవుడ్ చరిత్రలో పుష్పగాడికి ప్రత్యేక స్థానం దక్కింది. కేవలం హిందీ బెల్ట్‌లోనే రూ. 850 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. అక్కడ త్రీడీ వెర్షన్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. అల్లు అర్జున్ హీరోగా దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా మూవీ ఇండియన్ బాక్సాఫీస్ వద్ద గుర్తుండిపోయే రికార్డ్‌లను నమోదు చేసింది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో కూడా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో కొనసాగుతుంది. ఓటీటీ కోసం రీలోడెడ్ వర్షన్ పేరుతో అదనం మరో 24 నిమిషాల సీన్లను కలిపారు. దీంతో ఈ మూవీ నిడివి మొత్తం 3 గంటల 40 నిమిషాలుగా ఉంది.





## ఒక్క సినిమాతో లెవెలే మారిపోయింది

గత శుక్రవారం మంచి అంచనాల మధ్య విడుదలైన హిందీ సినిమా.. చావా. లెజెండరీ కింగ్ ఛత్రపతి శివాజీ తనయుడు శంబాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది. ఈ సినిమా ప్రోమోలన్నీ బాగున్నప్పటికీ.. విక్కీ మార్కెట్ స్థాయికి మించి ఖర్చు పెట్టి తీసిన భారీ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఏమాత్రం వర్కవుట్ అవుతుందో అన్న సందేహాలు ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమయ్యాయి. అందులోనూ అన్ సీజన్ అయిన ఫిబ్రవరిలో ‘చావా’ ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో థియేటర్లకు రప్పించగలగా అన్న అనుమానాలూ కలిగాయి. కానీ ‘చావా’ బాక్సాఫీస్ దగ్గర అద్భుతాలు చేస్తోంది. తొలి వారాంతంలో వంద కోట్లకు పైగా వసూళ్లు కొల్లగొట్టింది. బాలీవుడ్లో పెద్ద పెద్ద స్టార్ల సినిమాలకు కూడా ఓపెనింగ్స్ పడిపోతుండగా.. విక్కీ చిత్రానికి తొలి వీకెండ్లో ఏ రోజూ 30 కోట్లకు తక్కువ కాకుండా వసూళ్లు రావడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. సినిమాలో కంటెంట్‌కు తోడు.. విక్కీ స్టార్ పవర్ ఈ సినిమాకు బాగానే కలిసొస్తోంది.గత కొన్నేళ్ల నుంచి మంచి మంచి సినిమాలు, అదిరిపోయే పెర్ఫామెన్సులతో విక్కీ ప్రేక్షకాదరణ పెంచుకుంటూ వస్తున్నాడు. ‘సర్దార్ ఉద్దమ్ సింగ్’, ‘శ్యామ్ బహద్దూర్’ లాంటి చిత్రాల్లో విక్కీ నటనకు హిందీ ఆడియన్స్ ఫిదా అయిపోయారు. ఇప్పుడు ‘చావా’లో శంబాజీ మహారాజ్ పాత్రలో తన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్టింగ్ వేరే లెవెల్ అని చెప్పాలి. ‘చావా’ థియేటర్లలో ప్రేక్షకుల భావోద్వేగాలు, స్టాండింగ్ ఒవేషన్లు చూస్తుంటే ఈ సినిమా, విక్కీ పెర్ఫామెన్స్ వారిని ఎంతగా కదిలిస్తున్నాయో అర్థమవుతుంది. విక్కీ పెర్ఫామెన్స్‌కు సంబంధించి కొన్ని వీడియో క్లిప్స్ కూడా సోషల్ మీడియాలో తెగ తిరుగుతున్నాయి. ఇప్పటికే మంచి నటుడిగా గుర్తింపు సంపాదించినప్పటికీ.. శంబాజీ పాత్రలో వీరత్వాన్ని, రౌద్ర రసాన్ని, భావోద్వేగాలను విక్కీ పండించిన తీరు అద్భుతం అనే చెప్పాలి.

## మరో లక్కీ ఛాన్స్ కొట్టేసిన ‘మిస్టర్ బచ్చన్’ భామ



రవితేజ హీరోగా.. హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ‘మిస్టర్ బచ్చన్’ సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడిన భాగ్యశ్రీకి మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. దీంతో ఈ సుందరి టాలీవుడ్‌లో ఆమె వరుస ఆఫర్లతో బిజీగా మారిపోయింది. తాజాగా ఈ భామ మరో క్రేజీ ఆఫర్ కొట్టినట్లు టాక్ వినిపిస్తుంది.కోలీవుడ్ స్టార్ హీరో సూర్య సరసన నటించేందుకు భాగ్యశ్రీకి ఆఫర్ వచ్చినట్లు సమాచారం. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య ఓ సినిమా చేస్తున్నారని ఎప్పటి నుంచో టాక్ నడుస్తోంది. ఈ సినిమా కోసం భాగ్యశ్రీని హీరోయిన్‌గా అడిగినట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమాకి జివి ప్రకాశ్ సంగీతం అందించనున్నాడట. ఈ సినిమా ఈ ఏడాది మేలో పట్టాలెక్కనుందని టాక్. ఇక భాగ్యశ్రీ ప్రస్తుతం సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం ‘కాంత’ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాని రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్ఘీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. అంతేకాక.. మహేశ్ దర్శకత్వంలో రామ్ పోతినేని 22 చిత్రంగా తెరకెక్కుతున్న ప్రాజెక్ట్‌లో భాగ్యశ్రీ నటిస్తుంది. విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో వస్తున్న కింగ్‌డమ్ సినిమా కోసం ఈమెను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

## అనుపమకు ‘డ్రాగన్’ బర్త్ డే గిఫ్ట్ అయ్యేనా

మలయాళ చిత్రం ‘ప్రేమమ్’ తో 2015లో చిత్రసీమలోకి అడుగుపెట్టిన అనుపమా పరమేశ్వరన్ ఈ దశాబ్ద కాలంలో దక్షిణాది భాషా చిత్రాలన్నింటిలోనూ నటించి నటిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. మలయాళ సినిమాల్లో తొలిసారి నటించినా... ఆ తర్వాత సంవత్సరమే ‘అ...ఆ’ తో తెలుగు రంగంలోకి అడుగపెట్టింది. అంతేకాదు... మలయాళంలో ‘ప్రేమమ్’లో చేసిన పాత్రనే తెలుగు రీమేక్ లోనూ చేసింది. ‘అగరొత్తుల కురులే వలగ విసిరేసి’ కుర్రకారు గుండెల్లో సెగలు రేపింది. అదే యేడాది ‘కోడి’ మూవీతో కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది.

దిల్ రాజ్ బ్యానర్ లో రూపుదిద్దుకున్న ‘శతమానం భవతి’ చిత్రం అనుపమా పరమేశ్వరన్ కు మంచి విజయాన్నే కాదు చక్కని పేరూ తెచ్చిపెట్టింది. ఈ సినిమా జాతీయ స్థాయిలో ఉత్తమ వినోదాత్మక చిత్రం అవార్డుతో పాటు రాష్ట్ర స్థాయిలో ఐదు నందీ అవార్డులనూ గెలుచుకుంది. ఆ తర్వాత అనుపమా తెలుగులో చేసిన చిత్రాలేవీ పెద్దంత కమర్షియల్ సక్సెస్ సాధించలేదు. కానీ తమిళ రీమేక్ వచ్చిన ‘రాక్షసుడు’ ఫర్వాలేదనిపించింది. ఇక మూడేళ్ళ క్రితం వచ్చిన ‘రౌడీ బాయ్స్’ నుండి అనుపమా కాస్తంత గ్లామర్ ట్రీట్ ఇవ్వడం మొదలెట్టింది. అప్పటి వరకూ పక్కింటి అమ్మాయిలా కనిపించిన అనుపమా కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్ గా మారిపోయింది. ‘కార్తికేయ -2’లో పద్ధతి గల పాత్ర చేసినా... ‘టిల్లు స్క్వేర్’ లో లిప్ లాక్స్ తో సందడి చేసేసింది. గ్లామర్ పాత్రలకు అనుపమా న్యాయం చేస్తుందని ఆ సినిమా నిరూపించింది. పద్ధతిగల పాత్రల మీదుగా అందాల ఆరబోతకు జండా ఊపేసిన అనుపమా పరమేశ్వరన్ ‘బట్లర్ ఫ్లై’ వంటి లేడీ ఓరియంటెడ్ థ్రిల్లర్ మూవీలోనూ నటించింది. అలానే థాట్ ప్రొవోకింగ్ షార్ట్ ఫిల్మ్స్ సైతం చేసింది. ఇప్పుడు కూడా తెలుగులో ‘పరదా’ సినిమాలో అర్థవంతమైన పాత్రను పోషించింది. ఇవే కాకుండా ‘బైసన్’, లాక్ డౌన్, పెట్ డిటెక్టివ్, మరీచిక’ వంటి సినిమాలలో అనుపమా నటిస్తోంది. ఫిబ్రవరి 21న రాబోతున్న ‘డ్రాగన్’లో అనుపమా పరమేశ్వరన్... ప్రదీప్ రంగనాథన్ సరసన నటించింది. ఇది కూడా యూత్ ఫుల్ ఎంటర్ టైనరే! ‘లవ్ టుడే’ తో ఇప్పటికే యూత్ ను అట్రాక్స్ చేసిన ప్రదీప్ రంగనాథన్ లేటెస్ట్ మూవీ ‘డ్రాగన్’ కూడా హిట్ అయితే... అది అనుపమకు అభిమానులు ఇచ్చిన బర్త్ డే గిఫ్ట్ అనుకోవచ్చు.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com